
www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 27 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు వైశాఖ శుద్ధ పాడ్యమి
28 ఏప్రిల్ - 04 మే 2025
వెల : ₹20/-







# నెహ్రూ పత్రికకు గాంధీల పాతర

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

NAAC A — Accredited with Grade

# ADMISSIONS OPEN

## Courses Offered

श्रीचन्द्रशेखरेन्द्रसरस्वतीविश्वमहाविद्यालयः

**Sri Chandrasekharendra Saraswathi Viswa Mahavidyalaya (SCSVMV)**

Deemed to be University | Accredited by NAAC with 'A' Grade

Sponsored and run by Sri Kanchi Kamakoti Peetam Charitable Trust

### UG PROGRAMMES

**B.E.** (Full Time) CSE / Civil / ECE EEE / Mechanical
(Lateral Entry) CSE / Civil ECE / EEE / Mechanical
Mechatronics / B.Tech (IT)
(Part Time) EEE / Mechanical Civil / ECE
(Approved by AICTE)

- **B.A.M.S.** Bachelor of Ayurvedic Medicine and Surgery (Approved by NCISM)
- **B.Ed** Bachelor of Education (Approved by NCTE)
- **B.Sc.** Cyber Security / Data Science / Computer Science / Computer Science with Cognitive Systems / Chemistry / Physics / Mathematics ( with Computer Applications)
- **B.C.A.** Bachelor of Computer Applications
- **B.Com.** General / Computer Applications
- **B.B.A.** Bachelor of Business Administration
- **B.A.** Sanskrit* / English
- **Sastri (B.A.)** (Sahitya, Nyaya, Vyakarana, Advaita Vedanta)

### PG Programmes

- **M.B.A.** Master of Business Administration
- **M.C.A.** Master of Computer Applications
- **M.E.** Power System / CSE / Engineering Design / Embedded System Technologies (Full-time / Part-time)
- **M.S. / M.D.** Ayurveda (Approved by NCISM)
- **M.A.** (Sanskrit*) Sahitya / Nyaya / Vyakarana / Advaita Vedanta
- **M.Sc.** Physics / Chemistry / Mathematics
- **Acharya (M.A.)** (Sahitya, Vyakarana, Nyaya, Advaita Vedanta)

### Allied Health Sciences

- **B.P.T.** Bachelor of Physiotherapy
- **B.Optom.** Bachelor of Optometry
- **B.Sc.** Cardiac Technology / Radiology and Imaging Technology / Dialysis Technology

**Upto 75% waiver in Tuition Fee* under merit scholarship scheme**

*T& C Apply

### B.E. Hons. / Minor Degrees

- Artificial Intelligence and Machine Learning
- Cyber Security
- Data Science
- Electric Vehicles
- Internet of Things (IoT)
- Sensor Technology
- 3D Printing
- Robotics
- Microgrid Technology
- Electrical & Computer science
- Universal Human Values
- VLSI Design
- 5G communication systems
- Image Processing and Computer Vision
- Drone Technology

### LAW Programmes

B.A. LLB** / B.B.A. LLB** / LLB**

**Approval awaited

WiFi Enabled Campus

Wellness Center

Vibrant Sports & Culturals

Accessible Gym

**Excellent Placement Facilities!**

kanchiuniv.ac.in

**Apply Online!**

* ODL (Open Distance Learning) is also available

Contact: +91 96290 32323 | +91 96290 01144 | +91 80980 01630 (Ayurveda)

Campus Address: Sri Jayendra Saraswathi Street, Enathur, Kanchipuram, Tamil Nadu, India - 631561








# సంస్కృతిని రక్షిస్తేనే హిందూ ధర్మం నిలబడుతుంది: హంపీ పీఠాధిపతులు

సంస్కృతిని సేవించాలని, రక్షించాలని హంపీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి పిలుపునిచ్చారు. మనం చేసే సేవలు కచ్చితంగా శ్రీరామునికే చేరతాయన్నారు. పవిత్ర త్రివేణీ సంఘమ క్షేత్రం కందకుర్తిలో ఏప్రిల్ 18న లోకకల్యాణార్థం విఘ్నేశ్వర, స్కంద (కుమారస్వామి), రుక్మిణీ సహిత పాండుంగ విఠల, కేశవమూర్తి (పరమపూజనీయ డాక్టర్‌జీ ఇంటి దైవం) విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి భారతీస్వామి హాజరై, ఆశీఃప్రసంగం చేశారు.

ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ మనం చేసే పూజ ద్వారా 25% పుణ్యాన్ని పొందుతామని, సంస్కృతి రక్షణ ద్వారా మరో 25 శాతం పుణ్యం, సమాజసేవ ద్వారా మిగిలిన భాగం లభిస్తుందని వివరించారు. మన కుటుంబాలను, చుట్టుపక్కల వారిని, అట్టడుగువర్గాల ప్రజలను సేవించటం ద్వారా ఆశీర్వాదాలు, సానుకూల కర్మను పొందు తారని అన్నారు. సంస్కృతిని రక్షిస్తేనే హిందూ ధర్మం నిలబడుతుందన్నారు. కందకుర్తిలో ఈ ఆలయాల నిర్మాణం జరగడం ఎంతో ముదావహం అని అన్నారు.



ముఖ్యవక్తగా పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర కార్యవాహ తిప్పేస్వామి సంఘ నిర్మాత డాక్టర్‌జీ ప్రేరణదాయక జీవిత విశేషాలు, గ్రామీణ స్థాయిలో సంస్కృతి పునరుజ్జీవనంపై ప్రేరణాత్మక ప్రసంగం చేశారు.

కందకుర్తిలో నిర్మాణం అవుతున్న డాక్టర్‌జీ స్ఫూర్తి కేంద్ర వివరాలు, కందకుర్తి గ్రామ ప్రాశస్త్యం గురించి స్ఫూర్తి కేంద్ర ప్రకల్ప ఇంచార్జ్, సేవాభారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి వాసు వివరిస్తూ డాక్టర్జీ ఆర్‌ఎస్‌ఎస్‌ని స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్నాయి. ఈ సందర్భంలో ఒకప్పుడు డాక్టర్జీ పూర్వీకులు నివసించిన గ్రామం కందకుర్తి. సంఘ శతాబ్ది సందర్భంగా ఈ క్షేత్రంలో పూజ్య డాక్టర్జీ "స్ఫూర్తి కేంద్రం" భవ్యంగా నిర్మాణం జరుగుతోంది. 2025 విజయదశమికి ఈ స్ఫూర్తి కేంద్ర నిర్మాణం పూర్తవుతుందన్నారు. ప్రేరణాదాయకమైన వారి జీవిత్ర చరిత్ర ఇందులో నిక్షిప్తం చేయనున్నారు. ఇది భావి తరాలకు గొప్ప స్ఫూర్తి కేంద్రంగా మారనుంది. సమాజంలో ఆర్థిక సామాజిక వెనకబడిన ప్రజలకు చేయూతనివ్వటానికి వారి జీవితంలో వెలుగులు నింపటానికి పలు సేవా కేంద్రాలలో భాగంగా కేశవ విద్యాలయము, విద్యార్థి ఆవాస నిలయాలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మించనున్నారు. వీటితో పాటు యాత్రికుల కొరకు యాత్రి నివాస్ కాటేజీలు, డార్మెంట్స్ నిర్మించనున్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక వికాసం జరగడానికి అనుకూలంగా ఉండే భవనాలను కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో పలువురు సంస్కృతిపై, సేవాతత్పరతపై ప్రసంగించారు. అలాగే ఈ ఆలయాల నిర్మాణం, ధార్మిక పునరుజ్జీవనంపై కూడా ప్రసంగించారు.

ఏప్రిల్ 16 న కందకుర్తి గ్రామవీధులలో విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. అలాగే విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు జరిగాయి. 17వ తేదీన గోపూజతో ప్రారంభమై నవగ్రహ మండల పూజ, సర్వతోభద్ర మండల పూజ, వాస్తు మండల పూజ, స్థాప్య దేవతా మూలమంత్ర హవనం, ధాన్యాధివాసంతో పాటు పలు కార్య క్రమాలు జరిగాయి. ఏప్రిల్ 18వ తేదీన యంత్ర ప్రతిష్ఠ, అవభృత స్నానాలు, శిఖర యంత్ర ప్రతిష్ఠతో పాటు సార్వత్రిక సభతో ఈ కార్యక్రమం ముగిసింది.

ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పిట్ల కృష్ణ మహారాజ్‌తో పాటు కేశవ సేవాసమితి అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, తెలంగాణ ప్రాంత సంఘచాలక్ బర్ల సురేందర్ రెడ్డి, క్షేత్ర సేవాప్రముఖ్ ఎక్కాచంద్రశేఖర్, జిల్లా సంఘచాలక్ కాపర్తి గురుచరణ్, సైయంట్ వ్యవస్థాపక చైర్మన్, బోర్డ్ సభ్యులు అయిన బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, ప్రముఖ సామాజిక కార్యకర్త సిబిఆర్ ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త అనంతపై, అఖిల భారతీయ వనవాసి కల్యాణాశ్రమ మార్గదర్శక మండలి సభ్యులు సోమయాజులు, సంఘ కార్య కర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో పాటు డాక్టర్ హెడ్గేవార్ వంశస్థులు కూడా పాల్గొన్నారు. ★

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

**మ**హారాష్ట్రలో అవకాశవాద రాజకీయాలకు మరోసారి తెరలేస్తోంది. భాషా సంస్కృతుల పరిరక్షణ పేరుతో రాజకీయ దాయాదులు ఏడాది తక్కువ రెండు దశాబ్దాల తరువాత దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజకీయాలలో, అందులోనూ కుటుంబ సభ్యుల మధ్య శాశ్వత శత్రుత్వ మిత్రత్వాలు ఉండవనే షరా మామూలు నినాదాన్ని శివసేన, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధినేతలు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రేలు అందిపుచ్చుకున్నారు. ఇంతకాలం తూర్పు–పడమరలుగా ఉన్న అన్నదమ్ముల తనయుల కరచాలన యత్నాలకు హిందీ వ్యతిరేకత అనే అంశం ప్రధాన సాధనమైంది. జాతీయ విద్యా విధానం కింద 1 నుంచి 5వ తరగతి వరకు హిందీని మూడవ భాషగా విధిగా అమలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుపెట్టుకొని ఉభయులు చేతులు కలిపేందుకు సిద్ధపడ్డారు. తమకు రాజకీయాల కంటే మహారాష్ట్ర సాంస్కృతిక, భాషా పరిరక్షణే ప్రధానమని, మరాఠీ భాష, మరాఠీయుల ఆత్మగౌరవం ముఖ్యమంటూ.. అందుకు, తమ మధ్య గల చిన్నపాటి వివాదాలకు స్వస్తి పలుకుతామని ఇరువురు నేతలు సంకల్పం చెప్పుకొన్నారు. వివాదాలకు తాత్కాలిక 'విరామం' ప్రకటించారు. రాజ్యాంగపరంగా హోదాలు లేకపోయినా, శక్తిమంతమైన నాయకులుగా చెలామణిలో ఉన్న ఇద్దరికి అంతిమ లక్ష్యం అధికారమే? అందుకు సుమారు రెండు దశాబ్దాల నాటి సంఘటనే నిదర్శనం. శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రేకు తన తమ్ముడి కుమారుడు రాజ్ ఠాక్రే అత్యంత ప్రీతిపాత్రుడు అని ప్రతీతి. ఆయనే 'పెద్దాయన'కు రాజకీయ వారసుడు అవుతాడని కూడా చాలా మంది భావించారు. ఈలోగా అధినేత కుమారుడు ఉద్ధవ్ అరంగేట్రం, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా నియమితులు కావడంతో లెక్క తప్పింది. అలిగిన రాజ్ ఠాక్రే శివసేనకు వీడ్కోలు (2006) పలికి మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్)పేరిట వేరు కుంపటి పెట్టాడు. ఎన్నికల్లోనూ పోటీ చేశారు. సీట్లు గెలవకపోయినా ఓట్లు చీల్చడంలో 'సేన' కీలక పాత్ర వహించిందని నాటి ఫలితాలు రుజువు చేశాయి.

శివసేన 2022లో మళ్లీ చీలి ఉద్ధవ్ ముఖ్యమంత్రిత్వానికి ఎసరు తెచ్చింది.

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు వైశాఖ శుద్ధ పాడ్యమి**

## *లోపలి పేజీలలో...*




6లో

ముఖపత్ర కథనం

**నెహ్రూ పత్రికకు గాంధీల పాతర**


జాతీయం

**భారత్‌లో షరియా ఉన్మాదం**


12లో

ప్రత్యేక వ్యాసం

**చందన ప్రియుడికి అభివందన మాల**


20లో

# జాగృతి

## సంపాదకీయం

దేశవ్యాప్తంగా వరుస విజయాలను ఖాతాలో వేసుకుంటూ వస్తోన్న బీజేపీ నేతృత్వంలోని కూటమి మహారాష్ట్రలోనూ కొలువుదీరింది. దాంతో అధికారం కనుచూపు మేరలో లేదని అర్థమైన 'సోదర పక్షాలు' ఆత్మవిమర్శలో పడిపోయాయి. కలహించుకుంటే భారీగా నష్టపోతామన్న భావన లేదా భయంతో... ఉమ్మడి శత్రువును కలసి కట్టుగా ఎదుర్కొనాలనే వ్యూహమే ఈ కలయిక యత్నాలకు కారణమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే ఠాక్రే ద్వయం ఒక్కటైనా..

## 'మహా' అవకాశవాదం

ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎంతవరకు సహకరిస్తుందన్నది ప్రశ్న. సోదరులిద్దరు కలసి నడచినా, రాజ్ ఠాక్రే రాజకీయ ఎదుగుదలను ఉద్ధవ్ ఎన్నటికి సహించబోరని శివసేన నాయకుడు రాందాస్ కదమ్ లాంటి వారు వ్యాఖ్యానించడం గమనార్హం. మరోవంక, రాజ్ ఠాక్రే ఇప్పటి వరకు బీజేపీతో అంటకాగారన్నది ఉద్ధవ్ వర్గం ఆరోపణ. మరాఠీ భాష కోసం, మరాఠీయుల బాగు కోసం విభేదాలను పక్కన పెట్టేందుకు తాను సిద్ధమని, అయితే మహారాష్ట్ర వ్యతిరేకశక్తులకు దూరంగా ఉండాలని ఉద్ధవ్ షరతుపెట్టారు. ఆ శక్తులు ఏమిటో స్పష్టం చేయకపోయినా, రాజ్‌ను విశ్వాసంలోకి తీసుకుంటున్నట్లు లేదని ఆ ప్రకటన చెబుతోంది. వ్యక్తిగత స్వార్థం, ప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏకం కావాలని, అవిభక్త శివసేనలో ఉద్ధవ్‌తో కలసి పనిచేయడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్న రాజ్ ఠాక్రే ప్రకటనకు ఉద్ధవ్ సానుకూలంగా స్పందించారని వార్తలు వచ్చాయి. కానీ అటు ఇటు అనుయాయులు, అభిమానుల్లో సఖ్యతపై అనుమానాలు రేగుతూనే ఉన్నాయి. పైగా, అన్నదమ్ముల మధ్య కుటుంబపరంగా భావోద్వేగ చర్చలు మాత్రమే నడుస్తున్నాయి తప్ప ఇప్పటికిప్పుడు పొత్తులు లేవన్న ఉద్ధవ్ ఠాక్రే సన్నిహితుడు, ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్య ఉద్ధవ్ 'షరతు'కు లోబడే ఉందని భావించాలి.

ఠాక్రే సోదరుల మధ్య సయోధ్యపై జరుగుతున్న చర్చలను, బీజేపీ అధిష్ఠానం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్ అంతగా పట్టించుకోకపోగా, ఆ పరిణామాలను స్వాగతించారు. అయితే దీనిపై మీడియా అతిగా స్పందించిందని, అవసరానికి మించి దృష్టి సారించిందని వ్యాఖ్యానించారు. 'ఇద్దరు సోదరులకు సంబంధించిన అంశంలో మా జోక్యం అనవసరం. ఒకరు (రాజ్ ఠాక్రే) ప్రతిపాదించారు. మరొకరు (ఉద్ధవ్) అంది పుచ్చుకుంటున్నారు. కనుక దీనిపై అంతగా స్పందన కానీ వ్యాఖ్యానం కానీ అవసరంలేదు' అన్నారు ఫడణవీస్. విభేదాలు పరిష్కరించుకుంటే మంచిదే కదా? అని ముక్తాయించారు.

ఇక సోదరుల పునరేకీకరణపై ఎవరెన్ని కారణాల చూపినా, భాష్యాలు చెప్పినా, అది ఎన్నికల ఎత్తుగడలో భాగమనడానికి సందేహించనవసరం లేదు. గత ఎన్నికల్లో చవిచూసిన పరాజయం నుంచి బయటపడి త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అయినా పరువు దక్కించుకోవాలన్న యోచన ఈ రాజీ యత్నాలకు కారణంగా చెప్పవచ్చంటున్నారు. రాష్ట్రంలో మరాఠీ భాష అమలు కోసం కొంతకాలంగా ఉద్యమిస్తున్న రాజ్ ఠాక్రే, ఇప్పుడు హిందీ వ్యతిరేకతనూ భుజానికెత్తుకున్నారు. అదీ సమీప భవిష్యత్‌లో జరిగే ఎన్నికలకు ఆయుధంగానే విశ్లేషకులు పరిగణిస్తున్నారు. ఎంఎన్ఎస్‌తో చేతులు కలిపితే మున్సిపల్ కార్పొరేషన్ పోరులో పుంజుకోవచ్చన్నది ఉద్ధవ్ శివసేన అభిప్రాయంగా ఉంది. మరాఠీయులే బాగోగులే వారి ప్రథమ ప్రాధాన్యతను కుంటే కలసి నడవాలనుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమే!! ★

28 ఏప్రిల్ 2025, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**దృక్పథం**

- వి. శాంతి ప్రబోధ





అప్పులతో సంక్షేమం-ఖజానా వెలవెల (తెలంగాణ) - 14
కూటమి గూటికి వైసీపీ నేతలు (ఆంధ్రప్రదేశ్) - 16
స్వార్థపరుల నుంచి సామాన్యుల చెంతకు వక్ఫ్ ఆస్తి (వర్తమానం) - 22
ఉత్థాన పతనాలు అనివార్యం... (అంతర్జాతీయం) - 23
కృణ్వంతో విశ్వమార్యమ్! (ఆనో భద్రాః) - 28
కొలువుల వలలో "వర్ధమాన" యువత (లక్ష్యం) - 28
తొలి తెలుగు వచన వాగ్గేయకారుడు.. (గళమెత్తిన గతం) - 30
అనల్ప రచనల శిల్పి (మహిళ) - 36
ఐపీఎల్-18లో తెలుగు తేజాలు.. (క్రీడ) - 43
ఆకట్టుకోని భావోద్వేగాల అర్జున్ సన్నాఫ్ వైజయంతి (సినిమా) - 50

# నెహ్రూ పత్రికకు

**నేషనల్ హెరాల్డ్ కేసు పెద్దదే కానీ, దేశం పట్టించుకోవలసిన స్థాయిలో పట్టించుకోవడం లేదు. ఇది ప్రథమ ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన పత్రికే కావచ్చు. దీని పేరుతో వేల కోట్ల రూపాయలు దోచేశారన్న ఆరోపణలకు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని కోర్టు అభిప్రాయానికి వచ్చి ఉండవచ్చు. అయినా మీడియా, విపక్షాలు కాంగ్రెస్‌ను ఒక్క మాట కూడా అనడం లేదు. ఇక ఆరోపణలు ఎదుర్కొం టున్న కాంగ్రెస్ నేతలు ఇదంతా కక్ష సాధింపు చర్య అంటూ నిస్సిగ్గుగా రోడ్డెక్కడం ఈ ఉదంతంలోనే విస్తుపోయే అంశం. ఈ కేసుకు సంబంధించిన చార్జిషీట్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏప్రిల్ 9న ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టుకు సమర్పించింది. ఇందులోనే సోనియా పేరు ఏ1గాను, రాహుల్ గాంధీ ఏ2గాను ఉన్నారు. నెహ్రూ స్థాపించిన పత్రికకు నకిలీ గాంధీలు ఎసరు పెట్టి వేల కోట్ల రూపాయల ఆస్తులను జేబులో వేసుకున్నారన్న ఆరోపణలే ఇవన్నీ. అయినా పత్రికా స్వాతంత్ర్యం, వాటి గౌరవం గురించి మాట్లాడే ఏ ఒక్క వర్గం,**

నేషనల్ హెరాల్డ్‌తో నెహ్రూ అనుబంధం ఉద్వేగభరితమైనది. బహుశా నేటి నకిలీ గాంధీలకు ఈ వాస్తవం తెలిసి ఉండదు. నెహ్రూ పాలిట ఈ పత్రిక ఎప్పుడూ తెల్ల ఏనుగు బాపతుగానే ఉంది. 1938లో మొదలైన పత్రిక 1948 లో ఒక దశాబ్ద కాలంలోనే మూడేళ్లు మూతపడింది. పత్రికా సిబ్బందితో ఒకసారి జరిగిన సమావేశంలో, ఒకటి నిజం, మనకు వ్యాపారం చేయడం ఎలాగో తెలియదు అన్నారట నెహ్రూ. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మాత్రం, అలహాబాద్‌లో ఉన్న ఆనంద భవన్‌ను అమ్మడానికైనా సిద్ధమే కానీ, నేషనల్ హెరాల్డ్‌ను వదలుకోను అన్నారట నెహ్రూ. స్వాతంత్ర్యోద్యమంతో ఇంత మమేకమైన పత్రిక, నెహ్రూ స్థాపించిన పత్రికను నకిలీ గాంధీలు నడిరోడ్డు మీద అమ్మేశారు. అయినా ఇది తప్పుకాదన్నట్టే ఆ పార్టీ వ్యవహరిస్తున్నది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరామ్ రమేశ్ చార్జిషీట్‌ను రాజకీయ ప్రతీకార చర్యగా అభివర్ణించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అయితే, చార్జిషీట్లతో కాంగ్రెస్‌ను బెదిరించలేరని వ్యాఖ్యానించారు. యథాప్రకారం కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు, విపక్షాలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నదని పాత పాటే కాంగ్రెస్ వినిపించింది. ఇంతకీ ఈ కేసు మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉండగానే 2012లో కోర్టుకు వచ్చింది. నెహ్రూ సొమ్మును నకిలీ గాంధీలు దోచుకోవడమే ఈ మొత్తం ఉదంతం సారాంశం.

నేషనల్ హెరాల్డ్ వివాదం ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో దశాబ్దంగా నలుగుతున్నదే. తాజాగా ఇంత సంచలనం రేకెత్తడానికి కారణం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏప్రిల్ 9న సమర్పించిన ఆరోపణల పత్రంలో ఏ 1గా సోనియా గాంధీ, ఏ 2గా రాహుల్ గాంధీ పేర్లను చేర్చారు. అంటే ఆ ఇద్దరి మీద నేరారోపణ చేసి, విచారణ ఆరంభించ డానికి అనుమతి వచ్చింది. దీనితోనే మరొకసారి దీని మీద జాతికి ఉత్సుకత పెరిగింది. చార్జిషీట్ అంటే ఆరోపణల పత్రం. దీనినే తుది నివేదిక లేదా పోలీస్ నివేదిక అంటారు. ఒక నేర కార్యకలాపం మీద పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు దర్యాప్తు పూర్తి చేసిన తరువాత సమర్పించే పత్రం. ఇందులో కేసు పరిచయం ఉంటుంది. సేకరించిన సాక్ష్యాలు ఉంటాయి. నిందితుల మీద చేసిన ఆరోపణల గురించి ఉంటుంది. దీనిని ఒకసారి కోర్టుకు సమర్పిస్తే, కోర్టు ఆమోదిస్తే ఇక విచారణ మొదలయి నట్టే. కాబట్టి సోనియా,రాహుల్ విచారణను ఎదుర్కొనబోతున్నారు. అది దేశం చూడబోతున్నది.

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీల మీద నమోదైన ఆరోపణ మనీలాండ్రింగ్ (మనీ లాండ్రింగ్ ఒక చట్టవిరుద్ధ చర్యకు పెట్టిన పేరు. ఇందులో నేరపూరిత పద్ధతులలో పెద్ద ఎత్తున సొమ్ము సేకరిస్తారు. ఈ సేకరణలో మత్తు మందుల అక్రమ రవాణా, ఉగ్రవాదులకు నిధులు కూడా ఉండొచ్చు. అయితే ఇలా నేరపూరిత చర్యల ద్వారా సేకరించిన సొమ్మును చట్టబద్ధమైనదిగా చూపడమే మనీ లాండరింగ్. నేరపూరిత మార్గాలలో నగదు తెస్తారు కాబట్టి, దానికి మకిలి అంటి ఉంటుంది. దానిని లాండరర్స్ శుభ్రం చేస్తారు. కాబట్టి మనీ లాండ్రింగ్ అని పిలుస్తారు). బీజేపీ నాయకుడు డాక్టర్ సుబ్రమణియం స్వామి 2012లో దాఖలు చేసిన కేసు ఇది. మనీలాండ్రింగ్, పార్టీ నిధుల దుర్వి నియోగం అన్న అరోపణలతోనే డాక్టర్ స్వామి కూడా



# గాంధీల పాతర




**దేశంలో ఎమర్జెన్సీ వాతావరణం ఉన్నదని విరుచుకుపడే మీడియా ఈ విషయం మీద ఇంకా గుంభనంగా ఉంది. ఒక్క విపక్షం కూడా నోరు విప్పడం లేదు. బీజేపీ, ఈడీల దాష్టీకాలకు వ్యతిరేకంగా అంటూ కాంగ్రెస్ ఈ అంశం మీద దేశవ్యాప్త నిరసనలు నిర్వహించింది. మొత్తానికి ఈ నిరసనతో నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ ప్రమేయం ఎంత లోతుగా ఉన్నదో జాతి యావత్తుకు తెలిసింది. పనిలో పనిగా ఈ కేసులో కాంగ్రెస్ పార్టీని నడిపిస్తున్న ఇద్దరు ప్రముఖులు కూడా నిందితులేనన్న విషయం కూడా భారతజాతి మొత్తానికి తెలిసింది.**

కోర్టును ఆశ్రయించారు.

ఈ కేసును అర్థంచేసుకోవడానికి కొన్ని విషయాలు పరిశీలించాలి. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) అనే సంస్థ భారత జాతీయ కాంగ్రెస్ నుంచి రూ. 90.25 కోట్లు రుణంగా తీసుకుంది. దీనికి వడ్డీ లేదు. ఈ రుణం తిరిగి తీర్చలేదు. అయితే యంగ్ ఇండియన్ అనే ఒక సంస్థను 2010లో చేర్చారు. దీని మూలధనం రూ. 50 లక్షలు. కానీ ఈ యంగ్ ఇండియన్ తరువాత ఏజేఎల్ ఆస్తులు మొత్తం (రూ 5,000 కోట్లు) తన వశం చేసుకుంది. ఇందులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ప్రమేయం ఉందని చెబుతూ డాక్టర్ స్వామి కోర్టు తలుపు తట్టారు.

అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) ఒక అన్‌లిస్టెడ్ కంపెనీ. దీనిని నవంబర్ 20, 1937న నేషనల్ హెరాల్డ్ పత్రిక వ్యవహారాలలోకి తీసుకువచ్చారు. దీని చిరునామా హెరాల్డ్ హౌస్, 5-ఎ, బహదూర్ షా జఫార్ మార్గ్, న్యూఢిల్లీ. ఇది నెహ్రూ ఆలోచనే. ఇంతకీ ఏజేఎల్ సొంత ఆస్తి ఏమీ లేదు. ఇదే నేషనల్ హెరాల్డ్ ప్రచురణకర్త. ఈ పత్రిక 5000 మంది స్వాతంత్ర్య సమరయోధుల వాటా ధనంతో ప్రారంభమయింది. అంటే వీళ్లే ఏజేఎల్ భాగస్వాములు. ఏజేఎల్ మూలధనం విలువ రూ 5 లక్షలు. ఏజేఎల్ స్థాపనకు సంబంధించిన పత్రం మీద పండిట్ నెహ్రూతో పాటు కాంగ్రెస్ ప్రముఖులు పురుషోత్తమదాస్ టండన్, ఆచార్య నరేంద్రదేవ్, కైలాస్‌నాథ్ కట్జు, రఫీ అహ్మద్ కిద్వాయ్, కృష్ణదత్ పాలీవాల్, గోవిందవల్లభ్ పంత్ సంతకాలు చేశారు. నిజానికి ఈ సంస్థ ఏ వ్యక్తికీ చెందినది కాదు. ఒక్క వార్తా సంస్థలతో సహా మరే ఇతర వాణిజ్య సంస్థతోను ఇది సంబంధాలు నెరపదు. ఏజేఎల్ కంపెనీల రిజిస్ట్రార్‌కు సమర్పించిన నివేదిక ప్రకారం సెప్టెంబర్ 29,2010 నాటికి ఏజేఎల్‌లో 1,057 మంది వాటాదారులు ఉన్నారు. మార్చి 22,2002 నుంచి మోతీలాల్ ఓరా (ఇప్పుడు మన మధ్య లేరు) ఏజేఎల్ చైర్మన్, ఎండీగా ఉన్నారు. 2011లో ఏజేఎల్‌ను యంగ్ ఇండియా సంస్థకు బదలాయించారు. అప్పటికి ఇది నష్టాలలో నడుస్తున్నది.

ఏజేఎల్ 2008 వరకు నేషనల్ హెరాల్డ్ (ఇంగ్లిష్)తో పాటు క్వామీ ఆవాజ్ (ఉర్దు), నవజీవన్ (హిందీ) ప్రచురించేది. ఏజేఎల్‌కు ఢిల్లీ, లక్నో, భోపాల్, ముంబై, ఇందోర్, పట్నా, పంచకుల్ వంటి చోట స్థిరాస్థులు కూడా ఉన్నాయి. వీటి విలువ రూ 50 బిలియన్‌లు. ఆరంతస్తుల హెరాల్డ్ హౌస్ కార్యాలయ భవనం సహా మిగిలిన ఆస్తులు 10,000 చదరపు మీటర్లు. ఇంత జరిగిన తరువాత జనవరి 21, 2016న ఏజేఎల్ లక్నోలో సమావేశమై నేషనల్ హెరాల్డ్‌తో పాటు మిగిలిన రెండు పత్రికలు పునఃప్రారంభించాలని నిర్ణయించడం విశేషం. అంటే కేసు బిగుస్తున్నదని అర్థమైన తరువాత కంటి తుడుపుగా తీసుకున్న నిర్ణయం. అయినా 2014లో నరేంద్ర మోదీ అధికారంలోకి వస్తారని ఊహించని కాంగ్రెస్ చేసిన అనేక అవమానకర చర్యలలో ఇది కూడా ఒకటి. ఏజేఎల్ వెనుక ఉన్న వేల కోట్ల ఆస్తులు యంగ్ ఇండియన్ సంస్థకు బదలీ అయినది 2010లోనే.


డా. స్వామి

నేషనల్ హెరాల్డ్ కేసులో తమకు సమన్స్ ఇవ్వకుండా డిస్‌మిస్ చేయాలంటూ సోనియా గాంధీ చేసిన అప్పీల్‌ను కింది కోర్టు కొట్టివేసింది. దీనితో వాటాదారులు గళం విప్పారు. వీరంతా స్వాతంత్ర్య సమరయోధుల సంతానమే. ఒక్క సమావేశానికి కూడా తమకు నోటీసు ఇవ్వలేదని, తమకు తెలియకుండా ఏజేఎల్ వాటాలను (అంటే స్వాతంత్ర్య సమరయోధు లవి) యంగ్ ఇండియన్‌కు బదలీ చేశారని (డిసెంబర్, 2010) వారు ఆరోపించారు. ఏజేఎల్ వాటాదారులలో శాంతిభూషణ్ (అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి), మార్కండేయ కట్జు (మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్) వంటి ప్రసిద్ధులు కూడా ఉన్నారు.

ఏజేఎల్ నుంచి వాటాలు బదలాయించుకున్న యంగ్ ఇండియన్ ఒక ప్రైవేట్ కంపెనీ. నవంబర్ 23,2010న ఏర్పాటయింది. దీని చిరునామా 5ఎ హెరాల్డ్ హౌస్, బహదూర్ జఫర్ మార్గ్, ఢిల్లీ. అంటే ఏజేఎల్ చిరునామాయే. యంగ్ ఇండియన్ సంస్థకు ఒకరిని డైరెక్టర్‌గా నియమించారు. డిసెంబర్ 13,2010న డైరెక్టర్‌గా వచ్చిన వ్యక్తి సాక్షాత్తు రాహుల్ గాంధీయే. జనవరి 22, 2011న పాలక మండలిలో సోనియా గాంధీ చేరారు. కొత్త కంపెనీలో 76 శాతం వాటాలు సోనియా, రాహుల్ పేరిట మారాయి. 24 శాతం కాంగ్రెస్ నాయకులు మోతీలాల్ ఓరా, ఆస్కార్ ఫెర్నాండెజ్‌లకు చెరి 12


# నేషనల్ హెరాల్డ్

పత్రికల ధ్యేయం వార్తలను అందించడం. అలాంటిది ఒక దశాబ్దకాలంగా పత్రికలలో పతాకశీర్షికగా దర్శనమిస్తున్న పత్రిక నేషనల్ హెరాల్డ్. నేషనల్ హెరాల్డ్ జవాహర్‌లాల్ నెహ్రూ స్థాపించారు. నెహ్రూ ఎదుర్కొన్న రాజకీయ ఆశనిరాశల నుంచి ఉద్భవించినదే పత్రిక ఆలోచన, అదే నేషనల్ హెరాల్డ్ రూపంలో వెలువడింది అంటారు నెహ్రూ జీవిత చరిత్రకారుడు బెంజిమిన్ జకారియా. 1930లోనే పత్రిక ఆలోచన చేశారు. అందుకు కారణం, స్వరాజ్య సమరంలో వస్తున్న మార్పు. పదునెక్కుతున్న భావాలు. అభిప్రాయాల మధ్య పెరిగిన సంఘర్షణ. భారత జాతీయ కాంగ్రెస్‌లో రియాక్షనరీ శక్తులు పెరిగిపోయాయని వీటిని ఎదుర్కొనడానికి పత్రిక అవసరమని నెహ్రూ భావించారట. ఆ ఆలోచన 1936 నాటికి తీవ్ర రూపం దాల్చింది. సెప్టెంబర్ 9, 1938న లక్నో నుంచి తొలి సంచిక వెలువడింది. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమం పత్రికకు గదాఘాతంగా మారింది. కాంగ్రెస్‌ను నిషేధించారు. నేషనల్ హెరాల్డ్ సహా 80 ఇతర పత్రికలు మూతపడ్డాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు అది ఇచ్చిన ప్రకటనలను ప్రచురించే పని పత్రికలు చేస్తే, అవి కరపత్రాలుగా మారిపోతాయని, స్వేచ్ఛ లేనప్పుడు ప్రచురణ నిలిపివేయడవే ఉత్తమమని గాంధీజీ పిలుపునిచ్చారు. దానితోనే నేషనల్ హెరాల్డ్ ప్రచురణను నిలిపివేశారు. పత్రిక తిరిగి నవంబర్ 1945లో పున: ప్రారంభమైంది. ఎం.చలపతిరావు సంపాదకుడు. దీనికి కోటంరాజు రామారావు, కుష్వంత్‌సింగ్ కూడా సంపాదకులుగా పనిచేశారు. 'స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. నీ శక్తితో దానిని రక్షించు' నినాదం పత్రిక మీద ఉండేది. 1975-77 మధ్య ఈ నినాదం కనుమరుగైంది. కారణం, అది అత్యవసర పరిస్థితి కాలం. ఆ సమయంలో కాంగ్రెస్ పత్రిక కాబట్టి అత్యవసర పరిస్థితిని సమర్ధించింది.




శాతం వంతున దఖలయ్యాయి. కాబట్టే యంగ్ ఇండియన్‌ను డాక్టర్ స్వామి సోనియా, రాహుల్ సొంత సంస్థని పేర్కొన్నారు. ఏజేఎల్‌కు చెందిన రూ.16 బిలియన్‌ల విలువైన భూమిని యంగ్ ఇండియన్ సంస్థ హస్తగతం చేసుకున్నదని ఆయన ఆరోపించారు. దీనితో పాటు ఆ మూడు పత్రికల ప్రచురణ హక్కులు కూడా వీరికే దఖలు పడినాయని కూడా స్వామి తెలియచేశారు. యంగ్ ఇండియన్ సంస్థకు భారత జాతీయ కాంగ్రెస్ నుంచి రూ 90 కోట్ల రుణం, ఎలాంటి పూచీ లేకుండా ఇచ్చిన మాట నిజమేనని ఏజేఎల్ ఫిబ్రవరి 26, 2011న ప్రకటించింది. ఒక రాజకీయ పార్టీ వాణిజ్య సంస్థకు రుణం ఇవ్వడం ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 29 ఏ ప్రకారం చట్ట విరుద్ధమని కూడా డాక్టర్ స్వామి వాదన. అలాగే ఆదాయచట్టం 1961లోని 13ఎ సెక్షన్ ప్రకారం కూడా ఇది చట్ట విరుద్ధమేనని డాక్టర్ స్వామి ఆరోపించారు. కాబట్టి సీబీఐ దర్యాప్తు చేయాలని సూచించారు. ఆ రుణం ఇచ్చినది కేవలం నేషన్ హెరాల్డ్ పునరుద్దరణకే తప్ప వాణిజ్య అవసరాలకు కాదని తరువాత యంగ్ ఇండియన్ వివరణ ఇచ్చింది. చివరికి ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని ధ్రువీకరించిన కోర్టు సమన్స్ జారీ చేసింది. న్యాయస్థానం గమనించిన సాక్ష్యం- ప్రజాధనాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం బదలాయించుకోవడానికే యంగ్ ఇండియా లిమిటెడ్ సంస్థను స్థాపించారని అనుకోవలసి వస్తున్నది.

జూన్ 26,2014న మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జస్టిస్ గోమతి మోనాచా సోనియా, రాహుల్, మోతీలాల్ ఓరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శామ్ పిట్రోడాలకు నోటీసులు జారీ చేశారు. ఆగస్ట్ 7, 2014న కోర్టు ముందు హాజరు కావాలన్నదే వాటి సారాంశం. ఈ సమన్స్‌ను నిలిపివేయవలసిందిగా కోరుతూనే సోనియా ఢిల్లీ హైకోర్టుకు వెళ్లారు. అయినా విచారణ ఆగలేదు. ఈ కేసులోనే మే 2019న రూ 64 కోట్లు, నవంబర్ 2023న రూ. 751 కోట్ల రూపాయల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శాశ్వత ప్రాతిపదికను అటాచ్ చేసింది. ఏప్రిల్ 9 ,2025న ఈడీ చార్జ్‌షీట్ దాఖలు



చేసి, సోనియాను ఏ1గాను, రాహులల ఏ 2గాను పేర్కొన్నది.

దీనికి తోడు మరొక కేసు కూడా నమోదై ఉంది. ప్రస్తుతం ఇది పంజాబ్–హరియాణా హైకోర్టులో విచారణలో ఉంది. హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా ఇందులో నిందితుడు. సీబీఐ దర్యాప్తు చేస్తున్నది. పంచకుల్‌లోని ఒక ఆస్తి గురించిన వివాదం ఇది. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌కు హుడా తన హోదాను అడ్డం పెట్టుకుని భూములు కేటాయించి, రాష్ట్ర ఖజానాకు కోట్లాది రూపాయల నష్టం తెచ్చారన్నదే ఆ ఆరోపణ.

నేషనల్ హెరాల్డ్ అవినీతి వ్యవహారంలో సోనియా, రాహుల్ దొరికి పోయారని బీజేపీ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. ఈ కేసుతో తమను బెదిరించలేరని ఏఐసీసీ అధ్యక్షుడు విమర్శలు లంఘించుకున్న క్రమంలో ఠాకూర్ ఈ విమర్శలు చేశారు. ఈ విమర్శలు మామూలే అయినా, ఈ సందర్భంలో ఠాకూర్ నేషనల్ హెరాల్డ్ మీద చేసిన ఆరోపణలు గమనించ దగినవి. సుబ్రమణియం స్వామి 2012లో ఈ పత్రిక అవతవకల మీద కోర్టుకు వెళ్లారు. అయితే 2016లో కాలికి అంటిన బురదను కడుక్కునే ఉద్దేశంలో పత్రికను తిరిగి ప్రారంభించారు. అయితే అది ఎవరు చదువుతున్నారో ఎప్పుడు వస్తున్నదో ఎవరికీ తెలియదని ఠాకూర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆ పత్రికను మళ్లీ మళ్లీ ప్రారంభించాలని ఆరాటపడుతున్నది కానీ సాధ్యం కావడం లేదని ఆయన విమర్శించారు. 2016లో తిరిగి ప్రచురణ ప్రారంభించినట్టు మాత్రం చెప్పారు. అదికూడా డిజిటల్ రూపంలో మాత్రమే. అందుకే తాము ఎప్పుడు నేషనల్ హెరాల్డ్ గురించి మాట్లాడినా తత్తరపడుతూ


NATIONAL HERALD

Alert in Bihar as violence spreads

MANY AKALIS HELD ON SAMAGAM-EVE

Tension grips Capital

Patel: No cut in taxation

Governor's rule in Jaintia Hills

Janata on course

Kalpnath Rai attacked

ఉంటారని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి ఆయన అన్నారు. నిజానికి కాంగ్రెస్ చరిత్రలో అనేక ఆర్థిక అవక తవకలు ఉన్నాయని అందులో నేషనల్ హెరాల్డ్ పత్రిక వ్యవహారం ఒకటి మాత్రమేనని ఠాకూర్ గుర్తు చేశారు. అసలు ఆ పత్రికను చదివేవారు ఎవరూ లేరని ఆయన ఎద్దేవా చేశారు. దానిని ఎప్పుడూ అచ్చుకు పంపరు. కొన్ని పత్రికలు పేపర్ మీద అచ్చువుతాయనీ, కొన్ని పత్రికలు కేవలం పేపర్ మీద ఉంటాయని ఆయన విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ రెండో రకం పత్రిక అని చెప్పారాయన. ఆ పత్రిక తరపున వచ్చిన విలేకరులను తాను ఎప్పుడూ చూడలేదని, అదొక వారపత్రిక మాత్రమేనని, కానీ దినపత్రిక కంటే ఎక్కువ నిధులు తీసుకుంటున్నదని ఆయన అన్నారు. ఈ పత్రిక నడపడానికి వివిధ రాష్ట్రాలలో నేతలు ఆస్తులు దఖలు పరిచారని, ఇది కాంగ్రెస్ మార్కు అవినీతి అని ఆయన విమర్శించారు.

నిరంతరం అవినీతికి వ్యతిరేకంగా రంకెలు వేసే రాహుల్, ఆయన తల్లి సోనియా నిందితులుగా బోను ఎక్కబోతున్నారు. ఒకచేతిలో రాజ్యాంగం పట్టుకుని ఊరేగే రాహుల్ కేసులో తనను ఏ 2గా చేర్చిన తరువాత రాజీనామా చేసి ఉండవలసింది. అసలు బ్రిటిష్ పౌరసత్వం కేసుతో, పరువు నష్టం కేసులలో ఇరుక్కుని ఉన్న రాహుల్ గాంధీకి ఇదొక జీవన్మరణ సమస్య. అయినా దీనిని అధిగమించడం ఆయనకు పెద్ద కష్టమని ఆయన తీరును పరిశీలిస్తున్నవారు ఇట్టే చెబుతారు. రాజ్యాంగ నిబంధనలైనా, ప్రజాస్వామ్య పరిరక్షణ అయినా అది ఇతరుకు చెప్పడం వరకే. అవేవీ రాహుల్‌కు చెందినవి కావు.

**– జాగృతి డెస్క్**

# అదిగో అరెస్టు.. ఇదిగో సూత్రధారులు..!

**పంజాబ్ నేషనల్ బ్యాంకు– పీఎన్‌బీలో రూ.13,500 కోట్ల అవినీతి వ్యవహారంలో ప్రధాన నిందితుడు, దేశం నుంచి పారిపోయి విదేశాల్లో నక్కిన వజ్రాల వ్యాపారి మేహుల్ చోక్సీని బెల్జియంలో అధికారులు ఏప్రిల్ 12న అరెస్టు చేశారు. భారత ప్రభుత్వం అతడి అప్పగింత కోసం చేసుకున్న అభ్యర్థనకు స్పందనగా చోక్సీని అరెస్టు చేశారు. చోక్సీ తన భార్య ప్రీతితో కలసి బెల్జియంలో ఉంటున్నాడు. అక్కడే రెసిడెన్సీ కార్డును కూడా సంపాదించుకున్నాడు.**

చోక్సీ అరెస్టు ఒక భారీ స్కాంకు సరైన ముగింపును ఇచ్చి, సత్వర న్యాయం అందించే దిశగా వేసిన ఒక కీలకమైన అడుగు అని చెప్పుకోవాలి. అదే సమయంలో స్కాం, తదనంతరం సంభవించిన పరిణామాలపై ప్రశ్నల తేనెతుట్టెను ఈ అరెస్టు మరోసారి కదలించింది. చోక్సీ దేశంలోనే అతి పెద్ద బ్యాంకింగ్ స్కాంకు ఎలా పాల్పడ్డాడు? అతడు అంత పెద్ద నేరం చేసినప్పటికీ దేశం నుంచి ఎలా తప్పించుకొని పారిపోగలిగాడు? ఈ కేసు మూలాల్లోకి వెళ్లడానికి ముందు ఈ స్కాం మూలాలు ఏ కాలంలో ఉన్నాయని వెదికితే అవి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఉన్న కాలంలో, భారత రిజర్వ్ బ్యాంక్–ఆర్బీఐ గవర్నర్‌గా రఘురామ్ రాజన్ పనిచేస్తున్న కాలంలో వేళ్లూనుకున్నాయని తేలింది.

**కాంగ్రెస్, ఆర్బీఐ మౌన ప్రేక్షక పాత్ర**

మేహుల్ చోక్సీ, అతడి బంధువు ప్రమేయంతో ఈ భారీ స్కాం 2011లో మొదలైనప్పుడు కేంద్రంలో యూపీఏ కూటమి అధికారంలో ఉంది. సంబంధిత అధికారులు నెత్తీ నోరూ బాదుకొని మొత్తుకున్నప్పటికీ ఈ స్కాం ఏళ్ల తరబడి అడ్డూ అదుపూ లేకుండా సాగిపోయింది.

ఈ కాలంలోనే నానాటికి పెరిగిపోతున్న అవకతవకలను కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం చూసీచూడనట్టుగా వదిలేసింది. అంతకు సమానంగా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ – ఎల్‌వోయూలు దుర్వినియోగాన్ని అడ్డుకోవడంలో గవర్నర్ రఘురామ్ రాజన్ హయాంలో ఆర్బీఐ నిష్క్రియాపరత్వం ఆందోళన కలిగించే రీతిలో ఉంది. ఈ ఎల్‌వోయూలతో ఎలాంటి గ్యారంటీలు లేకుండా అదే పనిగా పెద్ద మొత్తంలో రుణాలను దక్కించుకున్నారు స్కాంలో నిందితులు. ఈ మోసపూరితమైన ఎల్‌వోయూలను అటు బ్యాంకు స్థాయిలో కానీ ఇటు ఆర్బీఐ స్థాయిలో కానీ గుర్తించకుండా జారీ చేస్తూ పోవడం అత్యంత దిగ్భ్రాంతికరం. ఇది సంస్థాగత నిర్లక్ష్యాన్ని, ఒక వ్యవస్థీకృత వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది.

**చోక్సీ కోసమని 20:80 గోల్డ్ స్కీమ్!**

మే 16, 2014న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించింది. తదుపరి ప్రధాని ప్రమాణ స్వీకారం చేసేంతవరకు ఆపద్ధర్మ ప్రభుత్వంగా కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి అధికారంలో ఉంది. సరిగ్గా ఆ సంధి కాలంలోనే అప్పటి ఆర్థిక మంత్రి పి.చిదంబరం అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నట్టుగా ఆఖరి నిమిషంలో అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఇదేదో చూడబోతే అయినవారికి అప్పనంగా కావలసినవి కట్టబెడుతున్నట్టుంది. అందులో ఓ




చోక్సీ (కుడి) నోరు విప్పకుండానే నోళ్లకు తాళం వేసుకున్న సూత్రధారులు

భాగమే అన్నట్టుగా చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్‌తో పాటుగా 13 కంపెనీలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తూ వివాదాస్పద 20:80 బంగారం దిగుమతి పథకం కింద ఒక ఉత్తర్వుపై చిదంబరం సంతకం పెట్టారు. ఈ పథకం కంపెనీలను దిగుమతి చేసుకున్న బంగారంలో 20 శాతాన్ని ఎగుమతి చేయడానికి, మిగిలిన 80 శాతం బంగారాన్ని దేశీయ మార్కెట్‌లో విక్రయించు కోవడానికి అనుమతిస్తుంది. ఇది బంగారం అక్రమ నిల్వలను ప్రోత్సహిస్తుందనే విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఇదే విషయమై పరిశ్రమ వర్గాలు హెచ్చరికలు చేసినప్పటికీ వాటిని పెడచెవిన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వమూ, గవర్నర్ రఘురామ్ రాజన్ ఏలుబడిలోని ఆర్బీఐ రెండూ కూడా చూసీ చూడనట్టుగా భారీ ఎత్తున ఆర్థిక అక్రమానికి ఓ వేదికను సిద్ధం చేశాయి.

### స్కాంకి చోక్సీ బలిపశువా?

ఆగస్టు, 2018న మేహుల్ చోక్సీ లాయర్ డేవిడ్ డోర్‌సెట్ రిప్లబిక్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో యావత్ స్కాంలో తన క్లయింట్‌ను బలిపశువును చేశారని చెప్పడం ద్వారా సంచలనానికి తెరతీశారు. స్కాం వెనుక పెద్ద పెద్ద రాజకీయ తలకాయ లున్నాయని తెలిపారు. చోక్సీకి గతంలో కాంగ్రెస్‌తో సంబంధాలు ఉన్న కారణంగానే అతడి పేరును స్కాంలోకి లాగారని ఆరోపించారు. ఆయన చెప్పినదాని ప్రకారం అందరూ అనుకున్న ట్టుగా చోక్సీ, నీరవ్ మోదీలు స్కాంకి సూత్రధారులు కాదు. వారిద్దరూ కూడా రాజకీయంగా ప్రేరేపితమైన ఒక కపటోపాయానికి బాధితులు మాత్రమే.

### కాక్‌టైల్ పార్టీలో నీరవ్‌తో రాహుల్ భేటీ

స్కాం జరిగినప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉండి, తర్వాత బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా అవతరించిన షెహజాద్ పూనావాలా స్కాంకి ఆసక్తికరమైన ఒక కొత్త సంగతిని చేర్చారు. 2013లో ఢిల్లీలో జరిగిన కాక్‌టైల్ పార్టీలో నీరవ్ మోదీని రాహుల్ గాంధీ కలుసుకున్నారని ఆయన ఆరోపించారు. పీఎన్‌బీ స్కాంన్ని బైటపెడతానన్న ఓ వ్యక్తి నోరు మూయించినప్పుడే ఈ భేటీ జరగడం విశేషం. అప్పట్లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఉన్న రాజీవ్ టక్రు కనుసన్నల్లోనే ఎలాంటి అడ్డూ అదుపూ లేకుండా అక్రమంగా రుణాలను మంజూరు చేశారు. స్కాంన్ని బైటపెడతానన్న వ్యక్తికి ఉస్టింగ్ ఆర్డర్ ఇవ్వడానికి అప్పటి ఆర్థిక మంత్రి పి.చిదంబరం ఆమోదం తెలిపారు. చిదంబరం ఆమోదం కుంభకోణం గుట్టు రట్టు చేయకుండా ఉండటంలో రాజకీయ ప్రమేయాన్ని బట్టబయలు చేస్తోంది.

### రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌కు చోక్సీ విరాళాలు


2014-15 మధ్య కాలంలో చోక్సీ డైరెక్టర్‌గా ఉన్న నవీరాజ్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ సోనియా గాంధీ ఆధ్వర్యంలోని రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కు – ఆర్‌జీఎఫ్ విరాళాలు ఇచ్చింది. ఆర్‌జీఎఫ్ బోర్డులో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కూడా ఉన్నారు. సరిగ్గా ఆ సమయంలోనే చైనాతో పాటుగా విదేశీ ప్రభుత్వాల నుంచి అప్పటికే నిధులు అందుకున్న కాంగ్రెస్ పార్టీ యక్షప్రశ్నలను ఎదుర్కొంటున్నది. ఇదే ఆర్‌జీఎఫ్ యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు పర్యావరణం, అటవీ శాఖ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, చిన్నతరహా పరిశ్రమలు, చివరకు హోమ్ మంత్రిత్వ శాఖలాంటి కేంద్ర మంత్రిత్వశాఖల నుంచి విరాళాలను అందుకున్నది. ఇది ప్రజాధనం దుర్వినియోగాన్ని వెలుగులోకి తెస్తోంది. రాజకీయ అధికారం, ప్రభుత్వ వ్యవస్థలు, ప్రైవేటు ప్రయోజనాలు ఒకదానితో మరొకటి పెనవేసు కోవడంపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.

### ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా చోక్సీ న్యాయవాది

కాంగ్రెస్ పార్టీకి, చోక్సీకి మధ్య అనుబంధాన్ని మరింత బలపరుస్తున్నట్టుగా కాంగ్రెస్ పార్టీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా చోక్సీ న్యాయవాది హెచ్.ఎస్. రాజమౌళిని నిలబెట్టింది. ఇది కాంగ్రెస్ పార్టీ ఇంటా బయటా రచ్చకు దారి తీసింది.

బెల్జియంలో మేహుల్ చోక్సీ అరెస్టుతో అతడిని దేశానికి తీసుకురావడంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో పురోగతి కనిపిస్తోంది. అదే సమయంలో రాజకీయ అధికారం, అక్రమ విధానాలు, ఆర్బీఐ ఉదాసీనతల ప్రమాదకరమైన కలబోత పీఎన్‌బీలో రూ.13,500 కోట్ల స్కాంన్ని సుసాధ్యం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఏళ్ల తరబడి పాటించిన మౌనం, ప్రశ్నించడానికి అర్థమైన నిర్ణయాలు, రాజకీయ రక్షాకవచం ఇవన్నీ కలిసి భారతదేశపు అతి పెద్ద బ్యాంకు స్కాంల్లో ఒకదానికి పునాది వేయడంలో సాయపడ్డాయి.

('ఆర్గనైజర్' సౌజన్యంతో)





# ముస్లింలకేనా మానవ హక్కులు?

**పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలకు అధికారం, ఆధిపత్యం ఉండేవి. ప్రస్తుతం బెంగాల్‌లో కమ్యూనిస్టు పార్టీలు పత్తా లేకుండా పోయినప్పటికీ కేరళలో మాత్రం అధికారాన్ని పంచుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీకి కూడా రెండు చోట్లా ఘనమైన రాజకీయ చరిత్ర ఉంది. కేరళ జనాభాలో హిందువులు 54%, ముస్లింలు 27%, క్రైస్తవులు 18% ఉన్నారు. పశ్చిమ బెంగాల్ జనాభాలో హిందువులు దాదాపు 70% ఉంటే, ముస్లింలు 27%, క్రైస్తవులు, తదితరులు అల్పసంఖ్యాక వర్గీయులుగా ఉన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలతో ఈ రెండు రాష్ట్రాల మధ్య తాజాగా మరో సారూప్యత కనిపించింది.**

కేరళలోని మలప్పురం జిల్లాపై ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్‌కు మంచి పట్టు ఉంది. ఆందోళనకారులు వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా కరిపూర్ అంతర్జాతీయ విమానాశ్రయంలోకి రాకపోకలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఆందోళనకారులు ఇస్లాం నేతలు హస్సన్ అల్-బన్నా, సయ్యద్ ఖుతుబ్‌లతో పాటుగా హమాస్ టెర్రరిస్టుల పోస్టర్లను బహిరంగంగా ప్రదర్శించారు. ఇది అక్కడి సామాన్య ప్రజల్లో తీవ్రమైన ఆందోళనను కలిగించింది. సరిగ్గా అదే సమయంలో పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు మొదలయ్యాయి. ముర్షిదాబాద్‌లో హిందువులు లక్ష్యంగా హింస్మాతక దాడులు జరిగాయి. హిందువుల ఇళ్లకు, దుకాణాలకు నిప్పు పెట్టారు. దీంతో అనేక హిందూ కుటుంబాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, రాష్ట్రంలో సురక్షిత ప్రాంతాలకు పారిపోయారు. ముష్కరుల దాడిలో తండ్రీకొడుకులతో పాటుగా ముగ్గురు హిందువులు ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిణామాలన్నీ కూడా రెండు రాష్ట్రాల్లో వేళ్లూనుకుంటున్న మతపరమైన ఉద్రిక్తతలను వేలెత్తి చూపుతున్నాయి. రెండు చోట్లా నానాటికి పెరిగిపోతున్న అనిశ్చితిపై హెచ్చరిక ఘంటికలను మోగిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ముర్షిదాబాద్‌కు, కేరళలో మల్లప్పురంకు దగ్గర పోలికలు ఉన్నాయి. మలప్పురం జిల్లా మొత్తం జనాభాలో ముస్లింలు దాదాపు70% ఉంటే, హిందువులు 27%, క్రైస్తవులు 2% ఉన్నారు. ముర్షిదాబాద్ జిల్లాలోని మొత్తం జనాభాలో ముస్లింలు దాదాపు 67% ఉంటే, హిందువులు 32%, మిగిలినవారు ఒక శాతం కన్నా తక్కువగా ఉన్నారు. రెండూ జిల్లాలూ కూడా ఆయా రాష్ట్రాల్లో ముస్లింల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలుగా నిలిచాయి.

**సూడో సెక్యూలరిజం..**
**ఓటు బ్యాంకు రాజకీయాలు**

కేరళలో ఘనత వహించిన సెక్యులర్ పార్టీలు సహనం, కలిసిమెలిసి ఉండటం గురించి అదేపనిగా నీతులు చెబుతుంటాయి. కానీ మతపరమైన ఉద్రిక్తతలు చోటు చేసుకున్నప్పుడు మరీ ముఖ్యంగా బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో హిందువులు, కేరళలోని మునాంబమ్‌లో అల్పసంఖ్యాకులైన హిందువులు, క్రైస్తవులకు ముప్పు వాటిల్లినప్పుడు ఈ సెక్యులర్ పార్టీలు నోరు మెదపకపోవడం వాటి చిత్తశుద్ధి పట్ల తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ మౌనం వెనుక ఓటు బ్యాంకు కోల్పోకూడదనే ఓ రాజకీయ వ్యూహం ఉందా లేక ఎంపిక చేసుకున్న యాక్టివిజమ్ ప్రభావమా? అనే ప్రశ్నలు వాటిలో కొన్ని మాత్రమే. సీపీఐ(ఎం), కాంగ్రెస్, ఐయూఎంఎల్ పదేపదే చెబుతున్నట్టుగా మానవ హక్కులు, న్యాయం అనేవి నిజంగా సార్వజనీన విలువలైన పక్షంలో మతాలకు అతీతంగా హింసలో బాధితులందరికీ సమానమైన అక్కర, ఆదరణ లభించాలి. అయినప్పటికీ ఈ సమభావన కొరవడినట్టు కనిపిస్తోంది.

ఇటీవలి సంవత్సరాల్లో కేరళ ప్రజల్లో అత్యధికులు ఈ రాజకీయ పార్టీలు నిర్దేశిత తీవ్రవాద శక్తులకు వ్యూహాత్మక మద్దతు ఇవ్వడమో లేకుంటే కనీసం వాటి దుందుడుకు వైఖరిని ఉపేక్షించడమో చేస్తున్నాయని నమ్ముతున్నారు. పార్టీల ఈ వైఖరి మునాంబమ్‌లో వివాదాస్పద వక్ఫ్ బోర్డు భూమి ఆక్రమణ కావొచ్చు, బెంగాల్‌లో జరిగినట్టుగా ఇతర మతాలకు చెందినవారిపై దాడుల విషయంలో స్పష్టంగా కనిపిస్తోంది. వీటటిన్నింటినీ చూసిన తర్వాత రాజకీయ సౌలభ్యంకోసమని భావజాలాన్ని అటకెక్కిస్తున్నారు. మతపరమైన భావోద్వేగాలను సార్వజనీనంగా కాకుండా ఎంపిక చేసుకున్నవాటికే అండగా నిలుస్తున్నారు.

కేరళలోని మునాంబమ్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. భూ ఆక్రమణలు, కోల్పోతున్న జీవిక, తీవ్రమైన వివక్షపై అల్పసంఖ్యాక హిందూ, క్రైస్తవ, ముస్లిం మతాలకు చెందిన వారు మెజార్టీగా ఉన్న మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఈ దారుణాన్ని స్థానిక నేతలు, మీడియా మరోసారి వెలుగులోకి తెచ్చినప్పటికీ పైన చెప్పుకున్న రాజకీయ పార్టీలు వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నాయి. ఎందుకీ ద్వంద్వ వైఖరి? అదే ముస్లింలపై హింసాత్మక దాడులు జరిగితే సీపీఐ(ఎం), కాంగ్రెస్, ఐయూఎంఎల్ వెంటనే ఖండిస్తాయి. అదే హిందువులపై జరిగితే మిన్నకుండిపోతాయి. కేరళలోని పార్టీలు పాలస్తీనా, టర్కీలో ముస్లింల కోసమని గొంతెత్తినప్పుడు అవి బెంగాల్‌లో హిందువులు, మునాంబమ్‌లో మత్స్యకారులకు అండగా మాట్లాడాలి. అలాంటి సందర్భాల్లో ఏ పార్టీ అయితే మౌనంగా ఉంటుందో ఆ పార్టీ తాను చెప్పుకుంటున్న విలువలకు పాతరేసినట్టవుతుంది. అంతేకాకుండా అది నేడు ఏ మతాల మధ్యన అయితే ఐక్యత, అవగాహన అత్యంత అవసరమో వాటి మధ్య విభజన, అపనమ్మకం అనే చిచ్చును పెడుతుంది.

– జాగృతి డెస్క్

**సవరణ:** ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్‌గా డాక్టర్ మోహన్ భాగవత్ 2009లో బాధ్యతలు స్వీకరించారు. కానీ ఏప్రిల్ 7-13, 2025 సంచికలో 'రేషింబాగ్‌లో భారత ప్రధాని' అన్న వ్యాసంలో మోహన్‌జీ 2000లో బాధ్యతలు స్వీకరించినట్టు ప్రచురితమైంది. పొరపాటుకు చింతిస్తున్నాం.

– ఎడిటర్

భారతదేశాన్ని అఫ్ఘానిస్తాన్‌లా మార్చే ప్రయత్నం చాప కింద నీరులా సాగిపోతోంది. సార్వభౌమాధికారం కలిగిన భారత్‌లో వందలాది షరియా కోర్టులు నడుస్తున్నాయంటే నమ్మక తప్పదు. మొన్న పశ్చిమ బెంగాల్‌లో షరియా చట్టం మేరకు ఒక ముస్లిం వనితను నడిరోడ్డు మీదే కొరడాలతో కొట్టారు. నిన్న కర్ణాటకలోని దావణగెరె జిల్లాలో ఆరుగురు వీరాధివీర పురుషులు షరియా ఆదేశం మేరకు ఒక మహిళను చావగొట్టారు. ఇది భారతదేశంలో జడలు విప్పుతున్న ముస్లిం మతోన్మాదం స్వరూపానికి మచ్చుతునక. సంవత్సరం క్రితం పశ్చిమ బెంగాల్‌లో చోప్రా అనే చోట మసీదు పెద్దలే పంచాయతీ నిర్వహించి ఒక మహిళకు నడిరోడ్డు మీదే కొరడా దెబ్బల శిక్షను అమలు చేశారు. అక్కడ తీర్పరి తజ్మల్ హక్. ఇతడు టీఎంసీ అనే పెద్ద సెక్యులర్ పార్టీ స్థానిక నాయకుడు. అంటే మమతా బెనర్జీ అనుచరుడు. దీనికి ఆనాడు టీఎంసీ ఎమ్మెల్యే హమీదుల్ రహమాన్ ఇచ్చిన వివరణ అందరినీ హతాశులను చేసింది. ఇలాంటి తీర్పులు, పంచాయతీలు చూసి ఆవేశ పడనవసరం లేదని, "ముస్లిం దేశం"లో అనుసరించేది ఇదే న్యాయమని హమీదుల్ చాచికొట్టినట్టు చెప్పలేదా! ఆ దారుణం గురించి జాతి ఇంకా మరచిపోలేదు. ఇప్పుడు కర్ణాటకలో అదే తరహా కేసు బయటపడింది. దావణగెరె జిల్లా తావరెకరె గ్రామంలో (చన్నగిరి తాలూకా)ని జామా మసీదు ఎదుటే పట్టపగలు ఈ దురంతం చోటు చేసుకుంది. పశ్చిమ బెంగాల్ మహిళకు కొరడా దెబ్బలు, దావణగెరె మహిళకు కర్రలు పైపుల దెబ్బలకు కారణం ఒక్కటే. వారి శీలాలను శంకించడమే.



# భారత్‌లో

ఈ వార్తకు ప్రాధాన్యం ఇచ్చి ఓ నాలుగు పంక్తులు రాస్తే భారత సెక్యులర్ వ్రతాన్ని భంగం చేసిన పాపం తగులుతుందేమోనని చాలా పత్రికలు వెంటనే వెల్లడించలేదు. పశుత్వానికి ఏ మాత్రం తక్కువకాని ఈ చర్య మొత్తానికి కొందరిని కదిలించింది. ఏప్రిల్ 7న జరిగిన దుర్ఘటన 15 తరువాత గాని బయటకు రాలేదు. వారం తరువాత ఎవరో ఆ వీడియోను బయటపెట్టారు. కొంతంతా కదిలింది.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో, సదా మైనారిటీల రక్షణ గురించి మాట్లాడే రాహుల్ పార్టీ రాజ్యంలో ఇది జరిగింది. అది వీడియోలో రికార్డయి సామాజిక మాధ్యమాల ద్వారా దేశవ్యాప్తమయింది. కాబట్టే కర్ణాటక కాంగ్రెస్ వీర సెక్యులర్ ప్రభుత్వం పెను నిద్దరను వదలవలసి వచ్చింది. ఇది ముందే దేశం మీదకు చేరింది కాబట్టి సరిపోయింది. లేకుంటే ఆ వీడియో తీసినవాడిని ఈ పాటికి జైల్లో కూర్చోబెట్టి ఉండేవారు. మసీదు పెద్దలని కాపాడేవారు.

పట్టపగలు అంతా చూస్తూ ఉండగానే 38 ఏళ్ల మహిళను ఆ ఆరుగురు కర్రలతో, పైపులతో చావగొట్టేశారు. ఇందుకు కారణం– గృహచ్ఛిద్రాల పేరుతో ఆమె భర్త మసీదులో ఇచ్చిన ఫిర్యాదు. ఇక్కడ వివాదాన్ని విచారించడానికీ, ఆలస్యం లేకుండా చావగొట్టే శిక్ష విధించడానికీ మసీదుకు ఏం హక్కు ఉందని ప్రశ్నించకండి! కనీసం స్పందించకండి! ఎందుకంటే– మీరు హిందూ మతోన్మాది అయిపోతారు. లేదా ఆర్ఎస్ఎస్, బీజేపీ వంత పాడేవారు కూడా అయిపోగలరు.

ఇంతకీ ఏం జరిగిందంటే– ఏప్రిల్ 7న షాబినా బాను అనే ఆ 38 ఏళ్ల మహిళ తన బంధువు నస్రీన్‌తో కలసి బయటకు వెళ్లింది. వారితో ఫయాజ్ అనే పురుషుడు కూడా ఉన్నాడు. వీరంతా తిరిగి వచ్చిన తరువాత షాబినా భర్త జమీల్ అహ్మద్ నస్రీన్‌ను, ఫయాజ్‌ను తన ఇంటిలో చూశాడు. అంతే, జమీల్‌కు కోపం తన్నుకు వచ్చింది. తావరెకెరె జామా మసీదుకు వెళ్లి భార్య మీద, ఆ ఇద్దరి మీద ఫిర్యాదు చేశాడు. ఇంతకీ ఇతడికి భార్య తరపు బంధువులు పురుషులు గాని, స్త్రీలు గాని తన ఇంటికి రావడం ఇష్టం ఉండదట. ఏప్రిల్ 9న షాబినా, నస్రీన్, ఫయాజ్‌లను తమ ముందు హాజరు కావలసిందిగా హుకుం జారీ చేసింది. ఆమె మసీదుకు చేరుకోగానే కొందరు కర్రలతో, పైపులతో షాబినా మీద దాడికి దిగారు. ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆఖరికి వీడియో వైరల్ అయిన తరువాత ఆరుగురు మీద దాడి, కుట్ర, హత్యాయత్నం ఆరోపణలతో కేసు నమోదు చేశారు.

మసీదు వేసిన శిక్షను అమలు చేసిన వీర మతావలంబీకుల పేర్లు, వృత్తులు ఒకసారి చూద్దాం. మహమ్మద్ నియాజ్ (32) డ్రైవర్, మహమ్మద్ గౌస్ పీర్ (45) చెత్తాచెదారం అమ్ముకునే వాడు, చాంద్ బాషా (35) చెరుకురసం అమ్మేవాడు, దస్తగీర్ (24) బైక్ మెకానిక్, రసూల్ టీఆర్ (42) మత్స్యకారుడు, ఇనాయత్ ఉల్లా (51) స్థానికుడు. వీళ్లంతా కర్రలతో, పైపులతో కొట్టడమే కాకుండా, తనపై రాళ్లు విసిరి చంపేందుకు చూశారని కూడా షాబినా చన్నగిరి పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది.

అంతేకాదు, తన పిల్లల మీద కూడా దాడి చేసి కొట్టారని ఆమె ఫిర్యాదు చేసింది. మసీదు నుంచి ఇంటికి వెళ్లిపోయానని, కానీ మనసు, శరీరం గాయాలతో తీవ్రంగా బాధపెట్టాయని ఆమె చెప్పారు. అందుకే భరించలేక పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్టు చెప్పారామె. ప్రస్తుతం ఆమె స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఈ మత రక్షకులందరిపైనా భారతీయ న్యాయ సంహిత కింద కేసులు నమోదు చేశామని, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని కూడా నియమించామని పోలీసులు చెప్పారు.

ఎవరేమనుకున్నా ఈ దేశంలో షరియాయే తమకు ప్రధానమని చెబుతున్న ముస్లిం రాజకీయ నాయకులు కూడా ఉన్నారు. ఇందుకు తాజా ఉదాహరణ ఏప్రిల్ 14న జరిగింది. జార్ఖండ్ మంత్రి హఫీజుల్ హసన్ తాను భారత రాజ్యాంగం కంటే షరియాకే మొదటి స్థానం ఇస్తానని చెప్పాడు. మేం ఖురాన్‌ను మా గుండెలలో మోస్తాం, రాజ్యాంగాన్ని మాత్రం చేత్తో పట్టుకుంటాం అని కూడా అన్నాడతడు.

కొన్ని నివేదికల ప్రకారం మన 'సెక్యులర్' భారతదేశంలో దాదాపు 100 షరియా కోర్టులు నడుస్తున్నాయి. ఈ విషయాన్ని 2023లోనే అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు చెప్పుకున్నది. ముస్లింలు ఎక్కువగా ఉన్న జిల్లాలలో వాటి సంఖ్య ఇంకా పెంచాలన్న ప్రతిపాదన కూడా ఉన్నట్టు బోర్డు వెల్లడించింది. దేశమంతటా దారుల్ ఖాజా (అంటే షరియా కోర్టులు) స్థాపించాలని 2018లోనే ఆ సంస్థ నిర్ణయించింది. కానీ ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం త్రోసిపుచ్చింది. తమ తమ వివాదాల పరిష్కారానికి



# షరియా ఉన్మాదం

షరియా కోర్టులను ఆశ్రయించాలని 2020లో అఖిల భారత మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ ముస్లింలకు సూచించింది. ఆశ్చర్యం కలిగించినా, భారత మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ కూడా ఇలాంటి సూచనే ముస్లింలకు చేశాడు. కేరళలో ఈ షరియా కోర్టుల, మసీదుల ఆధిపత్యం చాలా ఎక్కువ. వీళ్ల మాట వినని, సంప్రదాయోల్లంఘన చేసిన వాళ్ల కుటుంబాలనీ వెలి వేస్తారు. కేరళలోనే మల్లాపురంలో జాస్లీలా అనే ఒక ముస్లిం అమ్మాయి ఒక క్రైస్తవ యువకుడు టీసో థామస్‌ను పెళ్లి చేసుకుంది. దీనితో ఆమె కుటుంబాన్ని ముస్లిం పెద్దలు వెలేశారు. కేరళలోనే కీజత్తూర్ అనే చోట కున్నమ్మాళ్ యూసుఫ్ ఇలాంటి వెలినే ఎదుర్కొన్నాడు. ఇతడు తన కూతురిని వేరే వర్గం అబ్బాయికి ఇచ్చి పెళ్లి చేశాడు. దీనితో స్థానిక మసీదు పెద్దలు ఇతడి కుటుంబాన్ని వెలి వేస్తూ ప్రకటన జారీ చేశారు. 2019లో పాలక్కాడ్ జిల్లాలోను ఇలాంటిది జరిగింది. తిరితాలా అనే ముస్లిం కుటుంబంలో పెళ్లి జరిగింది. ఆ సమయంలో ఈ కుటుంబానికి చెందిన ఒక మహిళ బాహాటంగా ఫోటోల కోసం పోజులు ఇచ్చినందుకు ఆగ్రహించిన మసీదు పెద్దలు వెంటనే వెలివేశారు. ఫోటోలు తీయించుకోవడమే కాదు, సంగీత విభావరి పెట్టడం కూడా మసీదు పెద్దలకు ఆగ్రహం తెప్పించింది.

ఇది కేవలం షరియా కోర్టులు నిర్వహిస్తూ, భారత రాజ్యాంగం ఆధిపత్యాన్ని ప్రశ్నించడం మాత్రమే అనుకుంటే పొరపాటు. ఆ విధంగా ముస్లిం మతోన్మాదాన్ని దేశంలోకి తీసుకువస్తున్నారు. తాలిబన్ రాజ్యాన్ని, సూత్రాలను నెమ్మది నెమ్మదిగా అమలు చేస్తున్నారు. వీటితో ముస్లింలకు న్యాయం జరుగుతుందనుకుంటే శుద్ధ పొరపాటు. బెంగళూరులో, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఉదంతాలే ఇందుకు నిదర్శనం. సెక్యులర్ భారత్‌లో కొన్నిచోట్ల పనిచేస్తున్న ముస్లిం న్యాయస్థానాలు తమ పరిధిలో లేదా ప్రాంతంలో ముస్లిం మతస్థులు మాత్రమే ఉండాలన్న సూత్రాన్ని కూడా అమలు చేస్తున్నారు. వీళ్లే ఔరంగజేబ్ వంటి ముస్లిం ఛాందసవాదులను కీర్తిస్తుంటారు. యువకులను రెచ్చగొట్టి హిందువుల ఉత్సవాల మీద దాడులు చేయిస్తుంటారు. అక్కడ ఏ విధమైన నిబంధన చెల్లుబాటు కాకుండా చేస్తారు. ఆఖరికి కరెంటు బిల్లు రీడింగ్ చూడడానికి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులపైన కూడా దాడులకు దిగుతారు. ఇది కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సాగుతున్న దురాగతం.

ఫెమినిస్టులూ, ఉదారవాదులు, కమ్యూనిస్టులు, ప్రకాశ్‌రాజ్‌లు, స్వరా భాస్కర్‌లు ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఎక్కడ బబ్బుంటారో తెలియదు. రాత్రి తీసుకున్న ద్రవ పదార్థం బాపతు ప్రభావం శరీరాన్ని వీడి వెళ్లి ఉండక పోవచ్చు. అందుకే వారం అయినా మాట్లాడడం లేదు. కునాల్ కమ్రా అనే చెత్త స్టాండప్ కమేడియన్‌ను వెళ్లి కలుసుకుని వాడి చేత భుజం మీద చేయి కూడా వేయించుకుని ఫోటోకి పోజు ఇచ్చిన ప్రకాశ్‌రాజ్! నీకు ఆ యువత ఆక్రందన వినిపించలేదా? ఆమె పిల్లలు చేసిన ఆర్తనాదాలు నీ చెవిని తాకలేదా? ఇక్కడ ముస్లిం అనవద్దు. ఒక మహిళను అలా నడిరోడ్డు మీద పెట్టి కర్రలతో బాదిన దుర్ఘటనను ఖండించాలని వీళ్లు ఎందుకు అనుకోరు! ప్రతి చిన్న విషయానికి కలగచేసుకునే బడా న్యాయస్థానాలకు ఇది పట్టకపోవడం మరీ విచిత్రం. ఇది బుద్ధిజ్ఞానం ఉండే మనుషులు చేయవలసిన పనేనా? భర్త ఫిర్యాదు చేశాడు. మసీదు పెద్దలు పిలిచారు. ఆమె వచ్చింది. ఓ విచారణ లేదు. ఒక ప్రశ్న లేదు. ఆమె వచ్చీ రావడంతోనే ఆ ఆరుగురు వీరులు ఆమె మీద దాడి చేశారే, దీని గురించి ఈ చచ్చు మేధావులు, పుచ్చు ఉదారవాదులు ఎందుకు నోరు విప్పరు? వీళ్లదీ ఒక మేధేనా? అసలు వీళ్లవీ ఒక బతుకులేనా? అని ప్రశ్నించాలి. వీళ్లు భారత రాజ్యాంగ రక్షణ గురించి మాట్లాడతారు. వీళ్లు భారతదేశంలో సెక్యులరిజం గురించి ఉపన్యాసాలు గుప్పిస్తారు.

ఈ ఫెమినిస్టులు, ఉదారవాదులు ఇప్పటికైనా మత్తు వీడితే మంచిది. మీరు సమర్థిస్తున్న ముస్లిం మతోన్మాదులు, మీరు చంకలో వేసుకు తిరుగుతున్న ముస్లిం మతోన్మాదులు భారతదేశంలో తాలిబన్ రాజ్యాన్ని విస్తరించే పనిలో ఉన్నారు. ఈ దేశంలో మతోన్మాదం మెజారిటీ వర్గీయులది కానేకాదు. మైనారిటీలదే. అందులోను ముస్లింలలోని ఛాందసవాదులదే. మీ చెత్త ధోరణి వల్ల, కళ్లు మూసుకుపోయిన సెక్యులరిజం వల్ల షాబినా వంటి ఆడకూతుళ్లు నరకయాతన అనుభవిస్తున్నారు. బీజేపీ మీద కోపంతో ముస్లిం ఛాందసవాదాన్ని కౌగలించుకుంటున్న మీరంతా ఈ దేశానికి పట్టిన దౌర్భాగ్యం. మీ కళ, మీ రచనా వ్యాసంగం, మేధావులన్న మీ వీరతాళ్లు, వాటితో అప్పనంగా వస్తున్న కీర్తిప్రతిష్ఠలు ఇవన్నీ ముస్లిం ఛాందసవాదుల మతోన్మాదాన్ని రక్షించడానికి, పెంచి పోషించడానికి ఉపయోగిస్తున్న వాస్తవం మీకు ఎప్పటికి బోధపడుతుంది?

**– జాగృతి డెస్క్**





అప్పు చేసి పప్పు కూడు.. ఇదేదో సినిమా టైటిల్ అనిపిస్తోంది కదూ! అప్పుడెప్పుడో ఈ సినిమా చాలా పాపులర్ అయ్యింది. దశాబ్దాల తర్వాత దీని గురించి ఎందుకు మాట్లాడుకుంటున్నామంటే... ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పరిస్థితి ఇలాగే తయారయ్యింది. రాష్ట్రం ఏర్పడిన సమయంలో అత్యంత సంపన్న మైన తెలంగాణ.. ఇప్పుడు అప్పులు, వడ్డీలలో మునిగి తేలుతోంది. ఏం చేయాలన్నా అప్పు తప్పనిసరి పరిస్థితికి చేరుకుందట. పదేళ్ల పాటు పాలించిన కె.చంద్రశేఖరరావు బీఆర్ఎస్ పార్టీ.. దాదాపు యేడాదిన్నర కింద అధికారానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తప్పులను ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటున్నారు. మొత్తానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మాత్రం ప్రజల నెత్తిన కుంపటిలా మారిపోతోంది.


# అప్పులతో సంక్షేమం

పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమ, ఉపాధి పథకాలంటూ కొత్త కొత్తగా ప్రకటిస్తోంది. అందుకు వేల కోట్ల రూపాయలు అవసరం అవుతున్నా.. ఏ మాత్రం ఆలోచన లేకుండా పథకాలను ప్రకటింపజేస్తోంది. వాటి అమలుకు తేదీలు కూడా ఖరారు చేస్తోంది. వాటికి అవసరమైన నిధులు ఎలా సమీకరించాలన్న అంశాన్ని అధికారులకు వదిలేసినట్లు పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, నెరవేర్చాల్సిన భరోసాలు కలుపుకుంటే.. వచ్చే మూడు నెలల కాలంలో రూ. 35వేల కోట్లు అవసరం అవుతాయి. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం ఇది. ఈ పథకాలతో పాటు.. ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్లు వంటి వాటికి వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రకటనలను చూస్తే.. వాటిని వాయిదా వేసే పరిస్థితులు కనిపించడం లేదు. ఖజానా చూస్తే.. వీటిని అమలు చేసే వీలుమేలు లేదు. అందుకే అప్పుల కోసం వేట మొదలు పెడుతోంది. ఈ క్రమంలోనే ఇప్పటికే పలు ఆర్థిక సంస్థలతో సర్కారు సంప్రదింపులు మొదలు పెట్టింది. ప్రభుత్వానికి ఇతర ఆదాయ మార్గాలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో వెతుకులాట ప్రారంభించింది. కీలక ప్రాజెక్టులకు, పథకాల అమలుకు నిధుల సర్దుబాటుపై రేవంత్ ప్రభుత్వం అనివార్యంగా దృష్టి పెట్టింది. వచ్చే మూడు నెలల కాలానికి అవసరమైన దాదాపు రూ. 35 వేల కోట్లను సేకరించే పనిలో పడిపోయింది.

ఖరీఫ్‌కు సంబంధించిన రైతు భరోసా డబ్బులు ఇంకా రైతులందరి ఖాతాల్లో జమ చేయలేదు. ఆ సొమ్మును వీలైనంత తొందరగా పూర్తిస్థాయిలో విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటిదాకా నాలుగు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేశారు. మిగతాది మే రెండో వారంలోపు చెల్లించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇదయ్యేలోపు రబీ సీజన్ కూడా మొదలవుతుంది. ఆ దఫాలో రైతు భరోసా డబ్బును కూడా పెట్టుబడి సాయం కింద అందించాల్సి ఉంటుంది. అందుకోసం ప్రభుత్వం ఇప్పటి నుంచే నిధులు సమకూర్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

ఇక, రైతు భరోసాతో పాటు.. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు కూడా ఆర్థిక శాఖ అధికారులు నిధుల సమీకరణ ఎలా అన్న అంశంపై నివేదికలు తయారు చేస్తున్నారు. ఇతర అభివృద్ధి పనులు చూసుకుంటే...రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్లను కూడా సర్కారు ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తన వాటా సమకూర్చాల్సి ఉంది. ఈ పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం పలు ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. వీటికి తోడు. ఇంకేమైనా ఇతర ఆదాయ మార్గాలున్నాయా? అని కూడా సమాలోచనలు చేస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ప్రభుత్వం ముందుగా నిర్దేశించుకున్న ప్రకారం.. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండవ దశ, రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం వచ్చే మూడు నాలుగు నెలల్లోపే కనీసం రూ. 3 వేల కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉంది. మరోవైపు.. ఈ ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తులు చేసినా స్పందన లేదు. దీంతో జైకా వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో పాటు దేశంలోని మిగతా ఆర్థిక సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. 340 కిలోమీటర్ల మేర ఉన్న రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలకు మొత్తం రూ. 34,367.62 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే నార్త్ ఫేజ్, డీపీఆర్ తుది దశకు చేరుకుంది.





# ఖజానా వెలవెల

ఈ ట్రిపుల్ ఆర్‌కు సౌత్ ఫేజ్ డీపీఆర్ కోసం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చే పరిస్థితులు ఉన్నా.. ఈ రోడ్ల నిర్మాణం కోసం భూసేకరణకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం మేర భరించాల్సి ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా వచ్చే మూడు నెలల్లో దాదాపు రూ. 1,500 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక, మెట్రో ఫేజ్-2 కు కూడా అంచనా వ్యయం రూ.24,269 కోట్లు గా నిర్ధారించారు. త్వరలోనే ఈ డీపీఆర్‌లు ఖరారు కాబోతున్నాయి. రేడియల్ రోడ్లకు కూడా దాదాపు రూ. 7 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు కోసం జైకా నుంచి రూ. 380 కోట్లు అందుబాటులో ఉన్నాయి. మిగతా నిధుల కోసం ఇతర ఫైనాన్స్ సంస్థలతో అధికారులు చర్చలు జరుపుతున్నారు. రేడియల్ రోడ్లకు సంబంధించి వచ్చే జూలై నాటికి తక్షణ అవసరాల కోసం కనీసం రూ. వెయ్యి కోట్లు మేరకైనా ఖర్చు చేయాల్సి ఉంటుందంటున్నారు అధికారులు.

అయితే వాస్తవ పరిస్థితి చూసుకుంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం గతంతో పోలిస్తే.. బాగానే ఉన్నప్పటికీ.. వీటిలో ఎక్కువ శాతం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల కిస్తీలు, వడ్డీలు, పాత పెండింగ్ బిల్లుల చెల్లింపులకు, ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, నెలవారీ జీతాలు, ఆసరా పెన్షన్‌లకే సరిపోతుందంటున్నారు అధికారులు. దీంతో పలు ఆర్థిక సంస్థల నుంచి అప్పులు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇతర ఆదాయ మార్గాలను చూసుకుంటే.. పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయడం ఇప్పటికే మొదలుపెట్టింది. మార్చితో ముగిసిన మొదటి విడత గడువులో ఆదాయం భారీగానే సమకూరింది. మరింత ఆదాయం రాబట్టుకోవాలనే లక్ష్యంతో ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియకు ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు పొడిగించారు. రిజిస్ట్రేషన్లు, మద్యం ఆదాయంపైనా రాష్ట్ర ప్రభుత్వం గురి పెట్టింది.

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతినెలా సగటున పన్నులు, పన్నేతర ఆదాయం రూ. 18 వేల కోట్లు సమకూరుతోంది. అదే సమయంలో ఖర్చులు మాత్రం రూ. 23 వేల కోట్లు అవుతున్నాయి. చేయూత పెన్షన్లు, ఇతర గ్రీన్ ఛానెల్ పథకాలకు దాదాపు రూ. 2 వేల కోట్లు, ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు రూ. 5 వేల కోట్లు, అప్పుల కిస్తీలు, వడ్డీలకు కలిపి రూ. 6,500 కోట్లు ప్రతినెలా చెల్లిస్తోంది. ఇక, పెండింగ్ బిల్లులకు, ఇతర అత్యవసరాలకు రూ. 4 వేల కోట్లు కేటాయిస్తున్నారు. దీంతో మిగిలిన పథకాలకు, ప్రాజెక్టులకు చూసుకుంటే ఖజానా నుంచి నిధుల కొరత ఏర్పడుతోంది.

సర్కారు చేపడుతున్న పథకాల్లో భాగంగా ముఖ్యమైన స్కీములు చూసుకుంటే.. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిరుపేదలకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు 12,571 కోట్ల రూపాయలు కేటాయించారు. వీటిలో కొంత మొత్తం కేంద్రం నుంచి పీఎంఏవై పథకం కింద 4,600 కోట్ల రూపాయలు వస్తాయి. ఇక కొంత అప్పులను ప్రభుత్వం ఇప్పటికే తీసుకుంది. మిగిలిన మొత్తం ఖజానా నుంచే ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. మొత్తం చూసుకుంటే.. ప్రతి మండలానికి ఒక గ్రామం చొప్పున 70,122 మంది లబ్ధిదారులను తొలివిడతలో గుర్తించారు. ఈ పథకంలో దాదాపు 14 వేల ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభమయ్యాయి. అయితే, వీటిలో 1,800 ఇళ్ల పునాదుల నిర్మాణం పూర్తయింది. వీరికి ఆర్థిక సాయం చెల్లింపులు మొదలుపెట్టారు. పైగా ఇవన్నీ గత ఆర్థిక సంవత్సరం కింద మంజూరైనవే కావడం.. ఈసారి మరిన్ని ఇళ్లు మంజూరు చేయాల్సి ఉండటంతో కనీసం 5 వేల కోట్ల రూపాయలు వచ్చే మూడు నెలల కోసం ప్రభుత్వం సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

మరో పథకం.. రాజీవ్ యువ వికాసం పథకం చూసుకుంటే.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల నిరుద్యోగ యువతకు రూ. 2.40 లక్షల వరకు సబ్సిడీ కింద రుణాలు ఇవాల్సి ఉంది. వాటి మొత్తం చూసుకుంటే.. రూ. 6 వేల కోట్లు లెక్క తేలుతాయంటున్నారు. వచ్చే జూన్ 2వ తేదీ తర్వాత నుంచి ఈ మొత్తాన్ని పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక, ఖరీఫ్ పెట్టుబడి సాయం నిధులను రైతుల ఖాతాల్లో జమచేసే ప్రక్రియ రెండు నెలల నుంచి జరుగుతోంది. ఇప్పటి వరకు నాలుగు ఎకరాలలోపు రైతులకు రైతు భరోసా అందించారు. త్వరలోనే 4 ఎకరాలు, ఆ పైన ఉన్న రైతులందరికీ కూడా పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ పథకం కోసం రూ. 4 వేల కోట్ల వరకు అవసరమని అధికారులు అంటున్నారు. ఇక, వచ్చే జూన్ నెలనుంచే మళ్లీ వానాకాలం పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా పేరుతో ప్రభుత్వం అందించాల్సిన పరిస్థితి ఉంటుంది. అప్పుడు రబీ రైతు సాయం కోసం దాదాపు రూ. 9 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఇలా.. వేల కోట్ల రూపాయలు అవసరం ఉన్నప్పటికీ, ఇతర సంస్థల నుంచి సమకూర్చుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నప్పటికీ కొత్త కొత్త పథకాలను ప్రభుత్వ పెద్దలు ప్రకటిస్తున్నారు. ఈ దిశగా మాత్రమే ముందుకెళ్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మాత్రం లెక్క చేయడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. భవిష్యత్తులో ప్రభుత్వ పాలన ఓ కమర్షియల్ సంస్థలాగా సాగే ప్రమాదం పొంచి ఉందంటున్నారు విశ్లేషకులు.

**సుజాత గోపగోని,**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, ఏలూరు, విశాఖపట్నం, జగ్గయ్యపేట, విజయవాడ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తెదేపా, జనసేన, బీజేపీలో చేరుతుండటంతో మెజారిటీ కోల్పోయిన ఆయా స్థానిక సంస్థల్లో వైసీపీ అధికారం కోల్పోతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో ఈ పరిస్థితి మొదలైంది. వైసీపీలో అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లు, వ్యాపార అవసరాలకోసం కొందరు, తమ డివిజన్లలో అభివృద్ధి పనులు చేయించుకోడానికి కొందరు, వచ్చే కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల్లో ఇప్పటి నుంచే సీటు రిజర్వేషన్‌కు కొందరు..ఇలా తమ అవసరాల కోసం పార్టీలు మారారు. దీంతో వైసీపీకి మెజార్టీ తగ్గిపోవడంతో కూటమి నేతలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఓడిస్తున్నారు. విజయవాడ తప్పించి మిగతా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కూటమి అధికారం సొంతం చేసుకుంది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా త్వరలో అవిశ్వాసం పెట్టే అవకాశం ఉంది.



# కూటమి గూటికి వై

రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని ఆ పార్టీ కార్పొరేటర్లంటున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో ఛైర్మన్లు, కార్పొరేషన్లలో మేయర్లు వైసీపీ తొత్తులుగా పనిచేశారే తప్ప ప్రజాప్రతినిధులుగా పనిచేయలేదని విమర్శిస్తున్నారు. అప్పటి ప్రాంతీయ ఇన్‌చార్జులదే పెత్తనం. వారు చేసిన ప్రతిపాదనలనే కౌన్సిల్ అజెండాలో పొందుపరిచేవారని అంటున్నారు. అంతేకాదు పార్టీ అధిష్టానానికి అవసరమైన భూములు, ఇతర వ్యవస్థలు సొంతం చేసుకునేందుకు కాంట్రాక్టులు పొందేందుకు మాత్రమే అజెండాలు నింపేవారని వార్డుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు వినతులు ఇచ్చినా మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు పట్టించుకోలేదని దాంతో ప్రజల దృష్టిలో చులకనైపోయినట్లు వైసీపీ కార్పొరేటర్లు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడంతో ఏ జిల్లాలోనూ కనీస మెజార్టీ లేకపోవడంతో కూటమికి అన్ని విధాలుగా పైచేయి లభించింది. కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోటే రహదారులు, మంచినీటి సమస్య, డ్రైనేజి ఇతర మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయడంతో ప్రజల్లో సానుకూలత పెరిగింది. అప్పటి వరకు తమ స్వార్థం చూసుకున్న మేయర్లు వైసీపీ అధికారం కోల్పోవడంతో ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారు. ఇక కార్పొరేటర్లు తమ అసంతృప్తిని బయటకు వెళ్లగక్కారు. అదే సమయంలో కూటమి నేతలు కూడా వారి అసంతృప్తిని ఆసరాగా తీసుకుని తమ పార్టీల్లోకి ఆహ్వానించారు. దీంతో ఎవరి అవసరం కొద్దీ వారు ఆయా పార్టీల్లో చేరిపోయారు. మెజార్టీ పెరిగిన కూటమి పార్టీలు ఆయా కార్పొరేషన్లలో మేయర్లపై అవిశ్వాసం పెట్టించారు. వైసీపీ ఓడిపోవడంతో ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లు కూటమి పార్టీల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

**తాజాగా కూటమి ఖాతాలోకి విశాఖ కార్పొరేషన్**

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ పీఠాన్ని కూటమి దక్కించుకుంది. వైసీపీకి చెందిన మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై ఏప్రిల్ 19న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కొత్త మేయర్ ఎన్నికకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 111 మందికి ఓటు హక్కు ఉంది. నాలుగేళ్ల కిందట జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ 58 వార్డులను గెలుచుకోవడంతో పాటు ఇండిపెండెంట్లుగా గెలిచిన నలుగురు కార్పొరేటర్ల మద్దతుతో మేయర్‌గా గొలగాని హరి వెంకటకుమారిని ఎంపిక చేసింది. అప్పటినుంచి జీవీఎంసీలో వైసీపీ నేతల హవాయే నడుస్తూ వచ్చింది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో జీవీఎంసీలో పరిణామాలు శరవేగంగా మారసాగాయి. ఇండిపెండెంట్లుగా గెలిచిన నలుగురిలో ఇద్దరు టీడీపీలో చేరగా, మరో ఇద్దరు జనసేనలో చేరిపోయారు. వైసీపీ నుంచి కార్పొరేటర్లుగా గెలిచిన 27 మంది కూడా టీడీపీ, జనసేన గూటికి చేరారు. దీంతో కౌన్సిల్‌లో కూటమి బలం 63కి చేరగా, వైసీపీ బలం 32కి తగ్గిపోయింది. అదే సమయంలో జీవీఎంసీ పరిధిలోని ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లను కూటమి పార్టీలే గెలుచుకోవడంతో ఎక్స్ అఫీషియో సభ్యుల హోదాలో 11 స్థానాలు కూటమికి పెరగడంతో దాని బలం 74కి పెరిగింది. అంటే మొత్తం 111 మంది సభ్యులు కలిగిన కౌన్సిల్‌లో కూటమికి 2/3 వంతు ఆధిక్యం దక్కినట్టయింది. ఈ మేరకు స్పష్టమైన సంఖ్యా బలం ఉండడంతో కూటమి నేతలు జీవీఎంసీ మేయర్‌పై





# సీపీ నేతలు

అవిశ్వాస తీర్మానం కోరుతూ గత నెల 22న జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ ఈ నెల 20న అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించడంతో పాటు మరో ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు మద్దతు తెలపడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గి మేయర్ పదవీచ్యుతులయ్యారు. రాష్ట్రంలో అతి పెద్ద కార్పొరేషన్ ఇప్పుడు కూటమి ఖాతాలోకి చేరింది.

**2024లోనే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్**

నెల్లూరు మున్సిపాలిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ)కి చెందిన అనేక మంది కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వైసీపీ నాయకత్వంలోని లోపాలు, ముఖ్యంగా మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తీరుపై అసంతృప్తి, పలువురు నేతలు పార్టీ మారడానికి ప్రేరేపించాయి. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వంటి సీనియర్ నాయకులు కూడా ఈ కారణంగా టీడీపీలో చేరారు. వాస్తవంగా 2022లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ మొత్తం 54 సీట్లను గెలిచి అధికారం కైవసం చేసుకుంది. అయితే 2024లో టీడీపీ అధికారంలోకి రావడంతో, వైసీపీ కార్పొరేటర్లు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టీడీపీలో చేరుతున్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం 30 మంది వైసీపీ కార్పొరేటర్లు . మేయర్ స్రవంతి కూడా తెదేపాలో చేరిపోయారు. గత నెలలో జరిగిన డిప్యూటి మేయర్ ఎన్నికల సమయంలో మరో 15 మంది తెదేపాలో చేరారు. దాంతో వైసీపీ కార్పొరేటర్ల సంఖ్య తొమ్మిదికి పడిపోయింది.

**గుంటూరు కార్పొరేషన్ కూడా**

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కూడా కూటమి ఖాతాలో చేరింది. గుంటూరు నగరపాలక సంస్థలో వైసీపీ ఒకప్పుడు ఎంతో పటిష్టంగా ఉండేది. 2021 కార్పొరేషన్ ఎన్నికలలో నగరంలో 57 డివిజన్లకు గానూ, వైసీపీ తరపున 44 మంది కార్పొరేటర్లు మీద గెలిచారు. 9 మంది కార్పొరేటర్లు టీడీపీ, ఇద్దరు జనసేన, మరో ఇద్దరు గురవయ్య, చల్లా రాజ్యలక్ష్మి స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందారు. ఆ తర్వాత వారిద్దరు వైసీపీలో చేరారు. దీంతో కార్పొరేషన్లో వైసీపీ కార్పొరేటర్ల సంఖ్య 46కు పెరిగింది.

8వ డివిజన్ కార్పొరేటర్ రమేష్ గాంధీ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ స్థానానికి ఏర్పడ్డ ఖాళీకి ఎన్నికలు నిర్వహించగా, తెలుగుదేశం పార్టీ తరపున పోతురాజు సమత గెలుపొందారు. దీంతో కౌన్సిల్లో తెలుగుదేశం పార్టీ తరపున పది మంది కార్పొరేటర్లు అయ్యారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు, తరువాత వైసీపీకి చెందిన అనేక మంది కార్పొరేటర్లు, కూటమి ప్రభుత్వంలో చేరారు. దీంతో కార్పొరేషన్లో కూటమి కార్పొరేటర్ల బలం 35కు చేరుకుంది. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీకి జరిగిన ఎన్నికల్లో కూడా ఆరుగురు కూటమి అభ్యర్థులు తిరుగులేని మెజార్టీతో గెలుపొందారు. గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ మనోహర్ నాయుడు తన పదవికి రాజీనామా చేశారు. దాంతో త్వరలో ఈ కార్పొరేషన్‌లోనూ మేయర్ ఎన్నిక జరగనుంది.

**ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కూడా**

ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కూడా కూటమి ఖాతాలోకి చేరింది. ఒంగోలు కార్పొరేషన్‌లో మొత్తం 50 డివిజన్లకు గాను వైసీపీ నుంచి 41 మంది కార్పొరేటర్లు గెలిచారు. ఆ తర్వాత ఇండిపెండెంట్లుగా గెలిచిన ఇద్దరూ వైసీపీ చేరిపోయారు. దీంతో వైసీపీ బలం 43కు చేరింది.వైసీపీ తరుపున మేయర్‌గా గంగాడ సుజాతను ఎన్నుకున్నారు. శాసనసభ ఎన్నికలలో వైసీపీ నుంచి టీడీపీ కూటమి చేతిలోకి రావటంతో ఒంగోలు మేయర్ సుజాత సహా 19 మంది వైసీపీ కార్పొరేటర్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో తెదేపా కండువా కప్పుకున్నారు. మిగిలిన వైసీపీ కార్పొరేటర్లలో డిప్యూటీ మేయర్ మాధవ్ సహా 20 మంది కార్పొరేటర్లు ఇటీవల జనసేన గూటికి చేరిపోయారు.


దీంతో ఒంగోలులో వైసీపీకి నలుగురు కార్పొరేటర్లు మాత్రమే మిగిలారు. ఎన్నికల సమయంలో టీడీపీకి ఆరుగురు, జనసేనకు ఒక కార్పొరేటర్ ఉండేవారు. పార్టీ మార్పుల తర్వాత టీడీపీకి ఉన్న కార్పొరేటర్ల బలం 25కు చేరింది. అలాగే జనసేన బలం 21కి పెరిగింది. ప్రస్తుతం వైసీపీకి నలుగురు సభ్యులు ఉన్నారు. దీంతో ఒంగోలు కార్పొరేషన్‌పై మీద కూటమి పట్టు సాధించింది.

**ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోనూ**

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కూడా తెదేపా వశమైంది. 2021 జూలైలో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో 50 స్థానాలకు వైసీపీ 47, టీడీపీ మూడు స్థానాలు గెలుచుకుంది. గతేడాది ఎన్నికల ముందు వైసీపీ నుంచి ముగ్గురు కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మేయర్ నూర్జహాన్ సహా మరో 21 మంది, మరో ఐదుగురు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో కూటమి బలం 32కు చేరింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో డిప్యూటి మేయర్లుగా తెదేపా కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. నూజివీడు మున్సిపాలిటీ కూడా తెదేపా ఖాతాలో చేరనుంది. ఇక్కడ గతంలో 32 వార్డులకు గాను 25 వార్డులు వైసీపీ, 7 తెదేపా గెలుచుకుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత చాలా మంది తెదేపా వైపు మొగ్గారు. ఇటీవల జరిగిన వైఎస్ చైర్మన్ ఎన్నికలో జరిగిన బలప్రదర్శనలో తెదేపా తరపున నిలబడిన కౌన్సిలర్ గెలిచారు. తెదేపాకు 18, వైసీపీ 14 ఓట్లు వచ్చాయి.

**జగ్గయ్యపేట, తుని కూడా**

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపాలిటీ కూడా తెదేపా ఖాతాలో చేరింది. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెదేపాలో చేరారు. ఆయనతో పాటు 7, 23, 31వ వార్డుల కౌన్సిలర్లు పూసపాటి సీతారావమ్మ, డి. రమాదేవి, గింజుపల్లి వెంకట్రావు, అతని కుమారుడు కృష్ణ తెదేపా తీర్థం పుచ్చుకొన్నారు. గతంలో జగ్గయ్యపేట మున్సిపాలిటీలో తెదేపాకు 14 మంది కౌన్సిలర్లు ఉండగా, తాజా చేరికలతో ఆ పార్టీ బలం 18కి చేరింది. వైసీపీ బలం 13కు పడిపోయింది. కాకినాడ జిల్లా తునిలో కూడా కౌన్సిర్లు వైసీపీ షాక్ ఇచ్చారు. మొత్తం 28 మంది కౌన్సిలర్లు ఉండగా, 15 మంది టీడీపీలో చేరారు. ఇప్పటికే మెజార్టీ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా, మరికొందరు కూడా వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. గతంలో తునిలో తెదేపాకు ఒక కౌన్సిలర్ మాత్రమే గెలవగా ఇప్పుడు ఆ సంఖ్య 16కు చేరింది. వైఎస్ చైర్మన్ కూడా తెదేపాలో చేరగా చైర్మన్ ఏలూరు సుధారాణి తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఇక్కడ చైర్మన్ ఎన్నిక జరగాల్సి ఉంది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

మే 2 (పంచమి) శంకర, రామానుజ జయంతి



భారతీయ సమైక్యతా, సమతామూర్తులు శంకరాచార్యులు, భగవద్రామానుజాచార్యులు. హిందూమతోద్ధరణకు, సనాతనధర్మ పరిరక్షణకు, ప్రత్యేకించి ప్రజలలో భక్తిప్రపత్తులు ఇనుమడింపచేసేందుకు, సర్వమానవ కల్యాణానికి కంకణబద్ధులయ్యారు. ఆదిశంకరులు ఈశ్వర స్వరూపులు కాగా రామానుజులు లక్ష్మణ అంశగలవారని విశ్వాసం. వారు కేవలం ఆధ్యాత్మిక గురువులు, మతాచార్యులే కారు. సనాతన ధర్మానికి విఘాతం కలుగుతూ, అంధ విశ్వాసాలు ముసురుకుంటున్న వేళ జగతిని జాగృత పరిచేందుకు

# అద్వైతమూర్తి ఆదిశంకర

దేశంలో అవతరించిన మహాపురుషుల్లో అగ్రగణ్యులు ఆదిశంకరాచార్యులు. కేరళలోని కాలడిలో శివగురువు, ఆర్యాంబ దంపతుల వరపుత్రుడు శంకరులు. వైశాఖ శుక్ల పంచమి కర్కాటక రాశిలో పునర్వసు నక్షత్రంలో జన్మించారు. భారతీయ జీవన విధానంలో శ్రీకృష్ణ పరమాత్మ తరువాత జగద్గురువులు ఆదిశంకరులే మౌలికమైన ఏకత్వానికి వ్యావహారిక రూపం ఇచ్చారు. వ్యాసభగవానుడి ఆజ్ఞానుసారం ప్రస్థానత్రయానికి భాష్యాలను, ప్రకరణ గ్రంథాలను రాశారు. కేవలం ముప్పయ్ రెండేళ్ల జీవిత ప్రస్థానంలో సాధించిన అపూర్వ విజయాలను బట్టి కారణజన్ముడిగా ఆధ్యాత్మికవేత్తలు విశ్వసిస్తారు. జన్మతః ప్రాప్తించిన ఎనిమిదేళ్ల ఆయుర్దాయం నిజసన్యాసం స్వీకరణతో రెట్టింపు అయింది. తన సూచన మేరకు రచనా వ్యాసంగం కొనసాగించేందుకు వ్యాసుడు ఆ ఆయుర్దాయాన్ని ద్విగుణీ కృతం చేశారు. శాఖోపశాఖలుగా విడిపోయి అస్తవ్యస్తమైన హిందూ ధర్మాన్ని ఏకతాటి మీదికి తెచ్చారు శంకరులు.

వైష్ణవ, స్మార్త, సౌర, శాక్తేయ, గాణాపత్య, శైవమతాలను అవగాహన చేసుకొని ఆయా మతాచారాలు, విధానాలను సంస్కరించి 'షణ్మత' స్థాపనతో వైదిక ధర్మాన్ని పునరుద్ధరింప చేశారు.వైదిక ధర్మపరిరక్షణలో భాగంగా నాటి పండితులతో వాదప్రతివాదనలు చేశారు. పరాజిత పండితులను గౌరవించారు. వాదనలో ఓడిన మండనమిశ్రుని శృంగేరి పీఠానికి తొలి అధిపతిగా నియమించడం అందుకు ఒక ఉదాహరణ. తమ వాద ప్రతి వాదనలలో న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ఉదయభారతి (మండనమిశ్రుని అర్ధాంగి)ని సాక్షాత్తు శారదాదేవిగా గ్రహించి తమ శృంగేరి పీఠంలో శారదామాతగా కొలువుదీరాలని అర్థించారు. మోక్ష మార్గాలలో జ్ఞానం అత్యంత ఉత్తమం, పవిత్రమైనదని, జ్ఞానం ద్వారా పొందిన మోక్షం అక్షయమని ప్రబోధించారు. తాంత్రిక పూజల స్థానంలో సాత్విక పూజా విధానం ప్రవేశపెట్టారు. మతం పేరిట జరుగుతున్న జంతుబలులు, మూఢ విశ్వాసాలు, కర్మకాండలను వ్యతిరేకించారు. అథమ స్థాయిలోని వారిని ఉన్నతమైన ఆధ్యాత్మిక మార్గంలో నడిపించేందుకు విగ్రహారాధన అవసరమని భావించి, బోధించారు.

'సకలజీవరాశుల్లో మనిషి బుద్ధిజీవి. దుర్లభమైన మానవ జన్మను ప్రసాదించిన భగవంతుడి గురించి ఆలోచన లేకుండా సాగించే జీవితం నిరర్థకం. దేవుడి పట్ల భక్తి విశ్వాసాలు, జీవరాశి క్షేమం పట్ల అనురక్తుడై ఉండాలి. మనిషి నడతలో, చూపులో లోపం ఉంటుందేమో కానీ, సృష్టికి అంతా సమానమే' అని అతి సులభ రీతిలో బోధించారు. 'విద్య పర, అపార అని రెండు విధాలు. మొదటిది ఉదర పోషణ, వ్యక్తిగత సుఖాలకు సంబంధించినది కాగా, రెండవది లోకకల్యాణం, పరోపకార కోసం నేర్చేది. భగవంతుని దూరం చేసే కాంతాకనకాల పట్ల వ్యామోహం తగ్గించుకోవాలి. సత్సంగం, సజ్జన సాంగత్యంతో అజ్ఞానానికి మూలమైన మోహం నశిస్తుంది. అంత్యకాలం సమీపించినపుడు పాండిత్యం, సంపదలు కాపాడలేవు. కనుక... మూఢమతీ! గోవిందుడిని స్మరించు' అని హితవు పలికారు.

శంకరభగవత్పాదులు, తాము సూత్రీకరించిన అద్వైత సిద్ధాంతవ్యాప్తి, వైదిక మతం వర్ధిల్లడానికి దేశం నలుమూలలా చతురామ్నాయాలు (పీఠాలు) నెలకొల్పారు. ఉత్తరాదిన బదరీనాథ్‌లో జ్యోతిర్మఠం, తూర్పున పూరిలో గోవర్ధనమఠం, పశ్చిమాన ద్వారకా మఠం, దక్షిణాదిన తుంగానదీ తీరంలో శృంగేరి మఠాన్ని స్థాపించారు.

'న మాతుః పరం దైవతమ్'.. (తల్లిని మించిన దైవం లేరు) అనే శాస్త్ర వాక్యానుసారం లోకాన్ని ఎదిరించి మాతృరుణం తీర్చుకున్న ధన్యుడు శంకరాచార్యులు. భక్తి మార్గాన్ని మరింత వ్యవస్థీకృతం చేయాలన్న సంకల్పంతో మాతృమూర్తిని ఒప్పించి యతిదీక్ష స్వీకరించారు. దేశాటనకు బయలు దేరుతూ... 'నీ అంతిమదశలో తప్పక వస్తాను' అని మాటను నెరవేర్చుకున్నారు. దేహత్యాగం చేసిన తల్లికి అంతిమ సంస్కారాలకు ప్రయత్నించినప్పుడు... సన్యాసికి కర్మాధికారం లేదంటూ బంధువులు, ఇతరులు ఆ తంతుకు అవాంతరం కల్పించారు. అయినా వెనుదీయని శంకరుడు స్వగృహంలోనే చితి పేర్చి యోగాగ్నితో మాతృమూర్తికి అంతిమ సంస్కారం నిర్వహించారు. మాతృభక్తికి ఆదర్శంగా నిలిచారు. వర్తమాన సమాజంలో కొందరు కన్నవారి కడపటి రోజుల్లో వ్యవహరిస్తున్న అనుచిత వైఖరికి ఆయన మాతృభక్తి కనువిప్పు కావాలి.

ఆయన మానవీయతకు ఒక ఉదాహరణ... ఆయన భిక్షకు వెళ్లినప్పుడు దీనస్థితిలోని గృహిణి ఒకరు, సిగ్గు, సంకోచాలతో ఉసిరికాయను భిక్షాపాత్రలో వేసింది. అది గమనించిన శంకరులు, కనకధారా స్తోత్రంతో శ్రీమహాలక్ష్మిని అర్చించి ఆ కుటుంబు దారిద్ర్యాన్ని రూపుమాపిన కరుణామూర్తి. అమ్మవారు కేవలం ఐశ్వర్య ప్రదాత కాదని, జ్ఞానం, సౌందర్యం, శక్తి సర్వాభీష్టాలు ప్రసాదించి వరప్రదాయని అని కీర్తించారు. నేటి భక్తకోటి స్తుతిస్తున్న స్తోత్రాలలో అనేకం ఆయన గళం నుంచి వెలువడినవే.

పరమగురువు (గురువు గోవిందభగవత్పాదుల గురువు) గౌడపాదునలు సందర్శించాలనే చిరకాల వాంఛను నెరవేర్చుకున్నారు. సంకల్ప శక్తి ఫలితంగా గౌడపాదులు సాక్షాత్కరించారు. ఆనంద పారవశ్యంతో పాదాభివందనం చేసిన శంకరుని ఉద్దేశించి, 'నీ కృషి ఫలించింది. ఆయుర్దాయమూ ముగియవచ్చింది. శివదర్శనంతో అవతార పరిసమాప్తి చేసుకొని, శివసాయుజ్యం పొందు' అని ఆదేశించారు(ట). ఆ ఆజ్ఞ మేరకు కేదారేశ్వరుడి దర్శనం అనంతరం ఉత్తర దిక్కుగా పయనించి అనంత విశ్వంలో లీనమయ్యారు.

***'శ్రుతిస్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం***
***నమామి భగవత్పాద శంకరం లోకశంకరమ్'***

అవతరించిన చైతన్యదీప్తులు. అద్వైత, విశిష్టాద్వైత ప్రవక్తులు ఇద్దరూ ఒకే తిథి (వైశాఖ శుద్ధ పంచమి)నాడు ఉదయించడం విశేషం. వర్తమానంలో చెప్పుకుంటున్న ఎన్నో సంస్కరణలకు, సమభావన, సహజీవనం, సమతావాదనకు ఆ మహనీయులు నాడే బీజం వేశారు. అన్యమతాల శత్రురాజులు దాడులకు ధ్వంసమైన ఆలయాలను పునరుద్ధరణకు విశేష కృషి చేశారు. వారి బోధనలను తరచి చూస్తే వాటి వెనుక కాలాలకు అతీతంగా, ముఖ్యంగా నేటి యువతకు ఉపకరించే ఎన్నో మర్మాలు, అంశాలు దాగి ఉన్నాయి.



# సమతామూర్తి రామానుజ

తమిళనాడులోని ‘భూతపురి’ అనే శ్రీపెరంబూదురులో ఆసూరి కేశవాచార్యులు, కాంతిమతి దంపతులకు తిరువల్లిక్కేణి (చెన్నై) పార్థసారథిస్వామి వరప్రసాదిగా జన్మించిన రామానుజులు విశిష్ట ఆచార్యులుగా ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. సమ సమాజ స్థాపన కోసం పరితపిస్తూ ఆయన అహరహం పాటుపడ్డారు. కొందరికే పరిమితమైన మంత్రరాజం అందరి సొంతం కావాలనుకున్న ‘మానవతా హక్కుల మూర్తి’. అనుకున్నది సాధించడమే తప్ప వెనకడుగు తెలియని ధీశాలి.

ఆయన ఆవిర్భావం నాటికి గల మతమౌఢ్యం, కొన్ని జాతుల పట్ల చిన్నచూపు,అనైక్యత, జంతు బలులు, మూఢాచారాలు, మూఢనమ్మకాలు వంటివి ఆయనను కలచి వేశాయి.ఇవి హైందవ నాగరికతకు గొడ్డలిపెట్టుగా భావించి, జాతిమత వివక్షరహితంగా నాటి హైందవ జాతినంతటిని ఏకతాటిపై నడిపేందుకు ఉద్యమించారు. జనహితం, ధర్మరక్షణ కోసం ఎంతటి కష్టనష్టాలనైనా ఎదుర్కోవాలని, వెరవ వలసిన అవసరం లేదనే ఆత్మవిశ్వాసం. పరమాత్మ చింతనకు, భక్తిభావానికి జాతి,మత,కులాలు లాంటివి అడ్డుకావని, భగవంతుని ఉనికిని తెలిపే వారు ఎవ్వరైనా ఉన్నతులేనని ఎలుగెత్తారు.అందుకే ‘గతులన్ని ఖిలమైన కలియుగమందును/గతి ఈతడే చూపె ఘన గురుదైవము’ అని కీర్తించారు వాగ్గేయచక్రవర్తి తాళ్లపాక అన్నమాచార్య.

సర్వం విష్ణుమయం జగత్. భగవంతుడి దృష్టిలో అంతా సమానమే. మనిషికి గుణమే కొలమానం తప్ప ఇతర అంశాలు కావు’ అంటూ సమతా వాదాన్ని చాటారు.

విష్ణువును చిత్తంలో నిలిపి, సర్వమత సమానతను పాటించేవాడే వైష్ణవుడు తప్ప వైష్ణవ సామాజికవర్గంలో పుట్టిన వారంతా వైష్ణవులను రామానుజులు భావించలేదు.ఎనిమిది మంది బ్రాహ్మణేతరులు, ఒక మహిళ సహ పన్నెండుమంది ఆళ్వారుల రచనలు వెలుగులోకి తెచ్చిన ఘనత ఆయనదే. కులమతాలకు అతీతంగా అందరికీ ఆలయ ప్రవేశం కల్పించి, భోజనం (తదీయారాధన/సమారాధన) పెట్టే సంప్రదాయాన్ని నెలకొల్పారు. ‘రామానుజ కూటమి’ పేరుతో మధ్యాహ్న భోజనం, అన్నదానాలను నిర్వహించారు.

‘తిరుమంత్రం(నారాయణ మంత్రం) అసాధారణమైనది. అన్యులకు వెల్లడిస్తే రౌరవాది నరకాలకు పోతావు’ అని గురువు చేసిన హెచ్చరికలను లక్ష్యపెట్టలేదు.

‘వ్యక్తిగత స్వార్థం కన్నా సమాజ శ్రేయస్సు మిన్న. సమాజహితం కోరే క్రమంలో నాకు కీడు కలిగినా, నేను నరకానికి పోయినా పర్వాలేదు.జనులు తరిస్తారు .మనిషి గుణమే కొలమానం. భగవంతుడి దృష్టిలో అంతా సమానం’ అంటూ కులమతలింగ అడ్డు గోడలను బద్దలు కొట్టి సర్వులు పరమాత్మను చేరుకోవాలని తపించిన సమతామూర్తి. అలా శ్రీసౌమ్యనారాయణ పెరుమాళ్ కోవెల పైభాగంనుంచి నారాయణ మంత్రాల రహస్యాలను తెలియచెప్పిన ఆచార్యులు.

తాను అందరివాడినని భగవానుడే భగవద్గీతలో బోధించినప్పుడు మానవుల మధ్య తేడాలు మన్నింపరానివనే భావనతో ఆధ్యాత్మిక సంస్కరణలు చేపట్టారు. సమాజంలోని అన్ని వర్గాల వారిని ఆలయ సేవల్లో భాగస్వాములను చేశారు. భగవంతుడికి పల్లకీ మోయడం, వింజామరలు వీయడ, దివిటీలు పట్టడం లాంటి సేవలు కల్పించారు. ఆయన చొరవ కొందరు ఛాందసవాదుల్లో అక్కసు రేపి అంతమొందించే ప్రయత్నాలకు దారితీసినా వెరవలేదు. ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మవలసిన పనిలేదని, తర్కానికి నిలబడితేనే ఆహ్వానించాలని బోధించారు.

అన్ని అంశాలను సానుకూల దృక్పథంతో వీక్షించిన రామానుజులు భగవత్ భాగవతాచార్యులను, భాగవతోత్తములను కించపరచడాన్ని, తక్కువ చేయడాన్ని సహించలేరు. వేద వాక్యాలను విపరీతార్థంలో వ్యాఖ్యానించిన గురువు యాదవ ప్రకాశకులతోనే విభేదించారు. శిష్యుని ప్రతిభా సంపత్తి గురువుకు కంటగింపుగా మారింది. ఆ ఈర్ష్యా భావం రామానుజులకు హాని కలిగించే స్థాయికి చేరింది. ఆ చేదు అనుభవం పునరావృతం కాకూడదన్న భావనతోనే కాబోలు, ఎందరో శిష్యులను తీర్చిదిద్ది ‘ఆదర్శ ఆచార్యులు’గా మన్ననలు అందుకున్నారు.

‘అంత్యజుల నుంచి బ్రాహ్మణుల వరకు అందరికి భక్తి మార్గం సమానమేనని ప్రబోధించిన ఆధ్యాత్మిక సారథి భగవద్రామానుజులు’ అని స్వామి వివేకానంద, ‘ధార్మికంగా, సామాజికంగా విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టిన మహాస్రష్ట. ఎంచరానంత బలమైన ఆత్మబలం, భావితరాలపై ప్రేమ ఆయన సొంతం’ అని సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు, ‘ఒక వర్గానికి పరిమితమైన మోక్షద్వారాలను సర్వులకూ తెరిచిన సమతామూర్తి రామానుజులు’ అని తమిళ ప్రసిద్ధ కవి భారతీదాసన్ శ్లాఘించారు.

‘కేవలం జ్ఞానార్జనతోనే సరిపోదు. ధర్మానుష్ఠానంతోనే జ్ఞానం సార్థకమవుతుంది. సామాజిక బాధ్యతలు గుర్తెరిగి న్యాయదృష్టితో కర్మాచరణ చేయడంతోనే జీవితం సార్థకమవుతుంది’ అని ఉద్బోధించిన రామానుజులు, తాము ప్రారంభించిన ‘జ్ఞాన ఉద్యమం’ కొనసాగింపు బాధ్యతను 74 మంది శిష్యులకు అప్పగించారు. శిష్యప్రశిష్య పరంపరంతో భగవద్రామానుజుల ఆశయం కొనసాగుతూనే ఉంది, ఉంటుంది.

**‘రామానుజార్య దివ్యాజ్ఞా వర్ధతాం అభివర్ధతాం’**
**రామానుజస్య చరణౌ శరణౌ ప్రపద్యే**

**– స్వామి**

# చందన ప్రియుడికి అభివందన మాల

సింహాచలము మహా పుణ్య క్షేత్రము.. శ్రీ వరాహ నరసింహుని దివ్యధామమూ....' అని భక్తులతో నీరాజనాలు అందుకుంటున్న సింహగిరి దక్షిణ భారతదేశంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రాల్లో ఒకటి. హరిచందనగిరి, సుందరగిరి, సువర్ణగిరి, ప్రహ్లాదాద్రి, వరాహాచలం, నందనాద్రిగా ఖ్యాతిపొందింది. భూదేవిని రక్షించేందుకు శ్రీ మహావిష్ణువు వరాహామూర్తిగా హిరణ్యాక్షుని వధించిన తరువాత, ప్రహ్లాద పాలకుడిగా ఆతని తండ్రి హిరణ్యకశిపుని సంహరించాడు. నాటి ఉగ్రరూపం ఉపసంహరణకు బ్రహ్మాది దేవతలతో పాటు ప్రహ్లాదుడు ప్రార్థించినా, ఆ ఉగ్రత్వం తగ్గలేదు. దాంతో, బ్రహ్మ సూచన మేరకు, ప్రహ్లాదుడు చందన (గంధం) లేపనంతో సేవ చేశాడు. వరాహ నృసింహుడు శాంతించాడు. ప్రహ్లాదుడి విన్నపం మేరకు చందన చర్చితంగా భాసిల్లుతూ, సింహగిరిపై కొలువుదీరాడు. ఏడాది పొడవునా చందనలేపనంతో దర్శనమిచ్చే వరాహ నృసింహుడు అక్షయ తృతీయ నాడు (వైశాఖ శుక్ల తదియ)చందనోత్సవం పేరిట జరిగే కార్యక్రమంలో నిజరూప దర్శనం ఇస్తారు. పురూరవ చక్రవర్తికి స్వామిని ఈ తిథి నాడే మొదటిసారి దర్శించినందున అప్పటి నుంచే ఆ రోజున నిజరూప దర్శన భాగ్యం సంప్రదాయంగా వస్తోంది. అది భక్త జనావళికి పండుగ రోజు.

తెలుగు రాష్ట్రాలలోని నారసింహక్షేత్రాల ఉత్సవాలు వేటికవే ప్రత్యేకమైనవి కాక సింహాచలం చందనయాత్ర జగత్రసిద్ధం. ఏడాది పొడవునా చందనం లేపనం మాటున ఉండే స్వామి వైశాఖ శుద్ధ తదియ నాడు భక్తజన కోటికి నిజరూప దర్శనం అనుగ్రహిస్తారు. ఇదే చందనయాత్రగా ప్రసిద్ధి. చందనావృతంగా, లింగాకృతిలో భాసిల్లే స్వామి నిజ మంగళ దివ్య స్వరూపాన్ని ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే దర్శించుకోగలుగుతాం. ఇది వైకుంఠంలో లక్ష్మీ నారాయణులను దర్శించినంతటి పుణ్య ఫలితమని క్షేత్ర మహత్యం పేర్కొంటోంది.

స్థల పురాణం ప్రకారం, దనుజ సంహరణ అనంతరం ప్రహ్లాదుని అభ్యర్థన మేరకు సింహగిరిపై వరాహనరసింహుడిగా అవతరించిన స్వామికి ఆ మహా భక్తుడు అర్చనాదులు నిర్వహించాడని, బ్రహ్మ-మహేశ్వరులు, ఇంద్రాది దిక్పాలురతో తరలి వచ్చి బ్రహ్మోత్సవాలు జరిపించాడని ప్రతీతి. అనంతర కాలంలో స్వామికి ఆరాధనలు లేక ఆలయం శిథిలమై పుట్టలు లేచి స్వామి దివ్య మంగళ విగ్రహం కనుమరుగైంది. కాలాంతరంలో, పురూరవ చక్రవర్తి ఊర్వశితో గగనయానం చేస్తుండగా, స్వామి ఉన్న ప్రదేశంలో విమానం నిలిచిపోయింది. అక్కడ స్వామివారి ఉనికిని దివ్య దృష్టితో గమనించిన ఊర్వశి విషయాన్ని పురూరవుడికి తెలిపింది. అదే రాత్రి చక్రవర్తికి స్వప్న సాక్షాత్కారమైన శ్రీహరి 'తనను పుట్ట నుంచి బయటకు తీసి గంధం (చందనం) సమర్పించ'మని, వెలికి తీసిన నాడే (వైశాఖ శుద్ధ తదియ) భక్తులకు తన నిజరూప దర్శనం కలుగచేయాలని ఆదేశించారట. చక్రవర్తి వేయి కలశాల గంగ ధార, పంచామృతాభిషేకంతో పుట్టను కరగించి స్వామిని వెలికి తీయించాడట.

**చందనయాత్ర...**

వైశాఖ శుద్ధ తదియ (అక్షయ తృతీయ)నాడు స్వామి దివ్య మంగళ విగ్రహాన్ని పురూరవుడు కనుగొని, చందనసేవ చేయడం వల్ల చందనయాత్రగా స్థిరపడిపోయింది. ఆ సంప్రదాయం ప్రకారమే,



# అమిత ఫల

అనంత శుభఫలితాలను ఇచ్చేదిగా అక్షయ తృతీయ (వైశాఖ శుద్ధ తదియ)ను సంభావిస్తారు. ఇది సామాజిక పర్వదినం. కులమతాలకు అతీతంగా దీనిని జరుపుకుంటారు.

అక్షయం అంటే క్షయం లేనిది, నిరంతరం వృద్ధి చెందేదని అర్థాలు ఉన్నాయి. ఆనాడు చేసే యజ్ఞ యాగాది క్రతువులు, పూజాదికాలు, దానధర్మాలు, పితృతర్పణాలు విశేష ఫలితాలనిస్తాయని పరమ శివుడు అమ్మవారికి చెప్పినట్లు మత్స్య పురాణం, ఆ రోజు చేసే దానధర్మాలు అత్యధిక ఫలితాలను ఇస్తాయని నారద పురాణం పేర్కొంటున్నాయి. అమిత ఫలదాయినిగా భావించి నిర్వహించే ఈ వ్రతానికి లక్ష్మీనాథుడు అధినాయకుడు. మహావిష్ణువు లక్ష్మీదేవిని పరిణయ మాడిన రోజు కూడా ఇదేనట. అక్షయ తృతీయ నాడు ఎంతో కొంత బంగారం లేదా వెండిని కొనుగోలు చేయాలనే నానుడి స్థిరపడిపోయింది. అందుకే ప్రజలు తమతమ స్థోమతను బట్టి వాటిని కొనుగోలు చేసి అమ్మవారికి అలంకరించి పూజలు చేస్తారు. తహతు లేని వారు లవణం సహా నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసినా శుభమనే పెద్దలు చెబుతారు. వాటిని కొనుగోలు చేయటమే కాక ఉన్నంతలో దానధర్మాలు చేయాలని కూడా పెద్దలు చెబుతారు.

త్రేతాయుగం ఆరంభం, పరశురామ, బలరాముల జననం, భగీరథుడు దివిజ గంగను భువికి దింపినది, ద్రౌపదీ మానసంరక్షణకు శ్రీకృష్ణుడు వలువలు ప్రదానం చేసినది, పిడికెడు అటుకుల నివేదనతో బాల్య స్నేహితుడు కుచేలుడికి అనంత ఐశ్వర్యం అనుగ్రహించినది, వనవాస దీక్షలోని పాండవులకు సూర్యభగవానుడు అక్షయ పాత్రను ప్రసాదించినది ఈ రోజునే. నరనారాయణులు, హయగ్రీవ భగవానుడు ఈ తిథినాడే ఆవిర్భవించారు. శివయ్య వాహనం నంది జన్మించినది ఈ తిథి నాడే




ముందురోజే విదియనాటి రాత్రి మూలమూర్తిపై గల చందనాన్ని ఒలిచి, తదియ నాటి బ్రాహ్మీ ముహూర్తంలో స్వామికి గంగధార పవిత్ర జలాలతో సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహిస్తారు. అనంతరం స్వామి నిజరూప దర్శనాన్ని అనుమతిస్తారు. ఆ నాటి సాయం సంధ్యా సమయంలో స్వామికి మనమూలికలు, సుగంధ ద్రవ్యాలతో కూడిన 120 కిలోల చందనం సమర్పిస్తారు. మరో మూడు విడతల్లో (వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి) అంతేసి పరిమాణంలోనే చందనం అద్దుతారు. చందనోత్సవం నాడు సింహగిరి శోభాయమానంగా విరాజిల్లుతుంది. ఈ క్షేత్రంలో వివిధ ఉత్సవాలు జరుగుతున్నా, చందనయాత్రను విశేషంగా పరిగణిస్తారు. ఆరోజు స్వామి నిజరూప దర్శనానికి ఉవ్విళ్లూరుతారు. ఇక్కడ ఐదుగురు దేవతామూర్తులు గోవిందరాజస్వామి (ఉత్సవమూర్తి), మదనగోపాలస్వామి (శయనమూర్తి), వేణుగోపాలస్వామి (స్వప్నమూర్తి), యోగ నృసింహ (బలిమూర్తి), సుదర్శనుడు (చక్రపెరుమాళ్)లకు జరిగే నిత్యార్చనను 'పంచభేరి' అంటారు.

ఏటా పుష్యమాస అమావాస్యనాడు శ్రీకృష్ణ అలంకరణలో స్వామి వారికి కొండదిగువన వరాహ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. చందనోత్సవం తరువాత అంత ఘనంగా నిర్వహించే ఈ ఉత్సవం కన్నుల పండువుగా ఉంటుంది

శ్రీమద్రామానుజులు, శ్రీకృష్ణదేవరాయలు, రెడ్డిరాజులు తదితర ఎందరో ప్రముఖులు ఈ క్షేత్రాన్ని దర్శించారు. రాయలు తమ మాతృమూర్తి నాగదేవమ్మ,సర్వారాయలు పేరిట స్వామి వారికి కంఠమాల, వజ్రమాణిక్యాలు, కడియాలు, శంఖుచక్రాలు, పతకం మొదలైన ఆభరణాలు సమర్పించినట్లు ఆలయ ప్రాంగణంలో శాసనం చెబుతోంది. కంచి నుంచి కటకం వరకు పాలించిన అనేక మంది రాజులు, రాణులు స్వామి వారికి భూరి విరాళాలు సమర్పించుకున్నట్లు ఆలయ స్తంభాలపై, ప్రాకార గోడలపై రాతలు తెలియచెబుతాయి. చాళుక్య, చోళ రాజులు, వీరకూట పల్లవుల, వేంగీ చాళుక్యులు, కోరుకొండ నాయకులు, కొప్పుల నాయకులు, నందాపుర రాజులు, గాంగులు, వడ్డాదిమాత్యులు, జంతరనాటి సురబి వంశజులు, ఒడిసా గజపతులు తదితరులు సింహాద్రినాథుడిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

**సుందరాయ శుభాంగాయ**
**మంగళాయ మహౌజసే**
**సింహచల నివాసాయ**
**శ్రీనృసింహాయ మంగళమ్!!**




**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్


# దాయిని అక్షయ తృతీయ

కావడంతో 'బసవ జయంతి'ని జరుపుకుంటారు.


అక్షయ తృతీయ నాడు చేపట్టే పుణ్యకార్యాల ఫలితాలకు సంబంధించి ప్రచారంలో ఉన్న కథ ప్రకారం, ధర్మనాముడు అనే వైశ్యుడు తనకు ఉన్నంతలో ఇతరులకు సహాయం చేసేవాడు. కొంతకాలానికి కాలం చేసిన ఆయన క్షత్రియుడిగా జన్మించి జపహోమాదులు, నిత్యాన్నదానం చేయసాగాడు. సంపదనంతా వ్యయం చేసే కొద్దీ అది 'అక్షయం' (వృద్ధి) అవుతోంది. పూర్వజన్మ సంస్కారం అలా కొనసాగుతూనే ఉంటుందని పెద్దలు చెబుతారు.

**అక్షయ తృతీయ విశిష్టతలు**

- మహావిష్ణువు లక్ష్మీదేవిని పరిణయమాడిన రోజు కూడా ఇదేనట. కృతయుగంలో ప్రహ్లాద వరదుడు శ్రీహరి వరాహ నృసింహస్వామి రూపంలో పురూరవ చక్రవర్తికి స్వప్న సాక్షాత్కారం చేసి,ఏటా చందనయాత్ర జరిపించుకుంటున్నది ఈ తిథి నాడే.
- ఆషాఢ శుద్ధ విదియ నాడు జరిగే పూరి జగన్నాథుడి రథయాత్రకు సంబంధించి రథాల తయారీ ప్రక్రియకు అంకురార్పణ.
- చలికాలం తరువాత చారుధామ్‌లోని గంగోత్రి, యమునోత్రిలను అక్షయ తృతీయ నాడే తెరుస్తారు. బదరీనాథ్, కేదార్‌నాథ్‌లకు తొలి ప్రవేశాన్ని ఈ తిథికి సమీపంలోనే నిర్ణయిస్తారు.
- గంగాదేవి ఈ తిథి నాడే భువికి దిగి వచ్చిందని చెబుతారు. ఈ సందర్భంగా తమిళనాడులోని కుంభకోణంలో శ్రీ మహావిష్ణువును గరుడ వాహనంపై ఊరేగిస్తారు.
- పార్వతీమాత కాశీలో అన్నపూర్ణదేవిగా ఆవిర్భవించి, అన్నార్తును ఆదుకుందంటూ ఆమెకు ప్రత్యేక అలంకరణ చేస్తారు.
- కొన్ని ప్రాంతాలలో శ్రీకృష్ణునికి చందనలేపనం, గౌరీదేవికి డోలోత్సవం నిర్వహిస్తారు. ద్వైత సంప్రదాయవాదులు (మధ్వులు) ఈ తిథినాడు యతుల బృందావనాలకు గంధలేపనం చేస్తారు.
- దేశంలోని అనేక ప్రాంతాలలో పెళ్లి కాని యువతులతో బొమ్మల పెళ్లిళ్లు నిర్వహించే సంప్రదాయం ఉంది. దీనివల్ల యోగ్యుడు భర్తగా లభిస్తాడని విశ్వాసం. ఈ తిథినాడు వ్యవసాయ పనులు ప్రారంభించడం, భూముల కొనుగోళ్లు, భవనాలు, సంస్థలను వంటి వాటిని ప్రారంభించడం శుభప్రదంగా భావిస్తారు. ★

# స్వార్థపరుల నుంచి సామాన్యుల చెంతకు

**ఇస్లాంలోని మతపరమైన దాతృత్వ కార్యక్రమాలకు వక్ఫ్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉపయోగిస్తారు. వక్ఫ్ ఇచ్చిన వారు వాకీఫ్ (దాత). ఈ సంపదను పర్యవేక్షించడానికి నియమించిన వ్యక్తి ముతవల్లి. వక్ఫ్ బ్రిటిష్ కాలం నుండి అనేక రూపాంతరాలు చెందింది. ముసాల్మాన్ వక్ఫ్ వాలిడేటింగ్ యాక్ట్ 1913, ముసాల్మాన్ వక్ఫ్ యాక్ట్ 1923, వక్ఫ్ ఆక్ట్ 1954, సవరణలు 1959, 64,69, 1984 లో చేశారు. వక్ఫ్ 1954 యాక్టును మార్చి 1995లో కొత్త చట్టం తెచ్చారు. 2013లో సవరణలు ద్వారా వక్ఫ్‌కు దేశంలో ఏ సంస్థకు లేని అధికారం ఇచ్చి, ఆ వ్యవస్థలో అవినీతికి రాజమార్గం వేసింది కాంగ్రెస్ ప్రభుత్వం.**




వక్ఫ్‌కు ప్రపంచంలో అత్యంత ఆస్తులు ఉన్నది భారతదేశంలోనే. 2024 నాటికి మొత్తం ఆస్తులు 9.4 లక్షల ఎకరాలు. వాటి విలువ దాదాపు రూ. 1.2 లక్షల కోట్లు (మార్కెట్ విలువ ఇంకా ఎక్కువే). అందులో 5,32,819 ఎకరాలకు లెక్కలు లేవు. లేదా కబ్జాలలో ఉన్నవి. ఇక సచార్ కమిటీ నివేదిక ప్రకారం వక్ఫ్ ఆస్తుల నుండి ఏడాదికి కనీసం రూ. 12,000 కోట్ల ఆదాయం రావాలి. కానీ 2019లో రూ. 163 కోట్లు వస్తే, 2024 మొత్తం దేశంలో కేవలం రూ. 1.6 కోట్ల ఆదాయం రావడం హాస్యాస్పద సన్నివేశం. రక్షణ రంగం, రైల్వేస్ తర్వాత అత్యధిక ఆస్తులు ఉన్నది ఇస్లాం మతపరమైన వక్ఫ్ సంపద. అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్నట్లు, వక్ఫ్ పేద ముస్లింలకు ఒక వరం కావలిసింది, ఒక శాపం అయింది.

**వక్ఫ్ బోర్డులో ప్రధాన సమస్యలు**

అధికారం కొండంత, జవాబుదారీతనం మాత్రం శూన్యం : ముత్తవల్లివే సర్వాధికారాలు. ఇది అత్యంత అవినీతిమైన వ్యవస్థగా పేరు పొందింది.

భూములు ఎక్కువగా కబ్జాలలో ఉన్నాయి. లేదంటే కోర్టు కేసులలో ఉన్నాయి. కొన్నింటిని బంధువులకు అప్పగించారు.

కోట్ల ఆస్తులు, పైసల్లో లీజు లేదా అద్దెలు. పైగా ఏ లీజు అయినా కనీసం 30 ఏళ్లకు తగ్గదు.

వక్ఫ్ బోర్డు సభ్యులంటే ఒక సిండికేట్ అంటే సత్యదూరం కాదు. మొత్తం ఆస్తులు ముస్లిం నాయకులు, నవాబులు, ఉన్నత వర్గాల హస్తగతంలోనే ఉన్నాయి. అత్యధిక ఆస్తులు ఈ పెద్దల ఆసుపత్రుల కోసం, వైద్య కళాశాలల కోసం, వాణిజ్య సముదాయాల కోసం వినియోగంలో ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఆస్తులలో 77,538 ఎకరాలు భూములు రూపంలో ఉన్నాయి. మరొక 33,929 ఆస్తులు ఉన్నాయి. అందులో 57,423 (75%) ఎకరాలు కబ్జాలలోనే ఉన్నాయి. 3500 కేసులు నడుస్తున్నాయి. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం దాదాపు రూ. 4 లక్షల కోట్లు ఉన్న ఈ ఆస్తుల వలన వచ్చే ఆదాయం మాత్రం సున్న. ఉదారణకు చార్మినార్ దగ్గర ఉన్న మదీనా కాంప్లెక్స్ అనే వాణిజ్య సముదాయం వక్ఫ్ ఆస్తి, కోట్ల ఆదాయం వస్తున్నా వక్ఫ్ సంస్థకు ఇచ్చే అద్దె ఏడాదికి రూ. 10,000 కూడా లేదు.

8,70,000 (8.7 లక్షల) ఆస్తుల వివరాలకు బదులు కేవలం 3,30,000 (3.3 లక్షల) అందుబాటులో ఉన్నాయి. మిగతా వాటికి లెక్కలు లేవు.


2013లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గద్దె దిగేటప్పుడు వక్ఫ్ చట్టంలో సెక్షన్ 40 జొప్పించింది. ఇది ఒక రాజ్యాంగ ఉల్లంఘన. సెక్షన్ 40 ప్రకారం ముత్తావలి, ఎలాంటి ఆధారాలు లేకుండా భారతదేశం మొత్తాన్ని కూడా వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించే అవకాశం కల్పించారు. ఇంకా ఘోరమైన విషయం, భారత దేశంలోని ఏ కోర్ట్ వక్ఫ్ ట్రిబ్యునల్ లేదా ముత్తవలి చర్యలను సమీక్షించే అవకాశం లేకుండా చేశారు.

వక్ఫ్ బోర్డులో ముస్లింలలో వెనకపడ్డ వర్గాలకు, స్త్రీలకు రిజర్వేషన్ లేదు. కేవలం ముస్లింలలోని ఉన్నత వర్గాలకే అవకాశం. దీనితో వీరిదే ఆడింది అట, పాడింది పాట అయింది.

వక్ఫ్‌పై దేశంలో 40,000 కేసులు ఉంటే, అందులో 10,000 ముస్లిములు వేసిన కేసులే.

**సెక్షన్ 40 అరాచకం**

దేశం మొత్తంలో కోర్టుల పర్యవేక్షణకు అవకాశం లేని ఏకైక చట్టం అది.




# వక్ఫ్ ఆస్తి

తమిళనాడులోని ఒక గ్రామం (తిరుచందురై) మొత్తం వక్ఫ్ ఆస్తి అని ప్రకటించారు.

సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ భవన, ఆవరణ మావేనని వక్ఫ్ ప్రకటించింది.

దేవభూమి ద్వారకలో బెట్ ద్వారకలో రెండు ద్వీపాలు తమవేనని వక్ఫ్ ప్రకటించింది

సూరత్‌లోని శివశక్తి సొసైటీలో రెండు ప్లాట్లు వక్ఫ్‌వని ప్రకటించి అక్కడ ఒక మసీదు నిర్మించారు.

తిరుచందురై దేవాలయం 600 ఎకరాలు, బెంగళూరులో 600 ఎకరాలు, కర్ణాటక, విజయపురి జిల్లాలో 1500 ఎకరాలు, కర్ణాటక దత్తపీఠ్ మందిర్, కర్ణాటక పాలీపుర ఆలయ భూములు 600 ఎకరాలు, కేరళ క్రిస్టియన్ మిషనరీస్ ఆస్తులు, తెలంగాణలోని 4000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూమి, అసెం మోరి గోవాన్‌లో 400 ఎకరాలు, ప్రయాగరాజ్‌లోని చంద్రశేఖర్ ఆజాద్ పార్క్, మహారాష్ట్రలోని మహాదేవ్ మందిర్.. ఇలా 2013 లో 9.4 లక్షల ఎకరాలు ఉన్న వక్ఫ్ ఆస్తులను సెక్షన్ 40 అడ్డం పెట్టుకొని వివిధ రాష్ట్రాలలో 36 లక్షల ఎకరాలు ప్రభుత్వ, ప్రైవేట్ భూమి వక్ఫ్ ఆస్తులు అని ప్రకటించి ఒక మహా న్యాయ వివాదానికి కారణమైంది.

**తెలంగాణలో**

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఆస్తులలో 77,538 ఎకరాలు భూముల రూపంలో ఉన్నాయి. మరొక 33,929 ఆస్తులు ఉన్నాయి. అందులో 57,423 (75%) ఎకరాలు కబ్జాలలోనే ఉన్నాయి. 3500 కేసులు నడుస్తున్నాయి. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం దాదాపు రూ.4 లక్షల కోట్లు ఉన్న ఈ ఆస్తులపై వచ్చే ఆదాయం మాత్రం సున్న. ఉదారణకు చార్మినార్ దగ్గర ఉన్న మదీనా కాంప్లెక్స్ అనే వాణిజ్య సముదాయం వక్ఫ్ ఆస్తి, కోట్ల ఆదాయం వస్తున్నా వక్ఫ్ సంస్థకు ఇచ్చే అద్దె ఏడాదికి రూ.10,000 కూడా లేదు. తెలంగాణలో కబ్జా అయిన భూముల్లో అత్యధికంగా బడా నేతల, బడా వ్యాపారుల ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, ప్రైవేట్ హాస్పిటల్స్, ప్రైవేట్ విద్య సంస్థలు, ఫంక్షన్ హాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కంపెనీలు ఉండటం విశేషం. కొన్ని నామమాత్రపు లీజు అందుతోంది. అత్యధికంగా కబ్జాల పాలయ్యాయి. అవన్నీ అప్పగించవలసి వస్తుందనే ముస్లిం నేతలు గొడవ చేస్తున్నారు. ఆ వ్యతిరేకత కూడా అందుకే.

**సచార్ కమిటీ సిఫారసులు**

2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ సచార్ నాయకత్వంలో ముస్లిముల ఆర్థిక, సామాజిక, విద్య పరిస్థితుల గురించి, వారి పురోభివృద్ధి గురించి, సూచనలు ఇవ్వడానికి కమిటీని ఏర్పాటు చేసింది. అందులోని వక్ఫ్‌కు సంబంధించిన అంశాలు పరిశీలించదగినవి.

- వక్ఫ్ ఆస్తుల నుండి ఏడాదికి కనీసం రూ. 12,000 కోట్ల ఆదాయం రావాలి. కానీ కేవలం రూ. 163 కోట్లు మాత్రమే వస్తోంది. (2024లో కేవలం 1.6 కోట్ల ఆదాయం).
- ముత్తవల్లి పనితీరు పారదర్శకంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి.
- రికార్డులు మొత్తం పారదర్శకంగా ఉండాలి.
- ఏ మతం వారయినా వక్ఫ్ బోర్డులో సాంకేతిక నిపుణులను నియమించాలి.
- బోర్డులో మహిళలు, వెనకపడ్డ వర్గాలు, ముస్లింలలో ఉన్న ఇతర తెగలకు (షియా, అఘకాని, ఇస్నాలియాన్, బోరా) స్థానం కల్పించాలి
- జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులను కౌన్సిల్, బోర్డులలో స్థానం కల్పించాలి.
- వక్ఫ్ బోర్డును ఫైనాన్సియల్ ఆడిట్ పరిధిలోకి తేవాలి.


ఈ సూచనలు కేవలం ముస్లింల అభివృద్ధి కొరకు సూచించినవి.

**ఇస్లామిక్ దేశాలలో వక్ఫ్**

సౌదీ అరేబియా, టర్కీ, ఇరాక్, ఇరాన్, ఒమాన్, మలేసియా, ఇండోనేషియా లాంటి అనేక దేశాలలో భారత వక్ఫ్ బోర్డుల ఆస్తుల కంటే చాల తక్కువ. అలానే అత్యధిక దేశాలలో ప్రభుత్వ అధికార యంత్రాంగ పరిధిలోనే వక్ఫ్ నడుస్తున్నాయి. ప్రత్యేక ప్రతిపత్తి అంటూ ఎక్కడ లేదు.

యూనిఫైడ్ వక్ఫ్ నిర్వహణ, సాధికారత, సమర్థత,అభివృద్ధి చట్టం (2025) ద్వారా ముస్లిం సమాజానికి కలిగే లాభాలు ఏమిటో కూడా చెప్పాలి. పారదర్శకత పెంపునకు ప్రయత్నం జరుగుతుంది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, డిజిటల్ రికార్డింగ్‌కు అవకాశం వస్తుంది. ఆర్థిక సద్వినియోగం, వక్ఫ్ ఆస్తుల ఆదాయాన్ని సామాజిక, విద్యా అభివృద్ధికి వినియోగించడం సాధ్యమవుతుంది. అక్రమ ఆక్రమణల నివారణ, అక్రమణలపై కఠినచర్యలు, చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకునే అవకాశం కొత్త సవరణ వల్ల వస్తుంది. పరిపాలనా సామర్థ్యం: వక్ఫ్ బోర్డుల పనితీరులో సమర్థతను పెంచడం కూడా ఈ సవరణ ఉద్దేశం. మహిళలకు సమాన హక్కులు మరొక కీలక అంశం. వక్ఫ్ నిర్వహణలో మహిళా ప్రాతినిధ్యం ఉంటుంది. ముస్లింలలోని వెనుకపడ్డ వర్గాలకు, అల్పసంఖ్యాక వర్గాలు షియా అఘకాని, బోరా, ఇస్మాయిలి వర్గాలకు ప్రాతినిధ్యం దక్కుతుంది. సాంస్కృతిక, సామాజిక అభివృద్ధి ఆలోచన కూడా ఇందులో ఉంది. పేద ముస్లింలకు విద్యా, ఆరోగ్య పరిరక్షణకు వక్ఫ్ ఆదాయాన్ని అందించడం జరుగుతుంది. వక్ఫ్ బోర్డుల నిర్ణయాలకు వ్యతిరేకంగా ఫిర్యాదు అవకాశం కూడా ఈ సవరణ ఇస్తుంది. ఆడిట్ నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉంచడం మరో అంశం.

ఇప్పటి వరకు వక్ఫ్ చట్టం కేవలం నాయకులకు, ధనిక వర్గాలకు, ఆక్రమణ దారులకు ఒక అడ్డాగా మారింది. అల్లాహ్ పేరుతో పేదవర్గాలకు చేరవలసిన ఫలాలు ధనిక ముస్లిం వర్గాలు కొల్లగొట్టాయి. ప్రధాని నరేంద్ర మోదీ అల్లాహ్ ఆస్తులు ముస్లిం వర్గాలలోని పేద వర్గాలు, మహిళలకు అందాలనే ప్రయత్నం చేశారు. ఇందువలన హిందూ సమాజానికి కానీ, ఇతర మతస్థులకు కానీ వచ్చే లాభం ఏమి లేదు. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనే స్ఫూర్తే ఈ సవరణల ప్రధాన ఉద్దేశం.



**డా. బూర నరసయ్య గౌడ్**
ధార్మిక హిందూ పరిషద్
మాజీ ఎంపీ – భువనగిరి

**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలతో విడివిడిగా చేస్తున్న సుంకాల సమరాలు భారత్‌కు ఒక భౌగోళికశక్తిగా అంతర్జాతీయ యవనికపై తన శక్తి, సామర్థ్యాలను నిరూపించుకునేందుకు ఒక అవకాశాన్ని ఇస్తున్నాయి. తద్వారా భారత్‌ను తన సొంత ఆర్థికాభివృద్ధి నమూనాతో నిలిచిన అద్వితీయ శక్తిగా అంతర్జాతీయ సమాజం పరిగణనలోకి తీసుకుంటుంది.**




# ఉత్థాన పతనాలు అ... భారత్‌కు బంగారు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గడచిన కొద్ది వారాలుగా జారీ చేసిన సుంకాల ప్రభావంపై పెద్ద ఎత్తున అధ్యయనాలు జరుగుతున్నాయి. సుంకాల విధింపునకు అనుకూలంగా, వ్యతిరేకంగా బల్లగుద్ది మరీ వాదిస్తున్నవారు మరింత చర్చకు ఆస్కార మిస్తున్నారు. ఆ క్రమంలో సుంకాలు, వాణిజ్యం, ఆర్థిక లావాదేవీలు అంతటా మారుమోగిపోతున్నాయి. అభివృద్ధికి సంబంధించిన ఒక ఇతివృత్తానికి ఊతమిస్తున్నాయి.

పలువురు విశ్లేషకులు సుంకాల సవరింపును వాణిజ్య సమరం అని అన్నారు. అయినప్పటికీ ఇతరులు అంతర్జాతీయ రాజకీయ వాతావరణంపైకి పోటెత్తుతున్న వాణిజ్యం కేంద్రంగా చోటు చేసుకున్న సంఘర్షణ తాలూకు పరిణామాలను పరిశీలించడానికి ప్రయత్నించారు. అది మార్కెట్లు, ఈక్విటీలు, కరెన్సీలు, ఉత్పత్తులు, బులియన్, తదితర ఆర్థిక అంశాలపై వెంటనే ప్రభావాన్ని చూపించింది. మార్కెట్‌లో గందరగోళం తలెత్తింది.

ట్రంప్ చెప్పినట్టుగా 'విముక్తిదినం' అంటూ వైట్‌హౌస్ సుంకాలపై ఉత్తర్వులను జారీ చేసిన తర్వాత ఇన్వెస్టర్ల తాలూకు బిలియన్ల డాలర్ల కొద్దీ సంపద రాత్రికి రాత్రే తుడిచిపెట్టుకోవడమో లేకుంటే పాక్షికంగా పూర్వస్థితికి రావడమో జరిగింది.



**కె.ఎ.బదరీనాథ్**
**డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్ హోలిస్టిక్ స్టడీస్, న్యూఢిల్లీ.**

అమెరికా దేశానికి ఐరోపా యూనియన్‌తో– ఈయూ 200 బిలియన్ డాలర్లు, చైనాతో 300 బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్య లోటు ఉంది. అధ్యక్షుడు ట్రంప్ ఈయూ, చైనాలను లక్ష్యంగా చేసుకొని సుంకాలను పెంచినప్పటికీ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్లు, లాజిస్టిక్స్ కంపెనీలు నిలువ నీడ కోసం అలమటించినట్టుగా బెంబేలెత్తిపోయాయి.

ట్రంప్ 1.2 ట్రిలియన్ డాలర్లకు పేరుకుపోయిన అమెరికా వాణిజ్య లోటును తగ్గించడం కోసమని స్నేహితులు, శత్రువులు అనే తేడా లేకుండా 60 దేశాలపై వెక్కిరింతను జోడించి మరీ పెద్ద ఎత్తున సుంకాలను విధించారు.

'లావాదేవీల ట్రంప్' పాలనా యంత్రాంగం దాదాపు 100 దేశాలను ఉపేక్షించింది. దీంతో కొందరు ఆర్థికవేత్తలు అమెరికా వాణిజ్య మిగుళ్లను వేలెత్తి చూపారు.

2024 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ రాజకీయ అజెండా అమెరికన్లను, వారి వ్యాపారాలను అన్యాయంగా చూసిన తీరును, ఉత్పాదకరంగాన్ని అమెరికా నుంచి ఇతర దేశాలకు తరలించడం ద్వారా తన 'ఓటర్ల'కు ఉద్యోగ అవకాశాలను నిరాకరించిన వైనాన్ని సరిచేయడం చుట్టూ తిరిగింది. ఇది కూడా ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠంపైన కూర్చోవడంలో ఆయనకు అతి పెద్ద రాజకీయ అజెండాగా మారింది.

ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' (అమెరికాకు పూర్వ వైభవాన్ని తెద్దాం) అజెండాతో దేశంలో శ్వేతజాతీయ ఓటర్లను చేరుకోవడానికి తోడు ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతున్న యావత్ ప్రపంచాన్ని తమ భుజస్కంధాలపై మోస్తున్న అమెరికన్లపై భారాన్ని తొలగించడం చుట్టూనే ఆయన ఆలోచన కేంద్రీకృతమైంది.

ఇకపై అమెరికాలో వాణిజ్యం, సుంకాలు, ఉత్పాదకత, ఉద్యోగాల అజెండా అమలు కానుంది. దానికి సంబంధించిన సంకేతాలు అందుకునే వారెవరికైనా శుభాశుభాలను సూచిస్తాయి. వాటికి తరుణోపాయాన్నీ అందిస్తాయి.

వాషింగ్టన్, తదితర ప్రాంతాల్లో మొదలైన వాణిజ్యం, ఆర్థిక భాగస్వామ్య సంప్రదింపులను వేగవంతం చేయడం కోసమని సుంకాల విధింపును 90 రోజులకు నిలుపుదల చేయడంతో అమెరికా వాణిజ్య భాగస్వామ్య దేశాలు అమెరికాపై ప్రతీకార సుంకాలను విధించాలనే ఆలోచనను ప్రస్తుతానికి పక్కన పెట్టాయి.

అయితే చైనాపై అమెరికా సవతి తల్లి ప్రేమను చూపించింది. చైనా నుంచి అమెరికా దేశానికి ఎగుమతి అయ్యే ఉత్పత్తులు, సేవల్లో ఎక్కువ వాటిపై 145% సుంకాన్ని విధించింది. దీనికి బదులు చెబుతున్నట్టుగా చైనా అమెరికా ఉత్పత్తులు, సేవలపై 84% సుంకాన్ని విధించింది. అయితే ఇదంతా కూడా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల విధింపును 90 రోజులకు నిలుపుదల చేస్తూ చేసిన ప్రకటన వెనుక ప్రణాళికలో భాగం కాదు.

ప్రస్తుతానికి ఈ సుంకాల సమరం కాస్తా అమెరికా, చైనా మధ్య ప్రత్యక్ష పోరాటంగా మారింది. పోరాటం

# నివార్యం..
# అవకాశం

అంతు చూసే దాకా ఆగేది లేదని చైనా ప్రతినబూనింది.

అమెరికా, దాని వాణిజ్య భాగస్వాముల మధ్య సంప్రదింపులు సుదీర్ఘకాలం పాటు జరుగుతాయి కాబట్టి వాణిజ్యం కేంద్రంగా జరుగుతూ ముదిరిపాకాన పడుతున్న ఈ యుద్ధం ఇప్పట్లో ముగిసేలా కనిపించడంలేదు.

వాణిజ్యానికి సంబంధించిన అంశాలు పరిష్కారమైనప్పటికీ పశ్చిమ దేశాల ప్రపంచీకరణ నమూనాపై పెను ప్రభావం చూపుతుంది. బ్రెట్టన్ ఉడ్స్ ఇన్‌స్టిట్యూషన్స్ అని పిలుచుకునే అంతర్జాతీయ ద్రవ్యనిధి – ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు రీసెట్ బటన్ నొక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థికపరమైన వ్యవహారాలు కొత్త దృక్కోణం సంతరించుకోవడం అనివార్యమవుతుంది. ఈ మార్పు ప్రపంచ దేశాలపై మరీ ముఖ్యంగా పేదరికంలో మగ్గుతున్న దేశాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి పెద్ద దిక్కుగా మారుతుంది.

సొంత దేశపు ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ అమెరికా కేంద్రంగా ట్రంప్ ప్రవేశపెట్టే ఆర్థిక విధానాలు భౌగోళిక–రాజకీయ, ఆర్థిక రంగస్థలాన్ని కమ్యూనిస్టు చైనాలాంటి అగ్రదేశాలకు అప్పగించడానికి దారి తీస్తుంది.

ప్రతీ దేశమూ అది చిన్నది లేదా పెద్దది కావొచ్చు అగ్రదేశాలైన అమెరికా, చైనా లేదా ఐరోపా యూనియన్ లాంటి వాటిపై ఆధారపడకుండా వాటి నుంచి తనను తాను కాపాడుకోవడానికి ఉపకరించే వైఖరిని త్వరగా వంటపట్టించుకోవాలి.

వచ్చే నాలుగేళ్లలో మరిన్ని దేశాల నుంచి సామాజిక–ఆర్థిక స్వయంసమృద్ధి ఉద్యమాలు వెల్లువెత్తవచ్చు. ఈ నేపథ్యంలో గత 11 సంవత్సరాలుగా భారత్ నడుపుతున్న స్వయంసమృద్ధి ఉద్యమాలకు సార్థకత ఏర్పడుతుంది. ఎందుకంటే ఇప్పుడున్న వ్యాల్యూ చైన్లు పునరుద్ధరణకు నోచుకుంటాయి, తెగిపోతాయి. అయినప్పటికీ మళ్లీ కలవడమనేది తప్పకుండా ఉంటుంది.

విదేశాంగ విధానం, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి భారత్ 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి' ఉడుంపట్టు పడుతుంది. ఆదరబాదరగా స్పందించడానికి భారత్ సుముఖంగా లేదు. ఐరోపా యూనియన్‌లో పలు సభ్య దేశాలు లేదా చైనా లాగా చిర్రుబుర్రులాడుతూ దీటైన చర్యలను ప్రకటించడం లేదు. భారత్ కాలపరీక్షకు నిలిచే స్వయంప్రతిపత్తితో కూడుకున్న విధానపరమైన ప్రతిపాదన దన్నుగా జారగిలబడి ఉంది.

**భారత్‌కు దశ దిశ సూత్రాలు:**

భారత్ మొదటగా అమెరికా, ఐరోపా యూనియన్, యూకేతో కుదుర్చుకునే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు– ఎఫ్‌టీఏలపై పెట్టుబడులు లాంటి ఆర్థిక పరామితులతో మరోసారి కసరత్తు చేయాల్సి రావొచ్చు.

రెండవదిగా తనపైన కూడా 26% అదనపు సుంకం పడింది కదా అని భారత్ అమెరికా వ్యతిరేక కూటముల వలలో పడకుండా తనను తాను నిగ్రహించుకోవాలి. దానర్థం అమెరికాపై కక్ష తీర్చుకోవడానికని భారత్‌కు స్నేహ హస్తం అందించడానికని చైనా ముందుకు వచ్చినప్పుడు డ్రాగన్ ముఖానే తలుపులు గట్టిగా వేయమనికాదు.

మూడవదిగా భారత్ తనకు సరిసమాన స్థాయిలో, గౌరవప్రదమైన విధి, విధానాలతో పరస్పరం ప్రయోజనం కలిగిస్తూ కలకాలం నిలిచి ఉండేలా కొత్త భాగస్వాములతో సంబంధాలు ఏర్పరుచుకోవడాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు.

నాల్గవదిగా భారత్ 'వసుధైవకుటుంబకం' – ప్రపంచం ఒక పెద్ద కుటుంబం స్ఫూర్తిగా వాణిజ్యం, ఆర్థికం, అభివృద్ధి, భౌగోళిక–రాజకీయ ఒడంబడిక విషయంలో ఆచితూచి వ్యవహరించవచ్చు.

ఐదవదిగా భారత్ అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులను తోసుకుంటూ ఆరోహణ క్రమంలో పురోగమిస్తోంది. అయితే భారత్ ఒక 'బాధ్యతాయుతమైన ఆర్థికశక్తి కేంద్రం'గా అవతరించాలనే తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఉపకరించే బాటను ఎత్తుపల్లాలు లేకుండా చక్కగా వేసుకోవాలి.


ఆరవదిగా, భారత్ వరుసలో ఆఖర్న నిలుచున్న వ్యక్తికి సైతం ఫలాలు అందించాలనే వైఖరితో బహిరంగమైన, సులభతరమైన నియమాలు, నియంత్రణలు చోదకమైన ఓ 'మానవ ముఖం'తో కూడుకున్న ఆర్థిక ఒడంబడికను కుదుర్చుకోవాలి.

ఏడవదిగా, భారత్‌కు సామాజిక–ఆర్థికాభివృద్ధిపై తాను స్వంతంగా తయారుచేసిన నమూనాను ప్రపంచం ఎదుట ప్రదర్శించడానికి సరైన సమయం ఆసన్నమైంది. అది వినియోగదారులే లక్ష్యంగా వారిని దోచుకోదు. బదులుగా భారత్ నమూనా ప్రకృతికి, మానవ జీవనానికి మధ్య సమన్వయాన్ని ముందుకు తీసుకొని వెళుతుంది. అది వనరులను వివేకవంతంగా వినియోగించడంపైన మనుగడ సాగిస్తుంది.

ఎనిమిదవదిగా, అటు భౌగోళిక రాజకీయాల్లోనూ, ఇటు మార్కెట్ కేంద్రిత వ్యవహారాల్లోనూ అంతర్జాతీయ శక్తుల పునర్వ్యవస్థీకరణ అనివార్యమవుతుంది. సరిగ్గా అలాంటి సమయంలోనే అటువంటి చోట్ల భారత్ తనకుంటూ బాధ్యతాయుతమైన ఒక విలక్షణమైన పాత్రను స్వయంగా తీర్చిదిద్దుకోవాలి.

తొమ్మిదవదిగా, స్వదేశీ విజ్ఞానంపై పూర్తి భరోసా, అన్యోన్యమైన సౌభాగ్యం, శ్రేయస్సు కోసమని సనాతన ధర్మ విలువల ఆధారిత అభివృద్ధి భారత్ శక్తి, సామర్థ్యాలకు ఒక గీటురాయిగా మారుతాయి.

పదవదిగా, ఎవరైనా ఒక బలహీనమైన స్థితిలో ఉంటూ నాయకత్వ పాత్రను పోషించలేరు. భారత్ సముపార్జిస్తున్న ఆర్థిక పరిపుష్టి భారత్‌ను ఒక అతిపెద్దపాత్రను పోషించేలా చేస్తుంది. ★



आर्य समाज 150 स्वर्णिम वर्ष


मानव सेवा के

1875 ~ 2025

# కృణ్వంతో

'వేదాల వైపు మరలండి!' అని నినదించి, దాదాపు నిర్జీవ స్థితికి చేరుకున్న హిందూ సమాజాన్ని మేల్కొల్పిన వారు స్వామి దయానంద సరస్వతి. స్వదేశీ, స్వరాజ్య అన్న పదాలను మొదట ప్రవచించి, భారతీయులను పెను నిద్దర నుంచి లేపినవారు కూడా ఆయనే. భారతీయత పునాదిగా కలిగిన భవిష్యత్ భారతదేశాన్ని కలగన్నారు. ఆర్థిక ప్రణాళికలనూ, ఆధ్యాత్మిక కార్యక్రమాన్నీ సమానంగా ప్రచారం చేసిన తొలి సంస్థ దయానందులు స్థాపించిన ఆర్య సమాజ్.

'రాజకీయపరమైన పునర్ నిర్మాణం ఆశయంతో భారతదేశంలో జరిగిన ఉద్యమాలన్నింటిలోను ఆర్యసమాజ్ ఉద్యమమంత శక్తిమంతమైనది మరొకటి లేదు. ఆ సంస్థ వ్యవస్థాపకులు ప్రకటించిన మూల సిద్ధాంతం- సంపూర్ణ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో కూడిన జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించడమే.' 'ఇండియన్ సోషియాలజిస్ట్' పత్రిక (మే, 1908)లో గదర్ పార్టీ ప్రముఖుడు, ఆర్యసమాజ్ ప్రేరణతో జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించిన శ్యామ్‌జీ కృష్ణవర్మ చేసిన వ్యాఖ్య ఇది. ఇండియన్ సోషియాలజిస్ట్ (1905-1922) లండన్ కేంద్రంగా విప్లవకారులు వెలువరించేవారు. దేశంలో 19వ శతాబ్దంలో జాతీయ చైతన్యం అంకురించింది. జాతీయోద్యమం వలెనే ఈ చైతన్యం కూడా ఒకే ఛాయతో లేదు. మన గతం ఆధారంగా దేశ పరిస్థితులను దర్శిస్తూ, ఉద్యమించాలన్న దృక్పథం కల్పించిన జాతీయవాదం అందులో ఒకటి. బ్రిటిష్‌వారికి ఆగ్రహం కలగకుండా పాలనలో మనకూ కాస్త చోటు దక్కించుకోవాలన్న ధోరణిలో నిర్మితమైన జాతీయవాదం మరొకటి. రెండింటి ధ్యేయం బ్రిటిష్ ప్రభుత్వాన్ని కట్టడి చేయడమే. మన సాంస్కృతిక నేపథ్యం ఆధారంగా, ఆర్షధర్మంలోని మూలాలతోనే జాతీయవాదాన్ని నిర్మించాలన్న ధ్యేయంతో ఆవిర్భవించినది ఆర్య సమాజ్.



విరజానంద

**స్వామి దయానంద సరస్వతి**

ఆర్య సమాజ్ స్థాపకులు స్వామి దయానంద సరస్వతి. ఆధునిక భారతదేశ చరిత్రలో ఎక్కువ ప్రాచుర్యం పొందిన, ప్రజలకు చేరువైన సంస్కర్తగా ఆయనకు అగ్రతాంబూలం ఇస్తారు. స్థానీయతను నింపిన జాతీయవాదాన్ని సాధారణ ప్రజల దగ్గరకి తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. సామాజిక, రాజకీయ చింతనలో 'స్వ' అన్న ధోరణిని ఆవిష్కరించిన మహానుభావుడు దయానందులు. స్వరాజ్, స్వభాష, స్వదేశీ అంటూ ఆయన భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించడానికి చాలా ముందే పిలుపునిచ్చారు. స్వదేశీ ఆలోచనకు బీజం వేసినది ఆర్య సమాజ్.


**సరైన గురువు**

ఆయనకు చూపు లేదు. కానీ జాతికి ఎలాంటి దృష్టి ఉండాలో గొప్ప కల్పన చేసిన ద్రష్ట ఆ యోగి. పేరు విరజానందులు. ఆధ్యాత్మిక చరిత్రలో ఒక మాట వినిపిస్తూ ఉంటుంది. 'స్వామి విరజానంద సరస్వతి లేదా విరజానంద దాండిశ్ లేకపోతే స్వామి దయానంద సరస్వతి లేరు. దయానంద సరస్వతి లేకుండా వైదిక ధర్మ పునరుద్ధరణ జరిగేదికాదు.' విరజానంద భారతదేశ చరిత్రలోనే మహోన్నత వ్యక్తి. 'స్వేచ్ఛ అంటే స్వర్గం, బానిసత్వం అంటే నరకం' అని నిర్వచించినవారాయన. విదేశీయులు సుపరిపాలన అందించవచ్చు. అదెంత గొప్పదయినా స్వయం పాలన దానికంటే వేయి రెట్లు గొప్పది అని ఆయన చెప్పారు. 19వ శతాబ్దం నాటి భారతీయ పునరుజ్జీవనోద్యమంలో విరజానందకు కూడా కొంత చోటు దక్కవలసి ఉంది. విరజానంద గొప్ప సంస్కృత వ్యాకరణ పండితుడు. 'మధుర అంధ సాధువు' అని పేరు పడిన విరజానంద (1778- 1868) పంజాబ్ ప్రాంతానికి చెందినవారు. అసలు పేరు వ్రజ్‌లాల్. ఐదో ఏట మశూచి సోకి కళ్లు పోయాయి. 12 ఏట తండ్రిని కోల్పోయారాయన. అన్నావదినలు సరిగా చూడకపోవడం వల్ల ఇల్లు వదిలి వెళ్లారు. హరిద్వార్ చేరుకుని మూడేళ్లు ఉండి ధ్యానం చేశారు. అక్కడే స్వామి పూర్ణానంద ఆయనకు సన్యాసదీక్ష ఇచ్చారు. పూర్ణానంద గొప్ప సంస్కృత పండితుడు కూడా. పూర్ణానంద వద్ద సంస్కృత వ్యాకరణం, సాహిత్యం చదువుకున్న తరువాత కాశీ వెళ్లారు విరజానంద. పదేళ్లు అక్కడే ఉండి వేదాంతం, ఆయుర్వేదం అభ్యసించారు. గయ వెళ్లి ఉపనిషత్తులను అధ్యయనం చేశారు. తరువాత కలకత్తాలో కొద్దికాలం ఉండి, అంతిమంగా మధుర చేరుకుని అక్కడ సంస్కృత పాఠశాల నెలకొల్పారు. దానికి దేశం నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చేవారు. ఇల్లు విడిచి వచ్చిన దయానంద కూడా అక్కడకు చేరుకున్నారు. అదొక చారిత్రక సందర్భం. సమర్థ రామదాసుతో శివాజీ, రామకృష్ణ పరమహంసతో వివేకానందల తొలి సమావేశాలతో పోల్చదగినది. విరజానంద శిష్యరికంలో దయానంద గొప్ప పండితుడయ్యారు. విరజానంద తన శిష్యుడు దయానందను గురుదక్షిణ అడిగారు. 'కుమారా! దయానందా! వెళ్లు, నిజమైన వేదజ్ఞానం గురించి బోధించు. ఈ అంధకారాన్ని అజ్ఞానాన్ని రూపుమాపు. సత్యం, భారతదేశాన్ని విముక్తం చేయడం అనే అంశాల వాస్తవికత ఏమిటో ప్రచారం చెయ్యి' అని అడిగాడు. తాను గురు ఆజ్ఞ పాటిస్తానని దయానంద ప్రతిజ్ఞ చేశారు. 1836లో ఇల్లు వీడిన దయానంద 1846లో విరజానందను కలుసుకున్నారు. విరజానంద సరస్వతి స్వామి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని సన్నిహితంగా గమనించారు. అందులోని నేతలతో సన్నిహిత బంధం ఉండేది. దయానంద ఆ ఉద్యమాన్ని సన్నిహితంగా చూశారనే చెబుతారు.

**పునరుజ్జీవనోద్యమం**

19వ శతాబ్దంలో భారతీయ సమాజాన్ని కదిలించిన

# విశ్వమార్యమ్!



దయానంద సరస్వతి

**అంటరానితనానికీ, బాల్య వివాహాలకీ వ్యతిరేకంగా గళమెత్తి, ఉద్యమించిన సంస్థ ఆర్య సమాజ్. మతాంతరీకరణలకు వ్యతిరేకంగా మొదటిసారి ఎలుగెత్తి చాటిన మహనీయుడు దయానందుడు. అంతేకాదు, మతం మారినవారిని సైతం 'శుద్ధి' ఉద్యమంతో తిరిగి అక్కున చేర్చుకుని, భారతదేశ మౌలిక స్వరూపం మారకుండా ఉండేందుకు తొలి అడుగు వేసినవారు కూడా ఆయనే. శ్యామ్‌జీ కృష్ణవర్మ, లాలా లాజ్‌పతిరాయ్, భాయి పరమానంద, స్వామి శ్రద్ధానంద వంటివారు ఆర్య సమాజ్ నుంచి స్వాతంత్ర్యం సమరంలోకి వచ్చారు. తిలక్, వినాయక్ దామోదర్ సావర్కర్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ వంటి ఎందరో స్వరాజ్య సమరయోధులు ఆర్య సమాజ్‌తో ప్రేరణ పొందినవారే. అంతటి స్థానం ఉన్న ఆర్య సమాజ్ స్థాపన జరిగి 150 సంవత్సరాలు అయింది. స్వతంత్ర భారతదేశం నిరంతరం స్మరించుకోవలసిన గొప్ప వ్యక్తి, సంస్థ దయానంద, ఆర్యసమాజ్. ఆ సంస్థ ఆశయాల సంకలనమే 'సత్యార్థ ప్రకాశ్'. వారి పిలుపు 'కృణ్వంతో విశ్వమార్యమ్' (విశ్వమంతా ఆర్యమయం కావాలి).**

పునరుజ్జీవనోద్యమం ప్రధానంగా హిందూ సమాజ సంస్కరణ ధ్యేయంతో ఉన్నట్టు కనిపిస్తుంది. కానీ వాటి ఉద్దేశం మతంలో విప్లవం మాత్రమే కాదు. నాడు భారతీయ సమాజాన్ని ఆవరించిన అంధకారాన్ని తొలగించడం ఒక్కటే కాదు, దేశాన్ని సామాజిక, రాజకీయ దాస్యం నుంచి విముక్తం చేయడం కూడా. ఇందులో సామాన్యుడి ఆత్మ గౌరవం కోసం పిలుపు ఉంది. అంటరానితనం నిర్మూలనకు బలమైన కార్యాచరణ ఉంది. దేశాభివృద్ధి, స్వయంసమృద్ధి తోనే సాధ్యమన్న దృష్టి ఉంది. 16వ శతాబ్దంలో ఐరోపాలో వచ్చిన పునరుజ్జీవనోద్యమం, భారత పునరుజ్జీవనోద్యమం ఒకటి కావు అనడం ఇందుకే. మన పునరుజ్జీవనోద్యమానికి నాయకత్వం వహించిన సంస్థలు, నాయకుల ఉద్దేశం మతాన్ని సంస్కరించడం మాత్రమే కాదు. అప్పటికి ఆవరించి ఉన్న అంధకారాన్ని, మూఢ విశ్వాసాలను రూపుమాపడం ఒక్కటే కాదు. జాతి తలెత్తుకు తిరగడం. ఇందులో ఆర్య సమాజ్ దృక్పథం మరింత స్పష్టమైనది. దేశ ప్రజానీకంలో వచ్చే చైతన్యం స్థానీయతతోనే తీసుకురావాలన్న ఆ సంస్థ ధోరణి చాలా పదునైనది. ఎవరు భారత ఔన్నత్యాన్ని అవమానపరుస్తున్నారో, ఎవరు అందిస్తున్న చదువు దేశీయతను పాతర వేస్తున్నదో, న్యూనపరుస్తున్నదో ఆ చదువు ఇచ్చిన స్ఫూర్తితో మాతృభూమిలో చైతన్యం తేవాలన్న యోచన ఒక బలహీనతగానే దయానందులు భావించినట్టు కనిపిస్తుంది. 'మరల వేదాల వైపు తరలండి' అన్న పిలుపే అందుకు గొప్ప నిదర్శనం. భారతీయులు భారతీయులమని చెప్పుకోవడానికి గర్వించాలని ఆకాంక్షించారాయన.

**ఆర్య సమాజ్, భారత జాతీయ కాంగ్రెస్**

డిసెంబర్, 1885లో ఆవిర్భవించిన భారత జాతీయ కాంగ్రెస్ తొలినాటి ఆశయం బ్రిటిష్ జాతి నుంచి దేశాన్ని సంపూర్ణంగా విముక్తం చేయడం కాదు. నినాదాలు, తీర్మానాలు కూడా నేరుగా బ్రిటిష్ పాలన మీద, భారత్‌పై దాని ప్రభావం మీద ఎక్కువపెట్టిన అస్త్రాలు కూడా కాదు. కానీ సరిగ్గా అంతకు పదేళ్ల క్రితం ఏప్రిల్ 10, 1875న ఉద్భవించిన ఆర్య సమాజ్ తొలి అడుగులోనే స్వయం పాలనకు పిలుపునిచ్చింది. చిత్రంగా ఈ రెండు సంస్థలు బొంబాయిలోనే ఆవిర్భవించాయి. కానీ ఆర్య సమాజ్ ఆది నుంచి స్వయం సమృద్ధి గురించి మాట్లాడింది. వ్యక్తి స్వేచ్ఛను, సామాజిక సమానత్వాన్ని ప్రబోధించింది. సామాజిక న్యాయం కోసం తపన, ప్రజాస్వామ్యం ఆ సంస్థ నిర్మాణంలో, ప్రస్థానంలో కనిపిస్తాయి. భారత స్వాతంత్ర్య సమరం కొన్ని దశల వరకు అయినా భారతీయత, మనదైన గతం పునాదిగా నడిచిందంటే అందుకు కారణం దయానందులే. ఆర్య సమాజ్ సిద్ధాంతాలు చాలా తొందరగానే భారతదేశమంతటా విస్తరించాయి. పంజాబ్, మద్రాస్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, హైదరాబాద్‌లలో సంస్థ బాగా విస్తరించింది.

**మొక్కవోని స్వాతంత్ర్య దీక్ష**

బ్రిటిష్ ప్రభుత్వంతో దయానంద నేరుగా తలపడలేదు. కానీ ఆయన అన్ని చర్యలు, మాటలు బ్రిటిష్ ప్రభుత్వం మీద తీవ్ర వ్యతిరేకతనే ప్రతిబింబించేవి. 1873లో గవర్నర్ జనరల్ నార్త్‌బ్రూక్‌తో దయానంద సమావేశం ఇందుకు నిదర్శనం. మీరు ఉపన్యాసం ప్రారంభించేటప్పుడు బ్రిటిష్ ప్రభుత్వానికి కూడా దేవుని ఆశీస్సులు ఉండాలని చెప్పాలి అంటే, అందుకు దయానంద అంగీకరించలేదు. దీనితో నివేదిక ఇంగ్లండ్‌కు వెళ్లింది. దయానంద మీద ఒక కన్నేసి ఉండాలని భారత కార్యదర్శి నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆర్య సమాజ్ ఏ కోణం నుంచి తన స్వాతంత్ర్య కాంక్షను విడనాడలేదు. ఆ సంస్థ ఆధ్వర్యంలో అనేక విద్యాసంస్థలు నడిచేవి. అవే దయానంద ఆంగ్లో వేదిక్ (డీఏవీ) విద్యాసంస్థలు. ఇవి ఏనాడూ బ్రిటిష్ ఇండియా ప్రభుత్వాన్ని దేహీ అనలేదు. అవి నిర్వహించే కార్యక్రమాలకు ప్రభుత్వ

అధికారులను ఆహ్వానించలేదు. నిజానికి ఆర్య సమాజం మీద బ్రిటిష్ ప్రభుత్వ ఆగ్రహానికి ఈ విధానం ఒక ప్రధాన కారణం. భారతదేశంలో అశాంతికి కారణాలు వెతకమంటూ బ్రిటిష్ ప్రభుత్వం పంపించిన రామ్‌సే మెక్డొనాల్డ్ చేసినవ్యాఖ్య ఇది: 'ప్రతి ఆర్య (దయానంద అనుచరుడు) ఒక అరాచకవాది. అందులోని ప్రతి ప్రభుత్వ విమర్శకుడు ఒక దేశద్రోహి.'

**స్వాతంత్ర్యోద్యమంతో అవినాభావ బంధం**

భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ఆర్య సమాజ్ సభ్యులు మూడు రకాలుగా కనిపిస్తారు. మొదటి తరహాకు ఉదాహరణ: శ్యామ్‌జీ కృష్ణవర్మ, లాలా లాజ్‌పతి రాయ్. వీరు 20వ శతాబ్దం ఆరంభంలోనే స్వరాజ్య సమరంలో కీలక పాత్ర పోషించారు. భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో జరుగుతున్న ఉద్యమంలో చేరకుండా హిందూ మహాసభలో పనిచేసినవారు. ఇందుకు ఒక ఉదాహరణ భాయి పరమానంద. నిజానికి పరమానంద మొదట గదర్ పార్టీ నాయకుడు. తరువాత హిందూ మహాసభలో చేరారు. బ్రిటిష్ జాతిని ఎదుర్కొనడానికి గాంధీజీ ప్రతిపాదించిన అహింసా సిద్ధాంతం సరికాదన్నదే పరమానంద నిశ్చితాభిప్రాయం. అందుకే వ్యతిరేకించారు. జాతీయోద్యమంలో ఉంటూనే ఏనాడూ కాంగ్రెస్ పార్టీలో చేరకుండా, విద్యారంగ నిర్మాణానికి పని చేసిన వారూ ఉన్నారు. పంజాబ్‌కు చెందిన హన్సరాజ్ అందుకు ఉదాహరణ. ఈయన కూడా గాంధీజీని సిద్ధాంతపరంగా వ్యతిరేకించారు. గాంధీజీ లాహోర్ పర్యటనకు వచ్చినప్పుడు హన్సరాజ్ నాయకత్వంలో విద్యార్థులు సమ్మె చేశారు.

**స్వదేశీ ఉద్యమం**

విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ ఉత్పత్తులు, స్వయం సమృద్ధి ఆది నుంచి ఆర్య సమాజ్ నినాదాలు. జాతీయవాదం వీటికి పునాదిగా చేసిన సంస్థ కూడా అదే. స్వదేశీ చింతన, ఆపై స్వదేశీ ఉద్యమం ప్రారంభం కావడానికి మూలం వలసపాలన ఆర్థిక దోపిడీ. దేశీయ పరిశ్రమలను క్రమంగా చంపుకుంటూ పోయే దాని బ్రిటిష్ ఆర్థిక సామ్రాజ్యవాదం. ఈ ఆర్థిక సామ్రాజ్యవాదాన్ని ఆధ్యాత్మికత అనే ఆయుధంతో తొలి దాడి చేసిన సంస్థ ఆర్య సమాజ్. ఆర్య సమాజ్ నినాదం ఒక చోదకశక్తిగా ఉపయోగపడే సందర్భం బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమం (1905) సమయంలో వచ్చింది. పైగా దీనికి నాయకత్వం వహించిన లాల్ బాల్ పాల్ త్రయంలోని లాలా లాజ్‌పతిరాయ్, బాలగంగాధర తిలక్ దయానందస్వామి భక్తులు. బ్రిటిష్ ఉత్పత్తులు, దిగుమతుల మీద ఆధారపడడం తగ్గాలన్నదే ఆర్య సమాజ్ ఉద్దేశం. అందుకు దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించాలి. జౌళి పరిశ్రమ, సబ్బుల తయారీ, చరఖాల వినియోగం వంటివాటిని ఆర్య సమాజ్ వృద్ధి చేసింది. దీనితో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. బ్రిటిష్ ప్రభుత్వ అజమాయిషీలోని విద్యా సంస్థలను బహిష్కరించి, స్వదేశీ విద్యా సంస్థలను స్థాపించారు. స్వదేశీ విద్యా సంస్థలలో వృత్తి విద్యలను ప్రవేశపెట్టారు. దేశానికి గ్రామం, అక్కడ జరిగే సేద్యం ప్రాధాన్యాలను కూడా ఆర్య సమాజ్ గుర్తించింది. వ్యవసాయోత్పత్తుల పెంపు కోసం తన వంతు కృషి చేసింది. సేంద్రియ ఎరువులను ప్రోత్సహించింది. దేశీయమైన విత్తనాల గురించి ప్రచారం చేసింది. స్వదేశీ ఉద్యమం, దానిని నడిపిన జాతీయవాదం ఆర్య సమాజ్ కార్యక్రమాలు. వాటితో స్వతంత్ర భారతదేశానికి జరిగిన మేలు కూడా ఎంతో ఉంది.

హైదరాబాద్ సంస్థానంలో జరిగిన నిజాం వ్యతిరేక పోరుకు తొలి అడుగు వేసినది ఆర్య సమాజమే.

***ఆ నో భద్రాః క్రతవో యన్తు విశ్వతో దబ్ధాసో అపరీతాస ఉద్భిదః।***
***దేవా నో యథా సదమిద్వృధే అసన్నప్రాయువో రక్షితారో దివేదివే॥***

(అన్ని దిక్కుల నుంచి ఉన్నత భావాలు నాలో ప్రవేశించుగాక: **ఋగ్వేదం**)

**– జాగృతి డెస్క్**



# కొలువుల వలలో

వర్ధమాన దేశాల యువశక్తి అత్యంత ప్రభావవంతమైనది. అపురూప శక్తి సామర్థ్యాలతో కూడిన యువత తమ దేశానికి ఉజ్వల భవిష్యత్తు మాత్రమే కాదు, శక్తిమంతమైన వర్తమానం కూడా. అయితే, యువతలో నిక్షిప్తమై ఉన్న ప్రబలమైన ఈ శక్తిని ఏ దేశంలోనూ సరిగా వినియోగించుకోవడం లేదు. అపారమైన ఈ సామర్థ్యాన్ని "చదువుకోండి–మార్కులు తెచ్చుకోండి–ఉద్యోగం సంపాదించండి" అనే ఇరుకు సందులోకి మళ్లిస్తున్నారు. ఈ మార్గం కుటుంబ స్థిరత్వానికి తోడ్పడుతున్నప్పటికీ, యువతలోని అపారమైన సామర్థ్యాలను ఉద్యోగాలకే పరిమితం చేస్తున్నది.

మన లక్ష్యాల విషయమై పునరాలోచించవలసిన సమయం ఆసన్నమయింది. యువత తమ అంతిమ లక్ష్యాన్ని ఉద్యోగానికే పరిమితం చేయకుండా, ఉపాధి అవకాశాలను సృష్టించడంపై సారించాలి. నాయకత్వ లక్షణాలతో కూడిన ఒక ఆవిష్కర్తగా, యజమానిగా మారే దిశగా అడుగులు వేయాలి. డిజిటల్, పారిశ్రామిక రంగాలలో ఔత్సాహికులకు అపరిమిత అవకాశాలు ఉన్న ప్రస్తుత పరిస్థితులలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొనే విధంగా యువతకు దిశాదర్శనం చేయాలి.

**ఉపాధి: ఆరంభమే, అంతిమ లక్ష్యం కాదు**

ఉద్యోగం చేయడమనేది వైఫల్యం ఎంతమాత్రమూ కాదు. దీనివల్ల అనుభవం, క్రమశిక్షణ, నైపుణ్యాల వంటి అమూల్యమైన అర్హతలు సొంతమవుతాయి. గట్టి పునాది కూడా ఏర్పడుతుంది. అయితే, వ్యక్తిగత లక్ష్యాలను ఇక్కడికే పరిమితం చేసుకోకూడదు. ఉద్యోగం స్థిరత్వాన్నిస్తుంది, కానీ వ్యవస్థాపకత అంతకన్నా ఉన్నతమైన అవకాశాలను సృష్టిస్తుంది. ఒక సంస్థను స్థాపించి కొద్ది మందికి ఉద్యోగాలు ఇవ్వడం వ్యక్తిగత విజయాన్ని సూచించడంతో పాటు ఆర్థిక స్వాతంత్ర్యానికి, సమాజ ప్రగతికి, దేశాభివృద్ధికి బాటలు వేస్తుంది.

పల్లెల్లో, పట్టణాల్లో, నగరాల్లో యువత కేవలం కంపెనీలలో పనిచేయడం తోనే ఆగిపోకుండా తమనుతాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడంపై దృష్టి పెట్టాలి. అలాంటి ప్రతి ప్రయత్నం వల్ల వందలాది ఉద్యోగాలు, స్థానిక సమస్యలకు అనుగుణమైన ఆవిష్కరణలు వెల్లువెత్తి అన్ని ప్రాంతాలలో సాధికారత సాక్షాత్కరిస్తుంది.

**మూస మనస్తత్వం వీడాలి**

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు సాధారణంగా నెలజీతంతో కూడిన ఉద్యోగం వైపు యువతను నడిపిస్తారు. దీని వెనక సదుద్దేశమే ఉన్నప్పటికీ, సొంత వ్యాపారాలపై భయం కారణంగానే వాళ్లు అలాంటి సలహాలు ఇస్తారు. అది ఉత్తమ భవిష్యత్తు వైపు నడిపించే ప్రయత్నం ఎంతమాత్రమూ కాదు. ఆర్థిక అభద్రత తాండవమాడే వర్ధమాన దేశాలలో పారిశ్రామికత ఓ జూదంలాగే కనిపించవచ్చు. కానీ కాలం మారుతోంది. ఇంటర్నెట్, డిజిటల్ నైపుణ్యాలు, ప్రపంచ వాణిజ్య వ్యవస్థలు అందుబాటులోకి రావడం వల్ల ఏదైనా కొత్తగా ప్రారంభించాలనుకుంటే ఇదివరకటి కంటే తక్కువ పెట్టుబడితోనే సాధ్యం చేయవచ్చు. మనకు కావలసిందల్లా ఆలోచనా విధానంలో మార్పు. సమాజం అగ్రశ్రేణి ఉద్యోగులను ఎలాగైతే గౌరవిస్తుందో వ్యాపార యజమానులు, సామాజిక వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలు, ఉద్యోగాల సృష్టికర్తలను కూడా గౌరవించాలి. ధైర్యం చేసి రంగంలోకి దిగడం, ఓటమిని వృద్ధిలో భాగంగా పరిగణించడం,

# "వర్ధమాన" యువత



భవిష్యత్తు గురించి సృజనాత్మకంగా ఆలోచించడం వంటి లక్షణాలను యువతకు ఒంటబట్టించాలి.

**బడి నుంచే బాటలు వేయాలి**

మన విద్యావ్యవస్థ మారాలి. పాఠశాలలు, కళాశాలలు ప్రస్తుత పాఠ్యపుస్తకాలు, పరీక్షల మూస నుంచి బయటపడాలి. జీవన నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచన, ఆర్థిక అక్షరాస్యత, పారిశ్రామికత వంటి అంశాలను బోధించాలి. వ్యాపార ప్రతిపాదనలు తయారుచేసుకోవడం, వాస్తవ సమస్యలకు పరిష్కారం కనుగొనడం, వివిధ ప్రాజెక్టుల ద్వారా సంబంధిత సమూహాలతో కలిసి పనిచేయడం వంటి వాటిలో విద్యార్థులను ప్రోత్సహించాలి.

ఆలోచనలు వాస్తవరూపం దాల్చాలంటే సరైన మార్గదర్శనం, కొత్త ఆలోచనలకు సహకారం అందించే సంస్థలు, ఆర్థిక వనరుల లభ్యత వంటివి ప్రధానపాత్ర పోషిస్తాయి. యువత తమ కలలను సాకారం చేసుకోవాలంటే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఉమ్మడి సహకారం అందించాలి.

**విజయగాథల ప్రేరణ**

యువతకు విజయగాథలు స్ఫూర్తినిస్తాయి. తమలాంటి సామాజిక స్థితి నుంచి వచ్చి అవాంతరాలను అధిగమించి విజయం సాధించిన వారి అనుభవాలు కచ్చితంగా ప్రభావం చూపుతాయి. వారిని చూసినప్పుడు తమ సొంత సామర్థ్యంపై నమ్మకం కలుగుతుంది. కొత్తగా వైవిధ్యమైన రంగాలలో ప్రవేశించి సత్తా చాటుకున్న పారిశ్రామికులు, చిన్న వ్యాపారాల యజమానులు, వైవిధ్యంతో కూడిన ఆలోచనలతో విజయం సాధించినవారి వివరాలను పొందుపరచి యువతకు అందుబాటులో ఉంచాలి. ఈ విజయగాథలను పాఠ్యాంశాలలో, వార్తాప్రసార సాధనాలలో, సామూహిక చర్చలలో భాగం చేయాలి.

ఎంతసేపూ డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రభుత్వాధికారులను కీర్తించడం కాకుండా ఒక ఊళ్లో ఫ్యాషన్ దుస్తుల వ్యాపారాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న మహిళను, రైతులు తమ ఉత్పాదనలను అమ్ముకోవడానికి ఉపయోగపడే మొబైల్ యాప్ తయారుచేసిన వ్యక్తిని కూడా కీర్తించాలి. ఎందుకంటే వీళ్లు ప్రగతికి కొత్త సారథులు.

**ఉపాధి అన్వేషణ నుంచి ఉద్యోగాల కల్పన వైపు**

ఉపాధి వెతుకులాటకు స్వస్తి చెప్పి ఉద్యోగాలు కల్పించే వైపు మళ్లడం అంత సులభమేమీ కాదు, ఇది ముందుచూపుతో సాధ్యమవుతుంది. ప్రస్తుత పరిస్థితులను దాటి ఆలోచించడం, ఉన్నతమైన స్వప్నాన్ని చూసే సాహసం చేయడంతోనే సగం విజయం సొంతమవుతుంది. ఈ విజయ స్వప్నాన్ని సాకారం చేసుకోవాలంటే ధైర్యం, పట్టుదల, తగిన సహకారం అవసరమవుతాయి. ఒక్కసారి ముందడుగు వేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి.

వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సాంకేతిక రంగం వంటి వాటిలో స్థానికంగా ఎదురయ్యే సమస్యలను యువత సారథ్యంలోని సంస్థలు సులభంగా పరిష్క రించగలుగుతాయి. ఈ సంస్థలు కేవలం ఉద్యోగాల కల్పనకే పరిమితం కాకుండా వినూత్నమైన ఆవిష్కరణల ద్వారా సొంతకాళ్లపై నిలబడే బృందాలను తయారుచేయగలుగుతాయి. తద్వారా ఆర్థిక వ్యవస్థ బలపడి విదేశీ సహాయంపైన, పరిమిత ఉద్యోగాలపైన ఆధారపడే అవసరాన్ని తగ్గిస్తాయి.

**కార్యాచరణకు సిద్ధం కండి**


వర్ధమాన దేశాల యువత కార్యాచరణకు సిద్ధం కావాలి. తాము ఆశించింది అందగానే ఆగిపోకూడదు. అంతకన్నా ఉన్నత శిఖరాలను అధిరోహించే దిశగా ముందుకు సాగాలి. చదువులను మెట్లుగా ఉపయోగించాలి, గమ్యం చేరుకున్నాం కదా అని ఆగిపోకూడదు. మార్గదర్శకులను కలుస్తుండాలి, నిరంతర అధ్యయనం సాగించాలి. వైఫల్యాలకు భయపడకూడదు, తట్టుకొని నిలబడాలి. ప్రస్తుతం విజయవంతంగా నడుస్తున్న పెద్దపెద్ద పరిశ్రమలన్నీ చిన్నచిన్న ఆలోచనలతోనే రూపుదిద్దుకున్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

తల్లిదండ్రులు, మార్గదర్శకులు ఎప్పుడూ సృజనాత్మకతను, ఔత్సాహికతను, ధైర్యాన్ని ప్రోత్సహించాలి. చిన్నప్పటి నుంచీ పిల్లలను మంచి మార్కుల కోసం ప్రోత్సహించడమే కాకుండా ఉన్నతమైన కలలు కనే విధంగా తీర్చిదిద్దాలి. యాజమాన్యం, ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాల విలువను బాల్యం నుంచే నేర్పించాలి.


యువత సొంతంగా పరిశ్రమలను స్థాపించేందుకు ప్రోత్సహించే వాతావరణాన్ని కల్పించి, అందుకు తగిన వ్యవస్థలను ఏర్పరిచే బాధ్యత విధాన రూపకర్తలు, నాయకులపై ఉంటుంది. విద్యావ్యవస్థలో సంస్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధులు సమకూర్చే వ్యవస్థలను సులువుగా సంప్రదించే వాతావరణం నెలకొల్పాలి. వ్యాపారం ప్రారంభించి, నిలదొక్కుకునే దశలో అవాంతరాలు కలగకుండా చూడాలి.

**ముగింపు**

వర్ధమాన దేశాల భవిష్యత్తు అక్కడి యువత చేతుల్లోనే ఉంటుంది. ఉపాధి పొందడానికి కాకుండా ఉద్యోగాల కల్పనకు వారిని ప్రోత్సహించాలి. ఉద్యోగం సంపాదించడమనేది పరమావధి కాదని, అంతకన్నా చాలా ఎక్కువ సాధించవచ్చని ఆలోచించే స్వభావాన్ని పెంపొందించాలి. ఉన్నత లక్ష్యాలతో కలలు కనే తరానికి, కార్యసాధకులకు, మార్పును సాధించేవారికి ప్రోత్సాహం అందించాలి. ఎందుకంటే, యువత నడుం బిగిస్తేనే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుంది. ★



**పి. వేణుగోపాల్‌రెడ్డి**
పూర్వ సంపాదకులు






# తొలి తెలుగు వచన వాగ్గేయ

సింహాద్రి అప్పన్న తెలుగువారి దేవుడు. తూర్పు కనుమలలో భాగంగా విశాఖపట్నానికి దగ్గరగా ఉన్న పర్వతమే సింహాచలం. ఆ కొండ మీద వెలసిన దైవమే వరహాలక్ష్మీ నరసింహస్వామి. ఈ ఆలయంలోని మూల విరాట్టును సాక్షాత్తూ ఆ ప్రహ్లాదుడే ప్రతిష్టించాడని చెబుతారు. రాక్షస సోదరులైన హిరణ్యాక్షుడు హిరణ్య కశిపులని చంపిన వరహా, నరసింహ అవతారాల కలయికగా ఇక్కడి విగ్రహం కనిపిస్తుంది. వరాహ మొఖంతో, మనిషి శరీరంతో సింహం తోకతో వరాహ నరసింహస్వామి ఉంటారు. ఉగ్రమూర్తి అయిన స్వామివారి రూపాన్ని భక్తులు తట్టుకోలేరు. కాబట్టి నిత్యం వారు చందనంతో కప్పివేయబడతారు. సంపెంగ పూలతోనూ, పనస చెట్లతోనూ నిండిన సింహాచలం కొండ మీద అడుగు పెట్టగానే దివ్యమైన అనుభూతి, కలుగుతుందని భక్తుల భావన. స్వామివారి అనుగ్రహ మహిమో, వారి మీద ఉండే చందనం మహిమోకానీ గర్భగుడిలోకి ప్రవేశించగానే మండు వేసవిలో సైతం ఒళ్లు చల్లబడి పోతుందని చెబుతారు.

సింహాచలం స్వామి అంటే తెలుగువారికి, అందున ఉత్తరాంధ్ర వారికి చాలా నమ్మకం. ఆయనను తలచుకుంటే చాలు తమ ఆపదలు తీరిపోతాయని విశ్వాసం. అలా ఆపదలను తీర్చే స్వామి కాబట్టే ఆయనను అప్ప (తండ్రి) అన్న అని పిలుస్తారు. ఆ చల్లని స్వామి మనలను తండ్రిలా కాచుకుంటాడు. ఎందరో వాగ్గేయకారులు ఆ స్వామిని కీర్తించారు. వారితో కృష్ణమాచార్యులు ప్రథములు. ప్రపంచ భాషలన్నింటిలోను పదకవిత, పద్య కవిత అని రెండు విధాలు పాడుకోవడానికి ఉపయోగించేది పదం, పద్యం పండితులకు మాత్రమే పరిమితమైంది. మనదేశంలో సాహిత్యం “మార్గ” “దేశి” అని ద్వివిధం. ప్రజలచేత వాడబడి, పాడబడి, పాడబడుతూ పరివ్యాప్తమైంది దేశి. లక్షణబద్ధమై పండితైక పరమైంది మార్గ. తెలుగులో పదమే ప్రప్రథమంగా పుట్టింది.

తెలుగులో ఎందరో వాగ్గేయకారులున్నారు. వారిలో అన్నమయ్య, పెద తిరుమాలాచార్యులుచిన తిరుమలాచార్యులు, క్షేత్రయ్య, రామదాసు, సారంగపాణి, మునిపల్లె సుబ్రమణ్యకవి, త్యాగరాజు సింహాచలంలో శ్రీకాంత కృష్ణమాచార్యులు.

శ్రీకాంత కృష్ణమాచార్యులు దేశి అయిన అచ్చ తెలుగులో వచనాలు రచించి కృష్ణ భక్తి మార్గోపదేశ కుడు ఆయన రచనలు పేరుకు వచనాలే అయినా పాడుకోవడానికి భక్తి ప్రపత్తిని తెలుసుకోవడానికి ఉపకరించేవే.

కృష్ణమాచార్యులు అన్నమాచార్యుల కంటే పూర్వుడు. రామానుజ మతమైన విశిష్టాద్వైత మతాన్ని స్వీకరించి, ప్రచారం చేసిన మహనీయుడు. పాడుకోవడానికి వీలైన వచనాలు భగవద్భక్తి పరంగా రచించి ఈ పద్ధతికి మార్గదర్శకుడైనవాడు. “తెలుగు మాటల నంగవలదు, వేదముల కొలదిగా చూడు” డని ద్విపదల్లో జాను దెనుగులో రచన చేసినవాడు పాల్కురి సోమనాధుడు, అలాంటి మాటలేమీ చెప్పకుండానే అచ్చ తెలుగులో భగవన్నామ సంకీర్తన పరంగా వచనాలు రచించినవాడు కృష్ణమాచార్యుడు, ఇలాంటి వచనాలు బసవేశ్వరాదులు కన్నడంలో శైవమత పరంగా రచించారు. కృష్ణమాచార్యుల తరువాత సంకీర్తనంతోపాటు వచనాలు రచించిన భక్తుడు పెద్ద తిరుమలాచార్యుడు.

సింహగిరి నరహరిపై మాలికాగేయాలు రచించిన కృష్ణమాచార్యుడు లీలాశుకునికి (బిల్వా మంగళుడు) సమకాలికుడు. (ఇతడు శ్రీ కృష్ణకర్ణా మృతం అనే గ్రంథాన్ని వ్రాశాడు). ఆ కాలంలో ఆంధ్రదేశాన్ని పరిపాలించిన కాకతీయ రాజులు శైవమతాభి మానులు, దేశం అంతటా శైవమతం ప్రచారంలో ఉండే కాలంలో లీలాశుకుడు ఆరంభంలో పంచాక్షరీ మంత్రోపాసకుడు కావడం సమంజసమే. కృష్ణమాచార్యులకు నెలవైన సింహగిరి లాగానే కాకతీయ రాజధాని పరిధి వైష్ణవ క్షేత్రమైన వేదాద్రికి చుట్టుప్రక్కల ఇతడు సగం జీవితం గడిపి ఉండవచ్చునని రజనీకాంతారావు గారి అభిప్రాయం.

కాకతీయ రాజులలో రెండవ ప్రతాపరుద్రుని (క్రీ॥శ॥ 1254–1323) సమకాలికుడు కృష్ణమాచార్యులు. శ్రీ నిడదవోలు వెంకట్రావు, శ్రీ కృష్ణమాచార్యులు జనన కాలము 1290గా నిర్ధారించారు. కాని డా॥ వేటూరి ఆనందమూర్తి వచనముల ఆధారంగా ఆయన 1268లో జన్మించి వుండవచ్చునని అభిప్రాయం వెలిబుచ్చాడు. డా॥ ఎమ్. కులశేఖరరావు శ్రీ కృష్ణమాచార్యులు

శ్రీ కృష్ణమాచార్యులు వచనాల రకాలు – కొన్ని ఉదాహరణలు.

“దేవా శ్రీ రామానుజ సిద్ధాంతమును బోలు మరి సిద్ధాంతము లేదు
పరమాచార్యులం బోలు మరి యాచార్యులు లేరు.
పరమ భాగవతుల బోలు మరి భాగవతులు లేరు
వారి కైంకర్య పరులంబోలు మరి కైంకర్యపరులు లేరు
అస్మద్గురుభ్యో నమ: అను మంత్రమునకు సరి మంత్రము లేదు
పరమ రహస్యంబును బోలు మరి రహస్యంబులేదు
పరమనాంచారి బోలు మరి జనని లేదు
అనాధపతి స్వామి నరహరి బోలు మరి దైవంబులేదు
స్వామి సింహగిరి నరహరీ / నమో నమో దయానిధీ

వైరాగ్య విషయాలను ప్రతిపాదిస్తూ కృష్ణమాచారి వ్రాసిన వచనం చూడండి.

దేవా! తనువు మాయ తలపోసి తలపోసి చెప్పెదనంటినే / కఱకఱల మోహామిది /
ఆశల పాషాణంబిది అతుకుల జల్లెడ యిది/తన బ్రతుకు కొరకు పోరాడి పోరాడి/
యొరులం జెఱ చెడు దుర్గంధపు డొంకాయిది
నీరు బుగ్గ, ఊట చెలమ, తూంట్ల బాన / తొడరి దుర్గంధమున బొలచును
మాటలే కాని మణి యెందును బసలేదు / నోటను మురికి, దంతంబుల పాచి,
చెవులోని గుల్మి, చెట్టల కొంప, / మూటగట్టు కొన్న మలమూత్రముల బొమ్మ
అమ్మమ్మ యీ బొమ్మ / ఉత్తమ గుణములెంచి చూచెదనం ఇలా సాగుతుందీ ఈ
వచనములు కవిత.



# కారుడు - కృష్ణమాచార్యులు

1265–70 ప్రాంతంలో తన స్వగ్రామమైన సంతూరు లేక సంతపురంలో జన్మించినట్లు అది తెలంగాణాలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఉందని అభిప్రాయపడ్డారు.

కృష్ణమాచార్యులు పుట్టు గుడ్డి అని తల్లిదండ్రులు ఆ బాలుని ఓ నీళ్లు లేనిబావిలో పడవేశారని, బాలుని ఏడుపు విని కువార స్వామి (కుమారస్వామి) అనే సన్యాసి రక్షించి అతడ్ని సింహాచలం చేర్చాడనీ, (కువార స్వామి స్వయాన సింహాద్రి అప్పన్నేయని) అక్కడ "స్వామి క్షీరము తెచ్చి ఉపయోగించమనిన... అంధత్వము మాసె" (పేజీ.48) చూపు వచ్చిందనీ, తరువాత ఆ బాలుని మేనమామ శ్రీ రంగాచార్యులు పెంచి పెద్ద చేసి యుక్త వయస్సు రాగా తన కూతుర్ని ఇచ్చి పెండ్లి చేశాడనీ, సంసారిక జీవితం గడుపుచూ, పుత్ర సంతానం పొంది, పుత్ర వియోగంతో బాధపడి, సంకీర్తన వాక్పూజలు చేస్తూనే ఆ వెనుక వేశ్యాలోలుడై వుండగా అతని దర్శనార్ధం పోతకమూరు ఆరుగురు సోదర భాగవతులు వచ్చారు. వారి దర్శనంతో కృష్ణమాచార్యునికి కనువిప్పు కలిగింది. ఇలా ఎన్నో కథలు ఉన్నాయి.

"ఏది యేమైనా భక్తి సంకీర్తనలను పాడుకొంటూ మహిమలెన్నో ప్రదర్శిస్తూండేవాడు. ఈ మహా నీయుడు పుట్టింది సంతపురంలోనే అయినా బహుకాలం సింహాచలంలోనూ, నడుమకాలంలో వోరుగల్లు లోనూ, చివరకు శ్రీరంగంలోను జీవిత యాత్ర సాగించినట్లు తెలుస్తుంది. ఆంధ్రదేశంలోని ప్రసిద్ద పుణ్యక్షేత్రాలన్నిటిని దర్శించినట్లు కూడా తన పదాలలో ఆయనే పేర్కొన్నాడు".

"ఆంధ్రదేశమున వచన రచనకు, భజన సంకీర్తనా పద్ధతులకు ప్రపితామహుడు అయినవాడు మనమెరిగినంతలో నీ కృష్ణమాచార్యుడే. "ఓం నమో నారాయణాయ" అనియు "నమోనమో లక్ష్మీ వల్లభా" అనియు, అనాధపతి సింహగిరి నరహరి నమో నమో దయానిధీ, అనియు, మా యతిరామానుజ ముని పరంధాతారు కృష్ణ కువ్వారు స్వామి నరహరి నమో నమో దయానిధీ, అనియు "పరబ్రహ్మ సింహగిరి నరహరి నమో నమో దయానిధీ" మకుటుములుగా స్వామి వారి అనంతనామ గుణ కదలకు వచన బాపంబున నీతడు విన్నపము చేయుచుండెడువాడు. ఈ విధముగా కృష్ణమాచార్యుడు పాడుకొన్న వచన సంకీర్తనములలో విన్నపములుగాను, చూర్ణికలుగాను గుర్తింప బడినవి కొన్ని మాత్రమే మనకు లభించినవి.

పదునైదు పదునారు శతాబ్దాలలో వెలసిన తాళ్లపాక కవీశ్వరులు "కృష్ణమాచార్యునే తమకు మార్గదర్శకుడుగాను, తాళ బంధచ్ఛందో విరహితమై చూర్ణాఖ్యం జరగునట్టి వదరచనలకు పరికల్పకుడుగను" పేర్కొన్నారు. కృష్ణమాచార్యుల వాఙ్మయ పరిమితిని గురించి ప్రస్తుతం చెప్పదగ్గ సాక్ష్యం ఏమీ లేదు. అయినా చతుర్లక్ష గ్రంథ సంకీర్తనల కృష్ణమాచార్యులు రచించిన కృతులలో లభ్యమైన వచన సంకీర్తనలు ముఖ్యంగా తులసీ మహత్యము, నరసింహా నామములు, రామనామ కీర్తనము, రామనామాలు, వాటిని వైష్ణవ మత సిద్ధాంత ప్రతిపాదకాలు, పురాణ సంబంధమైనవి, వేదాంత పరమైనవి, నీతి బోధకమైనవి అని నాలుగు విధాలుగా విభజించారు. మచ్చుకు భక్తి ప్రబోధాత్మ కంగా, వర్ణవ్యవస్థా రహితంగా చెప్పిన వచనం.

"దేవా విష్ణు భక్తిలేని విద్వాంసునికంటే హరికీర్తన చేయునతడే కులజుండు, శ్వపచుండైన నేమి? ఏ వర్ణంబైన నేమి? ద్విజునికంటె అతడే కులజుండు, సంధ్యా (వందనాది) నిత్యకర్మానుష్టానంబులు తప్పక నడిపిననేమి? సకల ధర్మంబులు సేసిననేమి? మా సింహగిరి నరహరిదాసులకు దాసులైనంగాని లేదు గతి? స్వామీ ! సింహగిరి నరహరీ నమో నమో దయానిధీ.


"తెలుగు భాషలో వచనైక రచన చేయుటలో ప్రథముడైన కృష్ణమాచార్యుల ప్రభావము అతని తరువాత ఆంధ్ర రచయితలపై స్పష్టముగా కన్పిస్తున్నది. రచనా పదతియందును, భావము నందును, సాంప్రదాయమునందును ఈ ప్రభావము ఇతర రచయితలపై నున్నది. స్తుతి వచనములు వ్రాయుట యిందితడే యగ్రగామి యగుట వలన ఈ సాంప్రదాయమును పాటించి రచనలు చేసిన శ్రీ వేంకటేశ్వర వచనములు, శఠకోప విన్నపములు, కాళికాదీశ్వర వచనములు మొదలగు రచయిత లందరూనూ నీతని యనుయాయిలే. ఇలా వచనాలు రచించి సంకీర్తనా పద్దతికి, వైష్ణవభక్తి ప్రపత్తికి ప్రచారం తెచ్చిన ఘనత కృష్ణమాచార్యులకే దక్కుతుంది. డా॥కులశేఖరరావు పేర్కొన్నారు.

ప్రతాప చరిత్ర ప్రకారం "కృష్ణమాచార్యులు చాతుర్లక్ష గ్రంథం రాగిరేకుల మీద చెక్కించి వాటిని బళ్ల కెత్తించి శ్రీరంగం తీసుకుపోయారు". కృష్ణమా చార్యులు పదకర్తగా, సంకీర్తనాచార్యులుగా మహిమాన్వితులైన భక్త శిఖామణిగా పేరు పడి సింహాచలంలో స్వామి సేవా తత్పరులుగా వున్నారు.

సింహగిరి వచనాలు గేయాలుగా ప్రసిద్ధి కెక్కాయి, అంటే అవి తొలి తెలుగు వచనగేయాలన్న మాట (పేజీ. 20)


"ఒకానొక సందర్భంలో కృష్ణమాచార్యులవారు స్వామి సన్నిధిలో గానం చేస్తుండగా స్వామి బాలరూపంలో వచ్చి ఆయన తొడమీద కూర్చొని గంటంతో తాటాకుల మీద వ్రాయసాగారట. (పేజీ. 30) వీరు మొదట తాటాకులపైన రాసినా తరువాత వాటిని తామ్ర పత్రికలపై వ్రాసి శ్రీరంగం తరలించినట్లు తెలుస్తున్నది.

తిరుపతి వెంకన్నకు అన్నమాచార్యులు భద్రాద్రి రామన్నకు కంచర్ల గోపన్న, సింహాద్రి అప్పన్నకు కృష్ణమాచార్యులు ప్రధాన వాగ్గేయకారులు దురదృష్టవశాత్తూ కృష్ణమాచార్యులు ప్రజా బాహుళ్యానికి అంతగా తెలియదు. తన్మయత్వంలో కృష్ణమా చార్యులు పాడుతూ వుంటే సింహాద్రి అప్పన్న నాట్యం చేసేవాడట. ఈ మాట స్వయాన కృష్ణమాచార్యులే చెప్పారు.




**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

# అనల్ప రచనల శిల్పి



నెమ్మదిగా నవ్వింది మైనం గోరువంకలా!జయప్రద ముఖం తడిసిన కాగితం పువ్వుల్లే అయింది. సంధ్యాకాంతి– నిశాదేవికి చంద్రుని సరళతను బోధిస్తోంది. – ఈ తరహా వర్ణనల రచయిత్రి ఇరంగంటి వెంకట శేష అచ్యుతవల్లి. ఎవరీమె అనుకొంటున్నారా? ఐవీఎస్ అచ్యుతవల్లి. భావుకతకు మారుపేరు. నాడు అందరికీ సుపరిచిత సాహితీవేత్త. అంతే స్థాయిలో లలిత గీతాల గాయని. ఇప్పుడు ఆమె ఉండి ఉంటే, ఇంకా ఎన్నెన్నో కథా రచనలు వెలువడి ఉండేవి. స్త్రీల మనస్తత్వ ఆవిష్కరణ మరింత విస్తృతంగా జరిగి ఉండేది. తొలి కథ 'వంచిత'. ప్రచురిత పత్రిక 'జగతి'. ఇప్పటి మాట కాదిది. అరవై ఆరేళ్ల నాటిది. కాలక్రమంలో... తెలుగు విశ్వవిద్యాలయం నుంచి రెండుసార్లు విశిష్ట పురస్కృతిని అందుకున్న ఘనత తనదే! తన పుట్టిన రోజు మే ఒకటిన.

అచ్యుతవల్లి ఎంత సంప్రదాయవాదో అంత ఆధునికురాలు. ఆమె రచనల సంభాషణలే ఇందుకు ఉదాహరణలు. 'తెల్లగా పొడుగ్గా ఉన్న మెడలో ఒంటి వరస ముత్యాల హారం! ఒక చేతికి మూడేసి వరసల తెల్లరాళ్లు పొదిగిన బ్రేసలెట్, రెండో చేతికి ఆరు బంగారు డైమండ్ కటింగ్ గాజులు, లేత ఆకుపచ్చ సాటిన్ సాల్వార్.'

'ఆమె గ్రేస్‌ఫుల్ వాకింగ్‌కి అబ్బురపడ్డాడు యువకుడు!' 'థాంక్సండీ... మీరు నా కస్టోడియన్ అయినందుకూ!' ఇలా.

వందల సంఖ్యలో కథలు రాసిన ఆమె స్వస్థలం గోదావరి ప్రాంతంలోని దొంతవరం. సంస్కృతం, హిందీల్లోను ఉన్నత చదువులు చదివారు. భర్త ఉద్యోగ కారణంగా కొంతకాలం కర్ణాటక ప్రాంతాల్లో ఉన్నారు. ఈ తరం అమ్మాయి, ఉద్యోగస్తుడి భార్య, అమ్మంటే అమ్మ, తల్లి మనసు, సులక్షణ – ఇవన్నీ ఆమె కథల్లో కొన్ని. వెయిట్ ఫర్ ది టైం, బెటర్ హాఫ్, బాత్ ఏక్ రాత్‌కీ – ఇవీ అచ్యుతవల్లి కథలే! 'జుఆ' అనేది మరో విలక్షణ శీర్షిక గల కథ.

అబ్ తేరీ, ఆజ్ ఔర్ కల్, ఇజ్జత్; అలాగే షోడశ, సిద్ధి, దీపకరాగం, స్వయంబద్ధ కూడా తన రచనలే! ఈ శీర్షికల్లోని వైవిధ్యమే ఆమె భావవ్యక్తీకరణ వైభవాన్ని చాటి చెప్తోంది.

'ఇంతటి విభిన్నత మీకెలా సాధ్యమైంది' అని ఒక సభలో అడిగితే – 'రాన్రాను కొద్దీ సాధ్యపడింది' అంటూ వెంటనే బదులిచ్చారామె.

రసావిష్కరణ విధానంలోనూ అదే ప్రత్యేకత. ఉదాహరణకు ఓ కథానికలో: 'ధ్యాస అంతా ఉల్లి ముక్కల మీదే ఉంది. అవి తన నోట్లో ఉన్నట్లూ, తను చప్పరిస్తూ, లొట్టలు వేస్తూ వాటి రసాన్ని పీలుస్తున్నట్లూ, కొంచెం కారం కూడా తన నాలిక్కి తగిలినట్లూ ఊహిస్తోంది.' అని అభివర్ణన. 'ఉల్లిముక్కల గురించి ఇదేం వర్ణనా' అనుకోవచ్చు చదువరి ఎవరైనా? అసలు విషయం తెలియాలంటే నేపథ్యంలోకి వెళ్లి తీరాల్సిందే! అది ఇదీ:

'ఆ సమయానికి సుభద్ర బంగాళా దుంపలు, నీరుల్లిపాయలు వేయిస్తోంది. ఆండాళుకి నోరూరిపోతూంది. ఎర్రగా వేగిన బంగాళా దుంప ముక్కల కోసం కాదు! స్టీలు మూకుడులో తళతళా మెరుస్తున్న ఆ ఉల్లి ముక్కల కోసం...!'

ఎందుకూ అంత నోరూరిందీ... అంటే ఆ కథను ఆసాంతం చదవాల్సిందే. ఇదే కదా – చదివించేలా రాయడమంటే!

గంభీరత గురించి చెప్పాలంటే – 'ఆ వ్యథిత హృదయం అల్లకల్లోలమైంది. చెట్ల ఆకులు మంత్రం వేసిన వాట్లకు మల్లే ఎక్కడా కదలటం లేదు.' ఇలా వాక్యాల్లో తనదైన రచనా నిపుణత.

మొట్టమొదటగా రాసింది వ్యాసాన్ని. ఆ తర్వాతే కథలూ నవలలూ. 'పుట్టిల్లు' నవల ప్రచురితం అయినపుడు అచ్యుతవల్లికి ఇరవై ఏళ్లు కూడా లేవు! మరో నలుగురైదుగురితో కలిసి 'షణ్ముఖ ప్రియ' అనే గొలుసు నవలనూ అప్పట్లోనే రాశారు.

శీర్షికలు నిర్వహించడంలోనూ దిట్ట. రాతలో, నిర్వహణలో పేరొందిన కారణంగానే ఆమె రచనలు వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయి. సమాజాన్ని సూటిగా ప్రశ్నిస్తూ రాసిన నవల 'ఇదెక్కడి న్యాయం' తెలుగు సహా అనేక భాషల్లో చలనచిత్ర రూపం సంతరించుకుంది.

ఏ సాహితీవేత్తకైనా ముందుగా కావాల్సింది భావుకత. ఇది ఐవీఎస్‌లో పుష్కలం. 'తమ తలదాల్చినది సువాసనలు వెదజల్లే సుకుమార సుందర పుష్పం అనుకుని మురిసిపోయింది. ఆ అందాల అరవిచ్చిన పూరేకుల నడుమ కణకణమండే నిప్పు రవ్వలున్నాయనీ, అవి ఎప్పుడో తన తలపైన పడి శరీరాన్నే భస్మం చేస్తాయనీ ఇప్పుడు తెలిసొచ్చింది' అని రాయడం అంటే ఎంత భావోద్విగ్నత? ఉద్వేగ తీవ్రత కనిపిస్తుంది అంతటా.

సంస్కృత భాషలో అభినివేశం కొన్ని రచనల్లో స్ఫుటంగా కనబరిచారామె. కథ పేరు 'మూగపోయిన



జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

ప్రకృతి'. ప్రారంభం శ్లోకంతో అవుతుంది. మధ్యలో ప్రాంతీయ యాస చోటు చేసుకుంటుంది. ముగింపులో ఎనలేని ఉత్కంఠగా అనిపిస్తుంది రచన అంతా.

విస్తృతి నిండిన రచన ఇది. జయదేవ అష్టపది ప్రస్తావన కథ మొదట్లో ఉంటుంది. స్ఫురదతి ముక్తలతా పరిరంభణ ముకుళిత పులకిత చూతే! బృందావన విపినే పరిసర పరిగత యమునా జలపూలే! దీని భావాన్ని, అర్థాన్ని సూక్ష్మరీతిన చెప్పిన తీరు పాఠకుల్ని అబ్బురపరుస్తుంది. భాషా సంపద నిండినట్లుంటుంది.

పాతికేళ్ల వయసు నిండుకుండానే 'గృహలక్ష్మి' స్వర్ణకంకణం ఆమెను వరించి వచ్చింది. దాదాపు అదే కాలక్రమంలో యద్దనపూడి సులోచనారాణికి అదే పురస్కృతి అందడం ఇక్కడ ప్రస్తావనార్హం.

అదే గృహలక్ష్మి పేరుతో మునుపు విఖ్యాత పత్రికా సంస్థ నిర్వహణ, దశాబ్దాల పర్యంతం సాగించిన సేవ ఆదర్శప్రాయం. ఉత్తమ కథారచయిత్రి పురస్కృతి 1977 ప్రాంతాల్లో అచ్యుతవల్లికి లభించింది. ఆ సందర్భంలో ఒక వ్యాసం వెలువరించిన ఆమె తన ప్రధాన కేంద్రీకరణ మనిషి మనస్తత్వం మీదనే అని వెల్లడించారు. నిజమే అనేకానేక రచనల్లో ఆ చిత్రీకరణ మన కళ్లముందు నిలుస్తుంటుంది.

'నాగావళి నవ్వింది' కథ వెలువడి ఇప్పటికి ఐదున్నర దశాబ్దాలు. నాటి వారపత్రికలో ముద్రితమైంది కూడా మే నెలలోనే!

**'నాగావళి కొత్తగా వస్తుంది. అక్కడక్కడ ఉన్న ఇసుక మేటల్ని చెరగుకుంటూ చిక్కగా కాఫీరంగులో ఉన్న నీళ్లతో అది నవ్వుకుంటూ నడుస్తూంది. కడుపు నిండిన కొండ చిలువలాగుంది.**

**నాగావళి నల్లబడింది. కుశాలపురం నుంచి ఆ వంతెన మీదుగా జ్యేష్ఠ మాసపు చివర మేఘాలు ప్రయాణించుతూ, నాగావళి బురద నీళ్లను తమ చివర్లకి పులుముకుంటున్నాయి.**

**నాగావళి ఒడ్డును ఒరుసుకుంటూ ప్రవహిస్తోంది. ఆ వేగాన్ని ఎవరు అరికట్టగలరు?**

**నాగావళి మటుకు తనలో తానే నవ్వుకుంటూనే ఉంటుంది. చీకట్లలో నల్లబడుతూనే ఉంది.'**

– ఇలా కథ అంతటా సందర్భ అనుసారంగా.. నాగావళి గమనాన్ని విపులీకరించారు రచయిత్రి. ఆ రచనకు వేసిన చిత్రం సైతం నది రూపంలో ఉండటం, స్త్రీ రూపాన్ని ప్రతిఫలించడం మరింత విశేషం!

ఆమె నవలా సాహిత్యం మీద ఏకంగా సిద్ధాంత గ్రంథమే రూపుదిద్దుకుంది. అప్పట్లోనే బహుళ ప్రాచుర్యాన్ని సొంతం చేసుకుంది.

అచ్యుతవల్లిలోని పరిశీలనాసక్తి మరెన్నో సాహితీ ప్రక్రియలకు మూల కారణంగా నిలిచింది. పరిణీత శీర్షికతో నాటక రచననీ చేశారామె. సాహిత్యం, సమాజ అనుబంధ బాంధవ్యం గురించి వ్యాసాలెన్నింటినో వెలయించారు. పగిలిన పలక, పగిలిన పలకలు – ఈ రెండు రచనలూ ఆమెవే! ముద్రితమైంది కొన్ని సంవత్సరాల వ్యవధిలో.

మోతీ అంటూ రెండే రెండు అక్షరాలు శీర్షికతో అచ్యుతవల్లి రాసిన కథ ఆనాడు 'భారతి'లో వెలువడింది. మోతీ అంటే మంచి ముత్యం. సున్నితంగా అలా పిలుస్తూంటే, ఎక్కువ శ్రావ్యంగా వినవస్తుంది. ఆ మోతీ ముఖం ముద్దులు మూటగట్టినట్లు ఉండేది. పసితనపు పాలనురుగు వంటి మృదుత్వం.

'తెల్ల కుందేలు పిల్లా, తెల్లపిల్లి పిల్లా– వీటన్నింటికంటే నేను జీవితాంతం మరవలేని రూపం నా చిన్నారి మోతీది!' అంటారు ఒకచోట. ఇంతకీ ఆ మోతీ ఏమిటి, అది ఎవరి కథ అనేది రచన చివరివరకు తెలియదు మనకు! అంతటి రచనా చాతుర్యం ఆ కలంలో ప్రవహిస్తూ ఉండేది ఎప్పుడూ!

రచనలతోపాటు ఆమె లలిత గీతికలూ ఆనాడు తెలుగునాట సమాదరణ అందుకున్నాయి. ప్రశంసలకు పాత్రమయ్యాయి.

ఇప్పటికి ఒకటిన్నర దశాబ్దం కిందట ఆ కలం ఆగింది. గళమూ మూగవోయింది. అయినప్పటికీ ఇప్పటికీ పాఠకుల, శ్రోతల మనోమందిరాల్లో ఆమె జ్ఞాపకాలెన్నో పదిలంగా ఉన్నాయి.

అంతర్జాతీయ సంస్థ నిర్వహించిన పోటీల్లో విజేత ఆమె. వివిధ స్థాయిల్లోని తన ప్రతిభా పాండిత్యాలను రచనల ద్వారా గుదిగుచ్చి, సాహితీ మాత మెడలో పూలహారంగా సమర్పించారు.







నీడబారిన మొక్క, పారిపోని చిలుక, కదలని చాట వంటి పదబంధ రచనలతో చదువరులందరి మదిలో ఆలోచనలు రేకెత్తించిన ప్రయోగశీలి. అచ్యుతవల్లి రచనల్లోని 'నిర్మల' పద అర్థం ఆమెకి సంపూర్తిగా వర్తిస్తుంది మరి. ప్రతిభాశాలికి సముదాత్త ఉదాహరణ ఆమే! ★

## అడవి బిడ్డలను అక్కున చేర్చుకుని అవసరాలు తీరుస్తున్న సంఘమిత్ర

**నంద్యాల:** మనుషులను చూస్తూనే అభద్రతా భావంతో దూరంగా తొలగి పోయే చెంచులు సంఘమిత్ర ఆవాసం సభ్యుల ప్రేమకు మురిసి వారి చేయి పట్టుకుని ఫోటోలు దిగుతున్నారు. దత్తత గూడేలలో నిరంతరం సేవల్లో, వైద్య సేవలతో పాటు దుస్తులు పంపిణీ కూడా భాగమే. మలమల మాడ్చే ఎండల్లో ఒల్లు కప్పుకోను జానెడు గుడ్డకు నోచుకోని అభాగ్యులకు సంఘమిత్ర సభ్యులు ఏప్రిల్ 17న దుస్తులు పంపిణీ చేశారు.

దత్తత గూడెమైన నాగలూటిలో జరిగిన కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షుడు చిలుకూరు శ్రీనివాస్, కార్యదర్శి కర్నాటి నాగ సుబ్బారెడ్డి ఆవాస సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





# విలువలతో కంచి

**విద్య అంటే నేడు మదిలో మొట్టమొదట కలిగే ఏకైక భావన- వ్యాపారం! విద్యార్థి అంటే కేవలం ఒక వినియోగదారుడు! కానీ మీకు తెలుసునా? పూర్వం నలందా, తక్షశిల వంటి ప్రాచీన విశ్వవిద్యాలయాల సరసన దక్షిణాదిన మనకూ ఒక విశ్వవిద్యాలయం తమిళనాట కంచిలో వెలుగొందినది. పేరు 'ఘటికాస్థానం'. ఘటిక అంటే కుండ. వివిధ దేశాల నుంచి వచ్చే విద్యార్థులు ఛప్పన్నశాస్త్రాలలో తమ సందేహాలను తాళపత్రాలపై రాసి కుండలలో పెట్టేవారు. ఒక్కొక్క శాస్త్రానికి ఒక్కొక్క కుండ! ఆయా శాస్త్రాలలో నిష్ణాతులైన పండితులు విషయాలవారీగా కుండలలో సమాధానాలను రాసి ఉంచేవారు! పల్లవుల రాజధానిగా అప్పటికే ఎంతో ఖ్యాతిగడించిన కాంచీపురానికి ఈ ఘటికాస్థానం విద్యాభరణమై విలసిల్లింది. కాలానుగుణంగా అన్నిటితో పాటుగా అదీ కనుమరుగైంది.**

రోజులు మారాయి. అనేక శతాబ్దాల బానిసత్వం తరువాత స్వాతంత్ర్యం సిద్ధించింది. అయితే మానసిక దాస్యం పాశ్చాత్యవిద్యావ్యవస్థ పట్ల వ్యామోహం రోజురోజుకూ పెరుగుతూ పోతున్నది. 1980ల కాలం విద్యారంగంలో ఓ సంధిదశ. విలువలకు కాలం చెల్లి, యుటిలిటేరియన్ సిద్ధాంతం చదువులలోనూ ప్రవేశిస్తున్న దశ. ఇటువంటి పరిస్థితిలో ప్రాచీన భారతీయ పరంపరలోని విలువలను కొనసాగిస్తూ ఆధునిక విద్యలో అప్పుడప్పుడే అందివస్తున్న అన్ని అవకాశాలనూ విద్యార్థికి అందించాలని కంచికామకోటిపీఠం ఆచార్యులు భావించారు! సమాజానికి తమవంతు సేవగా నీతిమంతులైన పౌరులను అందించాలనుకున్నారు! చదువుల నెలవు ఖరీదైన వ్యవహారంగా కాక- భారతీయ సంప్రదాయాల ప్రకారం వ్యక్తిత్వ నిర్మాణకేంద్రంగా ఉండాలని కామకోటిపీఠాధిపతి బ్రహ్మలీనులు శ్రీ జయేంద్రసరస్వతీ స్వామివారు, ప్రస్తుత పీఠాధిపతులు శ్రీ శంకరవిజయేంద్ర సరస్వతీ స్వామివారు తపించారు. తమ గురువుల పేరిట ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు! విద్యార్థిని కేవలం చదువు 'కొనే' వాడుకదారుగా కాక సాధ్యమైనంత తక్కువఖర్చుతో చదువుకుని, విలువలతో కూడిన భావిభారత పౌరునిగా ఎదిగేలా, చదువుకునే మూడు-నాలుగు సంవత్సరాల కాలాన్ని సర్వతో ముఖాభివృద్ధికి సువర్ణావకాశంగా మలచుకునేలా కంచి విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పారు.

'నడిచేదేవుని' గా ప్రసిద్ధులై, యావత్ప్రపంచానికీ ఆధ్యాత్మికరంగ జ్యోతిగా వెలుగొందుతున్న పరమాచార్యుల పేరిట 'శ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతి విశ్వమహావిద్యాలయం' 1976లో ఏర్పాటైంది. యూజీసీ యాక్ట్ 1956-u/s 3 ప్రకారం తమిళనాడు రాష్ట్రంలో ఏర్పాటైన మొట్టమొదటి ప్రైవేటు (డీమ్డ్) విశ్వవిద్యాలయం ఇదే. శ్రీ కంచికామకోటి చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఈ సంస్థ విద్యకు విలువలను జోడిస్తూ ఉన్నత విద్య అన్ని వర్గాలకూ చేరాలనే ప్రాథమిక లక్ష్యంతో ప్రారంభమైంది. ఇంజనీరింగ్, ఆయుర్వేదం, సంస్కృతం, ప్రాచీన సంప్రదాయ కళలు, సంగీతం, శిల్పం, భారతీయ సంస్కృతి వంటి విషయాలను బోధించడంతో పాటు ఇతర ప్రజాప్రయోజన కార్యక్రమాల నిర్వహణ- అభివృద్ధి ఈ విశ్వవిద్యాలయ లక్ష్యం.

కంచి కామకోటిపీఠం ఆచార్యుల పరమ పవిత్రమైన ఆశీస్సులతో న్యాయ, వ్యాకరణ, వేదాంత, సాహిత్య శాస్త్రాల సంరక్షణ, బోధన లక్ష్యాలుగా కె.వి. దమాని కాలేజ్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్ పేరిట 'మహావిద్యా లయ' స్థాపించారు. అప్పట్లో ఇది రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్, న్యూఢిల్లీకి అనుబంధంగా ఉండేది. ఈ విద్యాలయం అప్పుడు ప్రాక్ శాస్త్రి (ఇంటర్మీడి యెట్), శాస్త్రి (బి.ఎ.) కోర్సులను అందించేది. 1978లో న్యాయ, సాహిత్య శాస్త్రాలలో ఆచార్య (ఎం.ఎ.) కోర్సులు నిర్వహించడానికి సంస్థ ఆమోదం పొందింది.

మే 26 వ తేదీ 1993 వ సంవత్సరంలో భారత ప్రభుత్వం ఈ సంస్థను అప్ గ్రేడ్ చేసి 'శ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతి విశ్వమహావిద్యాలయ'గా ఆమోదించి 'డీమ్డ్ యూనివర్శిటీ'గా ప్రకటించింది. తద్వారా సాంకేతిక, ఆధునిక శాస్త్రాలలో వివిధ కోర్సులను అందించడానికి విశ్వవిద్యాలయానికి అనుమతి లభించింది. అప్పటినుంచి సాంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రాలతో మిళితం చేస్తూ చదువుల వెలుగులు పంచడమే విశ్వవిద్యాలయ లక్ష్యం.

నిరాడంబరంగా ప్రారంభమై తొలిఅడుగులు వేసిన ఈ యూనివర్శిటీ దాదాపు మూడు దశాబ్దాల కాలంలో అనేక గత అనుభవాలు, ప్రయోగాల ద్వారా నిరంతరం రాటుదేలుతూ కాలపరీక్షకు తట్టుకుని ప్రగతిశీల సమగ్ర పద్ధతిలో తనను తాను తీర్చిదిద్దుకుంటూ అభివృద్ధి పథంలో అగ్రగామిగా ముందుకు సాగుతున్నది. విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంచి, వారి యోగ్యత, సామర్థ్యాలకు అనుగుణంగా తీర్చిదిద్ది లక్ష్యం చేరేందుకు వారికి చేయూతనందిస్తూ అంచనాలకు అనుగుణంగా జీవించేలా విద్యార్థులను సమాయత్తపరచే అనుభవజ్ఞులైన ఆచార్య బృందం విశ్వవిద్యాలయంలో ఉన్నది. సుదీర్ఘకాలంలో సంస్థ పురోగతిని, స్థిరత్వాన్ని నిర్ధారించేది ఈ కార్య నిర్వాహణా సామర్థ్యమే! అధ్యాపకులు పాటించే క్రమశిక్షణ, అంకితభావం, అభిరుచి మా విద్యార్థుల ప్రవర్తనలో ప్రతిబింబిస్తాయి. విశ్వవిద్యాలయంలో పాదుకొల్పిన భారతీయ సనాతన సాంప్రదాయ విలువలు, సంస్కృతి- విద్యార్థులలో నైతికవిలువలను పొందుపరచడంలో ప్రధానపాత్ర పోషిస్తాయి. విద్యార్థులకు సంస్కృతి ఇంకా- సామాజికపరమైన సామరస్యం, మెరుగైన భావోద్వేగ వ్యక్తీకరణ వంటి నైపుణ్యాలను అందించటం కోసం అవసరమైన పునాదిని అందిస్తున్నది.

**అకడెమిక్ సదుపాయాలు**

శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వవిద్యాలయానికి సంబంధించినంత వరకూ అకడెమిక్ సదుపాయాలే అత్యంత ప్రధానమైన అంశం. ఎందుచేతనంటే ఇవే విద్యార్థులకు 'యూనివర్సల్ లెర్నింగ్ స్పేస్'ను అందజేస్తాయి. మా విశ్వవిద్యాలయం విద్యార్థులకు సురక్షితమైన, ఉత్సాహ పూరితమైన వాతావరణంలో విద్యనందిస్తుంది. కోవిడ్ అనంతర పరిస్థితులలో పెరిగిన విద్యార్థుల డిమాండుకు అనుగుణంగా విశాలమైన తరగతిగదులు, ఇతర వసతి సదుపాయాలు నిర్మింపబడ్డాయి.

నిరంతరం నేర్చుకునే ప్రక్రియ అనేది SCSVMV క్యాంపస్‌లో ఒక జీవన విధానం. మేము ప్రతి విద్యార్థికి తమ-తమ వ్యక్తిత్వాలకు అనుగుణంగా రాణించేలా విద్య, క్రీడలు, కళలమధ్య సమతుల్యత పాటిస్తాం. ప్రతిభావంతమైన సాధనకు మద్దతుగా నిలిచేందుకు కళలు, సైన్సు, క్రీడలలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు విశ్వవిద్యాలయంలో అభివృద్ధి చేయబడుతున్నాయి. వీటితోపాటుగా కాలానికి అనుగుణంగా అత్యుత్తమ కోర్సులు SCSVMVలో



# కూడిన విద్యకు నిలయం విశ్వవిద్యాలయం!

అందుబాటులో ఉంటాయి.

విశ్వవిద్యాలయం అందరు విద్యార్థులకూ అత్యుత్తమ ప్రయోగాత్మక శిక్షణ అందించి వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దుతున్నది. పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ స్మార్ట్ క్లాస్ రూమ్స్, వర్చువల్ రియాలిటీ పరికరాలతో కూడిన ఐటీ ల్యాబులు, అధునాతనమైన డ్రోన్ ల్యాబులు, ఐఐటీ మద్రాసు, టీసీఎస్ వంటి సంస్థలతో కలసి ఏర్పాటు చేస్తున్న ఆధునిక శాస్త్రీయ ప్రయోగశాలలు, వర్క్‌షాప్‌ల వంటి సృజనాత్మక సదుపాయాల సాయంతో విద్యార్థి ప్రతిభకు సానబెట్టటం జరుగుతున్నది. సంక్షిప్తంగా చెప్పాలంటే SCSVMV విద్యార్థిలోకానికి వరం లాంటిది!

**విద్యార్థులకు వసతి సదుపాయాలు**

హాస్టల్‌లో గడపడం విద్యార్థి జీవితంలోని ముఖ్యమైన అంశాలలో ఒకటి. ఇది విద్యార్థులు విశ్రాంతి తీసుకోవడానికి, చదువుకోవడానికి, వ్యక్తిత్వనిర్మాణానికీ అనువైన ప్రదేశం. SCSVMVలో తలిదండ్రులకు వారి పిల్లలని సురక్షితమైన వాతావరణంలో ఉంచుతామనే భరోసా ఉంది. SCSVMVలో ఆధునికీకరించిన హాస్టళ్లలో విశాలమైన గదులు, స్టడీ ఫ్రెండ్లీ ఫర్నిచర్, స్టోరేజీ సదుపాయాలు, విశ్రాంతస్థలాలు, వినోద ప్రదేశాలు, వ్యాయామశాల, ధ్యానమందిరం, విశాలమైన డైనింగ్ హాళ్లు, ఆధునిక వంటగది, చదరంగం, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ సౌకర్యాలతో కూడిన ఆటస్థలాలు అలరిస్తాయి. పాజిటివ్ ఇంకా స్పోర్టివ్ దృక్పథం అలవరుచుకోవ డానికి వారికున్న అవకాశాలెన్నో!

**అంతర్జాతీయ లైబ్రరీ- తాళపత్ర విభాగం**

విశ్వవిద్యాలయ రథానికి ఇరుసుగా భావించే సుసంపన్నమైన అంతర్జాతీయ గ్రంథాలయం కంచి విశ్వవిద్యాలయం సొంతం. 1993లో ఈ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఇందులో మూడు అంతస్తులలో విశాలమైన వసతితో కూడిన 12 విభాగాలు ఉన్నాయి. విశ్వవిద్యాలయానికే తలమానికమైన ఈ కట్టడం వాస్తు పరంగా చూస్తే పూర్వం కంచి రాజవంశీకులచే కంబోడియాలో స్థాపించిన వాస్తుశిల్పాన్ని సూచిస్తుంది. కంచి అంటేనే శక్తిపీఠం కామాక్షీ అమ్మవారికి నిలయం కదా! ఆ శక్తి విద్యార్థులకు సకారాత్మకంగా అందాలనే సంకల్పంతో శంకరాచార్య స్వామివారు శ్రీచక్రా కారంగా ఈ భవనాన్ని నిర్మింప జేశారు! ఈ భవనానికి ఎదురుగా యూనివర్సిటీ ఐకన్ (సాంస్కృతిక చిహ్నం) వంటి ఆదిశంకరుల 68 అడుగుల నిలువెత్తు ఏకశిలా విగ్రహం చూపుతిప్పుకో నివ్వదు!

లైబ్రరీ భవనంలో 5000కి మించిన మేన్యుస్క్రిప్ట్ (4000లకు పైగా తాళపత్రాలు, పదిహేనువందల ప్రాచీన గ్రంథాలు)లతో కూడిన తాళపత్ర భాండాగారం ఉన్నది. దేశవ్యాప్తంగా శ్రీ కంచి కామకోటిపీఠం ఆచార్యుల విజయయాత్రల సందర్భంగా అనేక తాళపత్రాలు సేకరించారు. వాటన్నింటినీ ఇక్కడ భద్రపరచి, భావితరాలకోసం నిరంతరం డీకోడ్ చేయడం జరుగుతున్నది. ఈ తాళపత్ర విభాగము కేవలం సంస్కృతశాఖకు సంబంధించి కాక, సమస్త ఇంజనీరింగ్ శాఖలలోని నైపుణ్యాలతో మేలిమి మేళవింపుగా 'మల్టీ డిసిప్లినరీ' పరిశోధనరంగానికి బాటలు వేస్తున్న విభాగం. మునుముందు కృత్రిమ మేథ (ఏ.ఐ.), మెషీన్ లెర్నింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, స్టాండర్డైజేషన్ వంటి అంశాలలో ఇక్కడ చదువుకునే భావితరాల ఇంజనీరింగ్ విద్యార్థులకు ఒకవైపు ఇంజనీరింగ్‌లో అత్యాధునిక పరిశోధనా నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూనే మరొకవైపు ప్రాచీన వారసత్వ పరిరక్షణకు తమ విజ్ఞానాన్ని ఉపయోగించే అవకాశాన్ని అందిస్తున్నది.

**క్రీడా సదుపాయాలు**

విద్యార్థుల వ్యక్తిత్వ సమగ్ర వికాసం క్రీడల ద్వారానే సాధ్యం. అందుచేతనే SCSVMV క్రీడలకు ఎంతో విలువనిస్తుంది. స్పోర్ట్-జిమ్, అథ్లెటిక్స్, టెన్నిస్, షటిల్, బ్యాడ్మింటన్, స్క్వాష్, రన్నింగ్/జాగింగ్/వాకింగ్ ట్రాక్‌లు, చదరంగం, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్ ఇక్కడి సదుపాయాలు. SCSVMVలో అత్యాధునిక లైటింగ్ సౌకర్యాలతో కూడిన క్రికెట్ మైదానం, రెండు టెన్నిస్ కోర్టులు, (క్లే, సింథటిక్), బాస్కెట్ బాల్ కోర్ట్ (సింథటిక్), కబడ్డీ మైదానం, క్రికెట్ ప్రాక్టీస్ నెట్ (ఫాస్ట్/స్పిన్ బౌలర్ల శిక్షణ ప్రత్యేకం) వంటివాటితో పాటుగా విశ్వ విద్యాలయ సిబ్బంది, విద్యార్థులకు వారి ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యాయామం, యోగా క్యాంపు వంటి అదనపు సౌకర్యాలు కూడా కల్పించారు.

SCSVMV క్రీడా ప్రాంగణంలో భావి అథ్లెట్లను తయారుచేసే వాకింగ్ కమ్ జాగింగ్ ట్రాక్, అత్యాధునిక పరికరాలతో సిద్ధంగావించిన హనుమాన్ వ్యాయామశాల, ఆచార్యులు-విద్యార్థులందరి సకలవిధ శ్రేయస్సుకోసం ఆధునిక కార్డియో, శిక్షణ పరికరాలతో కూడిన జిమ్, యోగాకేంద్రం, నృత్యసాధనా కేంద్రం వంటివి ఉన్నాయి. బాలికల హాస్టల్ ప్రాంగణంలో ప్రత్యేక వ్యాయామశాల, ఇతర క్రీడలకు సంబంధించిన సౌకర్యాలు, ఒక ఓపెన్ జిమ్ ఉన్నాయి. SCSVMVకి గతం నుంచే అనేక ప్రతిష్ఠాత్మకమైన కప్‌లు గెలుచుకున్న ఘనమైన క్రీడారికార్డు సైతం ఉన్నది.

యూజీసీ యాక్ట్ 1956-యూనివర్సిటీ u/s 3 ప్రకారం ఏర్పాటై, NAAC వారి A గ్రేడ్' గుర్తింపు పొంది అన్నిరకాల వసతులతో రూపుదిద్దుకున్న ఈ విశ్వవిద్యాలయంలో వివిధ ఇంజనీరింగ్ మరియు ఇతర కోర్సులలో ప్రవేశాలకోసం www.kanchiuniv.ac.in వెబ్‌సైటును సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి.

**మరిన్ని వివరాలకు సంప్రదించండి:**

శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతి విశ్వమహావిద్యాలయం (SCSVMV డీమ్డ్ యూనివర్సిటీ), ఏనాత్తూర్, కాంచీపురం, తమిళనాడు 631561. అడ్మిషన్లకు సంప్రదించవలసిన నెంబర్లు : 9629032323, 9629001144, 8098001630 (ఆయుర్వేదం)




## హార్వర్డ్ వర్సిటీకి గ్రాంట్లు నిలుపుదల

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం దేశ ఖజానాకు ఆదా చేసే పనుల ప్రభావం హార్వర్డ్ యూనివర్సిటీపై పడింది. ఆ క్రమంలో ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించారని పేర్కొంటూ యూనివర్సిటీకి అందించాల్సిన 2.2 బిలియన్ డాలర్ల గ్రాంటును నిలుపుదల చేసింది. దీనికి తోడు యూనివర్సిటీకి రావాల్సిన 60 మిలియన్ డాలర్ల ఫెడరల్ కాంట్రాక్టులను నిలిపివేసినట్టు శ్వేతసౌధం ప్రకటించింది. అంతేకాకుండా నియామక పద్ధతులలోనూ, ప్రవేశ విధానాలలోనూ మార్పులు తీసుకురావాలని, ఫేస్ మాస్క్‌లను నిషేధించాలని ఆదేశిస్తూ అధికార యంత్రాంగం ఇటీవల ఓ లేఖను యూనివర్సిటీకి పంపించింది. అయితే యూనివర్సిటీ ప్రాంగణంలో పాలస్తీనా అనుకూల ఆందోళన కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపడానికే ట్రంప్ సర్కారు ఇలా చేస్తోందనేది అంతర్జాతీయ విశ్లేషకుల అభిప్రాయం. శ్వేతసౌధం పంపించిన ఉత్తర్వులను హార్వర్డ్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ అలాన్ గార్బర్ తోసిపుచ్చారు.

## తొలిసారిగా రైల్లో

మనదేశంలో డిజిటల్ లావాదేవీలు భారీ ఎత్తున జరుగుతున్నప్పటికీ నగదు లావాదేవీలు ఏ మాత్రం తగ్గలేదనటానికి నిదర్శనంగా భారతీయ రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్లలో ఏటీఎం సేవలను అందుబాటులో తీసుకువస్తోంది. ఇందులో భాగంగా మధ్య రైల్వే మొట్ట మొదటిసారి అన్నట్టుగా ముంబాయి, మన్మాడ్ మధ్య రాకపోకలు సాగించే పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఏటీఎంను ఏర్పాటు చేసినట్టు మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి స్వప్నిల్ నీలా ఏప్రిల్ 16న మీడియాతో అన్నారు. మహారాష్ట్ర బ్యాంక్ భాగస్వామ్యంతో రైలులోని ఏసీ చైర్‌కార్‌లో ఒక ఏటీఎంను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇన్నోవేటివ్ అండ్ నాన్–ఫేర్ రెవెన్యూ ఐడియాస్ పథకం కింద రైలు బోగీలో గతంలో ప్యాంట్రీగా ఉపయోగించిన చోటులో ఏటీఎంను నెలకొల్పినట్టు తెలిపారు. దీనికి సంబంధించిన ట్రయల్ రన్ విజయవంతమైందని తెలిపారు. రైలు కదులుతున్నప్పుడు భద్రతకు సంబంధించిన ఇబ్బందులు

## తమిళనాడు స్వయం ప్రతిపత్తికి స్టాలిన్ కమిటీ

అటూ కేంద్ర ప్రభుత్వంతోనూ, ఇటు రాష్ట్ర గవర్నర్‌తోనూ నిత్యం ఏదో ఒక విషయంలో గిల్లికజ్జాలు పెట్టుకునే తమిళనాడు సీఎం స్టాలిన్ ఆయనకు ఉన్నట్టుండి రాష్ట్రానికి స్వయంప్రతిపత్తి తెచ్చిపెట్టుకోవాలని బుద్ధి పుట్టింది. అనుకున్నదే తడవుగా తన నిర్ణయానికి వేదికగా రాష్ట్ర అసెంబ్లీని మలచుకున్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, స్వయం ప్రతిపత్తికి, భాషా విధివిధానాలకు సంబంధించి తగు సూచనలు చేయడం కోసమని ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్టు ఏప్రిల్ 15న అసెంబ్లీలో ప్రకటించారు. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వం వహిస్తారు. కమిటీ సభ్యులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.అశోక్‌వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం పూర్వ వీసీ ఎం నాగనాథన్‌లను నియమించారు. ఈ కమిటీ రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాకు మార్చిన అంశాలను పునరుద్ధరించడం కోసం సిఫారసులు, రాష్ట్ర స్వయంప్రతిపత్తి కోసమని చేపట్టాల్సిన సంస్కరణలకు తోడు సర్కారియా, రాజమన్నార్ వంటి కమిషన్లు చేసిన సిఫారసులను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. కమిటీ జనవరి, 2026నాటికి తాత్కాలిక నివేదికను, 2028నాటికి తుది నివేదికను సమర్పించనుంది. అయితే స్టాలిన్ వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ఓట్లు కొల్లగొట్టడానికే ఈ ప్రకటన చేశారని ప్రతిపక్షం అన్నాడీఎంకే కి చెందిన ఉపనాయకుడు ఆర్‌బీ ఉదయకుమార్ ఆరోపించారు. 50 సంవత్సరాల క్రితం స్టాలిన్ తండ్రి కరుణానిధి కూడా ఇదే తరహా చౌకబారు ఎత్తుగడలకు పాల్పడ్డారని అన్నారు.



## ఏటీఎం సేవలు




రాకుండా ఉండ టానికని ఏటీఎంకు షట్టర్ డోర్‌ను సైతం అమర్చినట్టు చెప్పారు. ఏటీఎంను ఏసీ కోచ్‌లో ఏర్పాటు చేసినప్పటికీ రైలులోని 22 బోగీల్లోని ప్రయాణికులు వినియోగించు కునేలా ఏర్పాటుచేశారు. సుమారు 4.30 గంటల ప్రయాణ సమయం తీసుకునే పంచవటి ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, మన్మాడ్ జంక్షన్ మధ్య రాకపోకలు సాగిస్తుంది.

# జమ్మూలో తావి నదికి హారతి

జమ్మూలో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న బైశాఖి మేళాను పురస్కరించుకొని సూర్యపుత్రి తావీ నదికి అత్యంత భక్తి, శ్రద్ధలతో హారతి ఇచ్చారు. జమ్మూలో తొలిసారి జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్యులు, అర్చకులు, ప్రభుత్వ అధికారులు, పౌర సమాజం సభ్యులు వందలాదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రోచ్చాటనతో తావీ నదికి ప్రత్యేక పూజలు చేశారు. భక్త జనం భజనలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్నవారంతా నదిని కాపాడుకుంటామని, జమ్మూ ఆధ్యాత్మిక వారసత్వాన్ని నిలబెడతామని ప్రతిజ్ఞ చేశారు.




ఈ సందర్భంగా మనోజ్ సిన్హా ప్రసంగిస్తూ తావి నది పరివాహక ప్రాంతం ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక గమ్యస్థానంగా అవతరిస్తుందని అన్నారు. "అంతం కాదిది ఆరంభం. ఈ నదీ తీరం వద్ద హారతి ఇకపై ఒక సంప్రదాయంగా కొనసాగుతుంది. తావి నదీ తీరం సమష్టి భక్తి భావనకు కేంద్రంగా మారుతుంది. మన దృక్పథం కేవలం రహదారులు, భవనాలను నిర్మించడానికి పరిమితం కాకూడదు. అది విశ్వాసాన్ని నిర్మించాలి. సంస్కృతిని పునరుద్ధరించాలి. ఒక గుర్తింపును పెంచి పోషించాలి. మనం జమ్మూను కేవలం ఒక స్మార్ట్ సిటీగా మార్చడంతో సరిపుచ్చక ఒక పవిత్రమైన నగరంగా కూడా మార్చాలి" అని ఆయన అన్నారు.

# నేతాజీ ఆఖరి అనుయాయి కన్నుమూత

నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆఖరి అనుయాయి పొస్వుయి స్వురో ఏప్రిల్ 15న కన్నుమూశారు. 106 ఏళ్ల స్వురో నాగాల్యాండ్‌లోని రుజజో గ్రామంలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన తన గ్రామానికి పెద్దగా – డీబీ వ్యవహరించారు. నేతాజీ 1940 సంవత్సరంలో రుజజో గ్రామంలో తొమ్మిది రోజులపాటు ఉన్నప్పుడు స్వురో ఆయన వెన్నంటి ఉన్నారు. నేతాజీకి దుబాసీగా, గైడ్‌గా వ్యవహరించారు. సుభాష్ చంద్రబోస్‌కు, స్థానిక నాగా నేతలకు మధ్య వారధిగా ఉన్నారు. స్వురోకు అనేక భాషలు తెలుసు. దీంతో స్వరాజ్య ఉద్యమం సందర్భంగా నేతాజీ నెలకొల్పిన ఇండియన్ నేషనల్ ఆర్మీకి– ఐఎన్ఏ స్వురో తరగని ఆస్తిగా మారారు. ఒకానొక ఇంటర్వ్యూలో నేతాజీతో తన జ్ఞాపకాలను పంచుకుంటూ "నేతాజీ ఆదేశానికి లోబడి ఆజాద్ హిందు ఫౌజ్ కోసమని దరిదాపుల్లోని గ్రామాలకు వెళ్లి నిత్యావసర వస్తువులు తీసుకొచ్చేవాడ్ని. ఒకసారి అలా వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు బ్రిటిష్‌బలగాలు మాపై హఠాత్తుగా దాడి చేశాయి. దాడిలో ముగ్గురు జపాన్ సైనికులు, నాగా నేత కన్నుమూశారు. నేతాజీ మా ఊరు విడిచి వెళుతున్నప్పుడు భారత్ విజయం సాధించిన తర్వాత తిరిగి వస్తానని మాట ఇచ్చారు. తిరిగి వచ్చినప్పుడు గ్రామానికి పాఠశాల, రహదారులు, పైపుల ద్వారా నీరు సమకూరుస్తానని వాగ్దానం చేశారు", అని చెమ్మగిల్లిన కనులతో స్వురో చెప్పారు.



# 40 ఏళ్లకు రోదసిలోకి భారతీయుడు



రాకేష్ శర్మ అంతరిక్ష యాత్ర చేసిన దాదాపు నాలుగు దశాబ్దాలకు మరో భారతీయుడు రోదసిలోకి అడుగుపెట్టనున్నారు. భారతీయ వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా ఆక్సియోమ్-4 మిషన్‌లో భాగంగా మే నెలలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి యాత్ర చేయడానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఏప్రిల్ 18న తెలిపారు. భారతీయ వ్యోమగామి రాకేష్ శర్మ ఏప్రిల్ 3, 1984న రష్యాకు చెందిన సూయుజ్ రోదసి నౌక ద్వారా అంతరిక్ష యాత్ర చేసిన తొలి భారతీయుడిగా నిలిచారని మంత్రి తెలిపారు. జితేంద్ర సింగ్ న్యూఢిల్లీలో అంతరిక్ష శాఖ, భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ – ఇస్రో కార్యకలాపాలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రూప్ కెప్టెన్ శుక్లా చేపట్టనున్న రోదసి యాత్ర రోదసి పరిశోధనలో భారత్ సరికొత్త శకంలోకి సాహసోపేతంగా అడుగుపెడుతుందనే దానికి సంకేతంగా నిలుస్తుందని చెప్పారు.



# భారత్‌కు జపాన్ బుల్లెట్ రైళ్లు

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా అత్యంత వేగంతో పరుగులు తీసే బుల్లెట్ రైలును భారత్ పట్టాలపైకి ఎక్కించే దిశగా కృషి చేస్తోంది. ఆ దిశగా ముంబై – అహ్మదాబాద్ హై-స్పీడ్ రైల్ కారిడార్ – ఎంఏహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులను వేగవంతం చేసింది. బుల్లెట్ రైలుకు అనుగుణంగా భారత్‌లో వాతావరణ పరిస్థితులు ఉన్నదీ లేనిదీ తెలుసుకోవడానికి, ఒకవేళ వాతావరణం అందుకు అనుకూలంగా లేని పక్షంలో తదనుగుణంగా భారత్‌కు బుల్లెట్ రైళ్లు సరఫరా చేయాలని జపాన్ యోచిస్తోంది. ఇందులో భాగంగా ఈ-5, ఈ-3 సిరీస్‌కు చెందిన రెండు బుల్లెట్ రైళ్లను ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా భారత్‌కు అందించాలని జపాన్ నిర్ణయించినట్టు

స్థానిక మీడియా సంస్థ జపాన్ టైమ్స్ ఇటీవల పేర్కొంది. ఆ రెండు బుల్లెట్ రైళ్లు 2026 సంవత్సరంలో భారత్‌కు చేరుకుంటాయి. ఆ రెండు రైళ్లు కూడా వాటికి ప్రతికూలమైన వేడిమి, ధూళి లాంటి వాతావరణ పరిస్థితులకు సంబంధించిన డేటాను సేకరిస్తాయి. అవి సేకరించిన డేటా ఆధారంగా ఇక్కడి వాతావరణానికి అనుగుణమైన బుల్లెట్ రైళ్లను తయారీదారులు భారత్‌కు అందిస్తారు.

రైల్ కారిడార్ విషయానికి వస్తే.. నేషనల్ హై-స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ – ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ నవంబర్, 2021 నుంచి కారిడార్ నిర్మాణ పనులు చేపట్టింది. కారిడార్‌లో భాగంగా నదులపై మొత్తం 24 రైలు వంతెనలను నిర్మిస్తారు. వాటిలో 20 వంతెనలను గుజరాత్‌లో మిగిలిన 4 వంతెనలను మహారాష్ట్రలో నిర్మిస్తారు. ఆగస్టు, 2027 నాటికి రైల్ కారిడార్ కార్యకలాపాలు పాక్షికంగా మొదలవుతాయని ఓ అంచనా. ఇదే విషయమై కేంద్ర రైల్వే మంత్రి ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ “ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టు దేశంలో వేర్వేరు ఆర్థిక వ్యవస్థను సమ్మిళితం చేస్తుంది. భారతీయ రైల్వే

# భగవద్గీత, నాట్యశాస్త్రానికి అంతర్జాతీయ గుర్తింపు






యునెస్కో ఆధ్వర్యంలో జరిగే ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా భారతదేశానికి ఒక శుభవార్త వచ్చింది. సాంస్కృతిక పరిరక్షణలో భారత్‌కు ఉన్న శ్రద్ధాసక్తులు ఎంతటివో ఇది ప్రపంచానికి చాటుతుంది. నిజానికి ఇంతకు మించి భారత్ గర్వించేది ఏమీ ఉండదు. భగవద్గీతను ఇవాళ ఎవరో గుర్తించి గొప్ప గ్రంథంగా సర్టిఫికెట్ ఇవ్వక్కరలేదు. భగవద్గీతతో పాటు భరతుడి ‘నాట్యశాస్త్రం’ కూడా గౌరవాన్ని పొందడం గర్వించదగినదే. మెమరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో ఈ రెండు పుస్తకాలు చోటు దక్కించుకున్నాయి. యునెస్కోకు చెందిన ఈ రిజిస్టర్‌లో ప్రపంచ స్థాయి వారసత్వ చిహ్నాలను నమోదు చేస్తారు. దీనితో యునెస్కో గుర్తింపు పొందిన భారతీయ వారసత్వ చిహ్నాల (గ్రంథాలు) సంఖ్య 14కు చేరింది. యునెస్కో మెమరీ రిజిస్టర్‌లో మన రెండు మహా గ్రంథాలకు చోటు లభించడం ఎంతో



# గవర్నర్ల కేసును విస్తృత ధర్మాసనానికి పంపండి



తమిళనాడు గవర్నర్ వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మరింత విస్తృత ధర్మాసనానికి నివేదించాలని కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సుప్రీంకోర్టును కోరారు. అత్యున్నత స్థానమే రాజ్యాంగ సవరణలు చేసే పనికి పూనుకుంటే ఇక పార్లమెంట్, ఇతర చట్ట నిర్మాణ సభలు దేనికని ఆయన ప్రశ్నించారు. ఒక జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గవర్నర్ ఈ సూచన చేశారు. ప్రతీది సుప్రీంకోర్టు నిర్ణయిస్తే పార్లమెంట్ అవసరం అంతటితో ముగుస్తుందనికూడా గవర్నర్ వ్యాఖ్యానించారు. ఇది న్యాయవ్యవస్థ తన అధికార పరిధిని అతిక్రమించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కాబట్టి విచారణకు విస్తృత స్థాయి ధర్మాసనానికి పంపాలని ఆయన చెప్పారు. బిల్లులను ఎంత కాలంలోగా గవర్నర్ ఆమోదించి పంపించాలో రాజ్యాంగం ప్రస్తావించలేదని, కానీ ఇవాళ అత్యున్నత స్థానం అందుకు కాలపరిమితిని నిర్దేశించిందని, ఆ పరిమితి నెల కావచ్చు, లేదా మూడు నెలలు కావచ్చు, అది రాజ్యాంగ సవరణ అవుతుందని రాజేంద్ర అర్లేకర్ అభిప్రాయపడ్డారు. ఆయన వ్యాఖ్యలతో గవర్నర్‌ల అధికార పరిధిలో సుప్రీంకోర్టు ప్రమేయం అన్న అంశం మీద జాతీయ స్థాయి చర్చకు తెర లేచింది. ★

బుల్లెట్ రైలు తొలి కారిడార్‌ను ముంబై, థానే, వాపి, బరోడా, సూరత్, ఆనంద్, అహ్మదాబాద్‌లను కలుపుతూ నిర్మిస్తోంది. దీంతో ఈ నగరాలకు చెందిన ఆర్థిక వ్యవస్థలన్నీ కూడా ఏకైక ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటాయి. బుల్లెట్ రైలు పట్టాలెక్కిన తర్వాత ఎవరైనా సూరత్‌లో టిఫిన్ చేసి ముంబైకి వెళ్లవచ్చు. అక్కడ పని పూర్తి చేసుకుని తిరిగి వచ్చి రాత్రికి కుటుంబ సభ్యులతో డిన్నర్ చేయవచ్చు" అని అన్నారు.

గర్వించదగినదని ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇంతక్రితం ఈ గౌరవం పొందిన వాటిని ఒకసారి చూద్దాం. 1. సిద్ధ, ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన తాళపత్రాలకు 1997లో ఈ గౌరవం దక్కింది. చెన్నైలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏసియన్ స్టడీస్‌లో ఈ పత్రాలు ఉన్నాయి. 2. శివ రాతప్రతులు: ఇవి పుదుచ్చేరిలో ఉన్నాయి. శైవం, సిద్ధం వైద్యం, భక్తిగీతాలు ఉన్న ఈ పత్రాలకు 2005లో ఈ గౌరవం దక్కింది. 3. రుగ్వేద తాళపత్రాలు: 10,500పైగా మంత్రాలు ఉన్న పత్రాలివి. భారతీయ తత్త్వశాస్త్రానికి మూలాలే ఇవన్నీ. వీటికి 2007లో గుర్తించారు. 4. తరీఖ్ ఎ ఖాందాన్ ఎ తిమురియా: వీటికి 2011లో గుర్తింపు వచ్చింది. అక్బర్ కాలంలో పర్షియా భాషలో రాసిన పత్రాలు. తైమూర్, మొగల్ వంశాల పరంపరను వివరిస్తాయి. 5. విమలప్రభ: ఇది 11 శతాబ్దం నాటి బౌద్ధ గ్రంథం. తంత్రం, ఖగోళశాస్త్రం, భారతీయ తత్త్వశాస్త్రం గురించి ఇందులో ఉంది. దీనికి కూడా 2011లోనే గుర్తింపు ఇచ్చారు. 6. శాంతినాథ చరిత్ర: జైనంలోని 16వ తీర్థంకరుడు గురించి సచిత్రంగా వివరించే గ్రంథం ఇది. 1396లో దీని రచన ఆరంభమైంది. 2013లో దీనిని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చారు. 7. గిల్గిత్ రాతప్రతులు: కశ్మీర్‌లో వీటిని కనుగొన్నారు. బిర్చ్ చెట్ల బెరడుతో చేసిన పత్రాలపై రాసి ఉన్నాయి. ఆసియాలోని చాలా బౌద్ధ సంప్రదాయాల వివరాలు ఉన్నాయి. దీనికి 2017లో గుర్తింపు లభించింది. ★




# ప్రధానికి మున్నాంబమ్ వక్ఫ్ బాధితుల ధన్యవాదాలు

కేరళలో మున్నాంబమ్‌లో వక్ఫ్ బాధితులైన క్రైస్తవ మత్స్యకారులు వక్ఫ్ చటాన్ని సవరించి ఉమీద్ ను తీసుకొచ్చిన ప్రధాన నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 15న మున్నాంబమ్‌లో 'నండి మోదీ' (ధన్యవాదాలు మోదీ) కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజుకు స్థానికులు సంప్రదాయ వేషధారణలో ఘన స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్, కేంద్రమంత్రి జార్జి కురియన్, తదితరులు కిరెన్ రిజిజుతో పాటుగా ఉన్నారు. కేంద్ర మంత్రుల పర్యటన పేద మత్స్యకారుల్లో నైతిక స్థైర్యాన్ని ఇనుమడింపజేసింది. ఇదే సందర్భంగా కిరెన్ రిజుజు ఆర్చ్‌బిషప్ డాక్టర్ జోసెఫ్ కలతిపరమ్‌బిల్, సైరో మలబార్ కాథలిక్ పబ్లిక్ అఫైర్స్ కమిషన్ సభ్యులు, కేరళ కౌన్సిల్ ఆఫ్ చర్చస్ సభ్యులతో సమావేశమయ్యారు. వారంతా కూడా చరిత్రాత్మక వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేసిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ★

కథ

# లక్షణం

వి. శాంతి ప్రబోధ

సూరజ్ కి ఇప్పుడు 83 ఏళ్లు. నవ యువకుడిలాగే ప్రవర్తిస్తాడు.

బంధు మిత్రులతో సరదాగా ఉంటాడు. ప్రపంచమంతా తిరిగొస్తాడు.

అవునా! అని ఆశ్చర్యపోకండి .

ఇంకో విషయం వింటే మీరు మరింత ఆశ్చర్యపోతారు .

అతను డిమెన్షియా పేషెంట్. అవును! మీరు విన్నది నిజమే. అతను వాస్క్యులార్ డిమెన్షియా పేషెంట్. పదిహేనేళ్ల క్రితమే అతన్ని వాస్కులర్ డిమెన్షియా వరించింది.

అయినా నేను వందేళ్లు బతుకుతా అని ధీమా ఇస్తాడు.

చికిత్సకు లొంగని వ్యాధి అని తెలిసీ సూరజ్ అంత నమ్మకంగా ఎలా చెబుతున్నాడు?

అతనిది ఆత్మవిశ్వాసమా? అహంకారమా?

* * *

సూరజ్‌కి అమ్మ నాన్న పెట్టిన పేరు సూరయ్య. చిన్నతనం అంతా సూరయ్య గానే చెలామణీ అయ్యాడు.

సూరయ్య పుట్టి పెరిగింది భైంసా దగ్గరలోని మారుమూల గ్రామం. తండ్రి నిరుపేద రైతు. పంటలు పండక అప్పులపాలయ్యాడు.

నలుగురు ఆడపిల్లలు తర్వాత పుట్టిన సూరయ్యకి బాగా చదువుకోవాలని కోరిక. నాలుగు మైళ్లు నడిచిపోయి 7వ తరగతి వరకు చదివాడు. హై స్కూల్ చదువుకు సమీపంలోని పట్నం వెళ్లాలని ఆశపడ్డాడు.

కానీ వాళ్ల నాన్న అతని చదువు కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేనన్నాడు. చదువు మాన్పించి తనతో పాటు పొలానికి తీసికెళ్లి పనులు చేయించాడు. చేసేదిలేక సూరయ్య వాళ్ల నాన్నతో పాటు పొలంలో పార పని చేసేవాడు. గడ్డి కోసేవాడు. తర్వాత తర్వాత అరక దున్నడం, దమ్ము చేయడం నేర్చుకున్నాడు.

తన పొలంలో పనిచేసే ఎద్దుల జతకి తనకు పెద్ద తేడా లేదని వాపోయేవాడు.

ఏ పని చేస్తున్నా అతనికి చదువు మీద మమకారం పోలేదు. చదువుకోవాలనే తపన రోజురోజుకు మరింత పెరుగుతూ అతన్ని నిలువనీయడం లేదు.

తల్లిదండ్రుల కుటుంబ పరిస్థితి ఓ వైపు చదువుకోవాలన్న అభిలాష మరో వైపు ఆ పసి హృదయాన్ని నరక యాతన పెట్టాయి.

చివరికి ఓ రోజు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా కట్టుబట్టలతో ఇల్లు వదిలాడు.

మూడు రోజులు తిప్పలు పడి హైదరాబాద్ మహానగరంలో అడుగు పెట్టాడు. భాష, యాస కొత్తగా ఉన్నాయి. వాతావరణం చల్లగా ఉంది. పట్నం కొత్త. పట్టణ ప్రజలు కొత్త. పట్నం పనులు కొత్త. తిండి కొత్త. ఇదంతా అతనికి కొత్త అనుభవం. ఇలా ఉంటుందని కూడా అతను ఎప్పుడు వినలేదు. ఊహించలేదు.

మొదట ఒక గ్యారేజ్‌లో పనికి కుదిరాడు. అక్కడే రాత్రుళ్లు పడుకునేవాడు. స్నేహితులకు, ప్రేమించే తల్లిదండ్రులకు, అభిమానించే ఆత్మీయత పంచే అక్కలకు దూరంగా ఉండడం దుర్భరంగా తోచేదతనికి. ఆ పని వదిలేశాడు.

ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో పుస్తకాల బైండింగ్ పనిలో చేరాడు. ఆ పని చేస్తున్నప్పుడు ఎందరినో కలిశాడు. చాలా పుస్తకాలు చదివాడు. కొత్త జీవితం అతనికి చాలా ఉత్సాహాన్నిచ్చింది.

కాలం సూరయ్య జీవితాన్ని మార్చేసింది. సూరజ్‌గా కొత్త అవతారం ఎత్తాడు.

ఆ ప్రెస్‌లో పనిచూస్తూనే యజమాని సహకారంతో 10 వ తరగతి పరీక్షలు రాశాడు. ఆ తర్వాత ఓపెన్ డిగ్రీ చదివాడు. ఈవెనింగ్ కాలేజీలో చేరి లా చదివాడు. చదువు దాహం తీరడం లేదు.

రకరకాల పుస్తకాలు చదవడంతో పాటు దేశమంతా తిరిగాడు. రకరకాల పనులు చేశాడు. ఎక్కడ పనిచేసిన చాలా నమ్మకంగా పని చేసాడు. కొంత సొమ్ము జమ చేసుకోవడం కొత్త ప్రదేశాలకు వెళ్లి రావడం అతని జీవితంలో భాగమైంది. మనుషుల స్వభావాలను, ప్రపంచ రీతిని అర్థం చేసుకున్నాడు.

నిరంతర యాత్రికుడే కాదు నిరంతర చదువరి అయిన సూరజ్ ఎప్పుడు డబ్బు గురించి ఆలోచించలేదు. సంపాదించడం దేశదిమ్మరిలా తిరగడం, కొత్త జీవితాన్ని నిర్మించుకున్నాడు. తనకు నచ్చని విషయాలు ఎవరు మాట్లాడిన పట్టించుకునే వాడు. ఎవరేం చెప్పినా చిరునవ్వుతో వినేవాడు. మనసుకు నచ్చినట్లుగా ప్రవర్తించేవాడు.

చాలా ఏళ్ల తర్వాత తల్లిదండ్రులను వెతుక్కుంటూ ఇంటికి తిరిగి వచ్చాడు. వ్యవసాయం మొదలు పెట్టాడు. తల్లిదండ్రులు చూపిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు.

పట్నంలో ఆధునాతనమైన జీవితం గడపాలనే కోరిక గల భార్యతో వివాహ జీవితం మధురానుభూతి నివ్వలేదు. ఆమె తన కలల ప్రపంచం ఇది కాదని కొత్త జీవితం వెతుక్కుంది. పిల్లాజెల్లా బంధాలు లేవు.

తల్లిదండ్రులు కాలం చేశారు. తన కాళ్లకు చుట్టుకుని అడ్డుపడే బంధాలేమి లేవు. బంధాల బలహీనతలు లేవు. సోలో లైఫ్ ఇస్ సో బెటర్ అనుకున్నాడు. ఈ జీవితం తనకు ఓ లగ్జరీగా భావించాడు.

కారులో దేశమంతా తిరిగి రావాలనుకున్నాడు. కారు కొనడానికి చేతిలో కావలసిన సొమ్ము లేదు. కొద్దిగా భూమి అమ్మాడు. వచ్చిన సొమ్ముతో సెకండ్ హ్యాండ్ అంబాసిడర్ కారు కొన్నాడు. దాన్ని తన ప్రయాణానికి అనువుగా మలుచుకున్నాడు. కార్లు సామాన్యుడికి అందుబాటులోలేని సమయంలో సూరజ్ కారులో దేశాటన చేస్తాననడం ఆ ఆ చుట్టుపక్కల గ్రామాల్లో పెద్ద వార్తయింది.

దాదాపు ఏడాదిపాటు దేశాటన చేసి సూరజ్ ఇంటికి చేరే నాటికి నీకు తోడు మేమున్నామంటూ మోకాళ్ల నొప్పులు వచ్చి చేరాయి. ఇంటి దగ్గరే కొంత కాలం విశ్రాంతి తీసుకుందామనుకున్నాడు. ఆ సమయంలో అతనికి ఇతరుల సహాయం కొంత అవసరమైంది. కానీ, సహాయం చేసే వాళ్లు ఎవరూ లేరు. తన పనులు తాను తప్పనిసరిగా చేసుకోవాల్సిన స్థితి.

భార్య ఉండి ఉంటే అన్ని అందించి సేవలు చేసేది, మళ్లీ పెళ్లి చేసుకొమ్మని అక్కలు, మిత్రులు సలహా ఇచ్చారు. సూరజ్ అవేమీ పట్టించుకోలేదు.

తెలిసిన వాళ్ల పేర్లు మర్చిపోతున్నాడు. వాళ్లు పలకరిస్తే వాళ్లను ఎక్కడ చూశాడో ఎప్పుడు చూశాడో ఏమీ గుర్తు రావడం లేదు. తాను తిరిగిన ప్రదేశాల

గురించి రాయాలనుకున్నప్పుడు చాలా విషయాలు అతని మదిలోంచి చెరిగిపోయాయని,

అలా ఎలా చెరిగిపోయాయో అర్థం కాలేదతనికి. భాషలో కూడా మార్పులు వచ్చాయి. ఏకాగ్రత తగ్గిపోయింది. పదాల కోసం తడుము కోవడం, ఒక పదం బదులు మరో పదం వాడటం జరుగుతున్నది. రోజూ చేసే ఇంటి పనులు, వంట చేసే క్రమం మరచిపోతున్నాడు. జీవితం పరిమితమైపోతున్నది. అది అర్థమైన మరుక్షణం పట్నం వెళ్లి డాక్టర్‌ని కలిశాడు. ఆ డాక్టర్ చేసిన చికిత్స వల్ల ఏ మాత్రం మార్పు లేదు. మరో వైద్యుడిని కలిశాడు. ఆయన రకరకాల పరీక్షలు చేసి వాస్కులార్ డిమెన్షియా అని తేల్చారు. వ్యాధి గురించి తెలుసుకుని దిగ్భ్రాంతికి లోనయ్యాడు. నిరాశలో కూరుకుపోయాడు. కానీ అది అతి కొద్ది కాలమే. తర్వాత తాను డిమెన్షియా పేషెంట్ అన్న ఆలోచనే దగ్గరికి రానివ్వలేదు.

తనను తాను తిరిగి కనుగొనే ప్రయత్నం మొదలుపెట్టాడు.

మర్చిపోయిన వాటిని మళ్లీ మదిలోకి తెచ్చుకోలేనా? నేను గుర్తు తెచ్చుకోగలను ..అని తనకు తానే మళ్లీమళ్లీ చెప్పుకునేవాడు. వ్యక్తిగతంగా ప్రేరణ ఇచ్చుకుంటూ మానసికంగా దృఢంగా మారుతున్న అతని మనసు శరీరం నెమ్మదిగా అతను అనుకున్న విధంగా స్పందించడం మొదలైంది. వెళ్లిపోయిన ఒక్కొక్క విషయం తిరిగి రావడం మొదలు పెట్టాయి. అది అతనికి ఉత్సాహాన్నిచ్చింది. లేకపోతే కుంగిపోయేవాడేమో!

డిమెన్షియా అతన్ని వదలలేదు. వదలదని కూడా తెలుసు. కాలచక్రాన్ని వెనక్కి తిప్పేసి డిమెన్షియాని తరిమేయలేడని తెలుసు.

సో.. కాలంతో పాటు సాగుతూ, పరిస్థితుల్ని అడాప్ట్ చేసుకుంటూనే తన జీవితాన్ని తనే నిర్ణయించుకోవాలి. డిమెన్షియాకి తాను లొంగకూడదు. నేను వందేళ్లు బతకాలని నా కోరిక.

బతుకుతా..వందేళ్లు బతుకుతా అని తనకు తాను బలంగా చెప్పుకున్నాడు.

అందుకు అనుగుణంగా ఆహారంలో మార్పు చేసుకున్నాడు. మెదడు ఆరోగ్యాన్ని పెంచే ఆహార పదార్థాలపై దృష్టి పెట్టాడు.

ఒక క్రమబద్ధమైన జీవితంతో పాటు వ్యాయామం అతని జీవితంలో భాగమైంది. ప్రతి రోజు తాను ఏమి చేయాలో రాసి పెట్టుకునేవాడు. ప్రతి రాత్రి పడుకోబోయే ముందు తాను చేసిన పనులు చూసుకుని విజయవంతంగా పూర్తి చేశాను అనుకునేవాడు. ఏదైనా మర్చిపోతే అరే, ఈ పని మర్చిపోయానే అనుకునే అని మరుసటి రోజు చేయాల్సిన పనుల జాబితాలో చేర్చేవాడు.

ఒంటరిగానే ఉన్నప్పటికీ తాను ఒంటరిని అని ఎప్పుడూ బాధపడలేదు. తనకు తాను ఇచ్చే ధైర్యాన్ని మరెవరూ ఇవ్వలేరని అతని నమ్మకం. బంధాలేవీ లేకపోవడం కూడా అతన్ని మరింత గట్టిబరచిందో లేక దేశదిమ్మరిగా తిరిగిన అనుభవాలు శక్తిమంతగా మలిచాయో?!

డిమెన్షియా అని తెలిసినప్పటికీ అతనిలోని



**వృద్ధాప్యం, డిమెన్షియాలతో రివటలా ఉన్న వ్యక్తి, ఒంటరిగా దేశాటన చేసి తిరిగిరాగలడని ఎవరు మాత్రం ఊహించగలరు. సూరజ్ విషయంలోనూ అదే జరిగింది. బంధు మిత్రులు అతను తిరిగి వస్తాడని ఊహించలేదు. డిమెన్షియా గతంలో కంటే ముందడుగు వేస్తున్నది. తన పట్టు సాధించడానికి అవరోధాలు పెరుగుతూనే ఉన్నాయి.**



భ్రమణ కాంక్ష పోలేదు. సరికొత్త అనుభవాలు పోగేసుకోవాలనే ఆశ చావలేదు. కారు, పుస్తకాలు తీసుకుని మళ్లీ బయలుదేరాడు.

వృద్ధాప్యం, డిమెన్షియాలతో రివటలా ఉన్న వ్యక్తి, ఒంటరిగా దేశాటన చేసి తిరిగిరాగలడని ఎవరు మాత్రం ఊహించగలరు. సూరజ్ విషయంలోనూ అదే జరిగింది. బంధుమిత్రులు అతను తిరిగి వస్తాడని ఊహించలేదు.

డిమెన్షియా గతంలో కంటే ముందడుగు వేస్తున్నది. తన పట్టు సాధించడానికి అవరోధాలు పెరుగుతూనే ఉన్నాయి.

సూరజ్ డ్రైవింగ్ చేస్తుంటే కుడి ఎడమల గందరగోళం ఏర్పడుతున్నది. ఒకోసారి లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు అనిపించసాగింది. అలాంటి పరిస్థితుల్లో వాహనం పక్కకు నిలిపి ఆగిపోతున్నాడు.

ఈసారి అతని ప్రయాణం పల్లెలు, నగరాలు వదిలి ప్రకృతిలోకి సాగింది కాబట్టి ట్రాఫిక్ ఇబ్బందులు లేవు.

అడవులు, కొండలు కోనలు, ఆదివాసీల నుంచి చాలా తెలుసుకున్నాడు. న్యాయం వాళ్లకు ఎంత దూరంగా ఉందో అర్థం చేసుకున్నాడు. ఈ ప్రయాణంలో చిన్న చిన్న అవరోధాలు ఎదురైనా వెనుదిరగలేదు. నింగిని, నేలను, నీటిని కాపాడేది మనం కాదు ఆదివాసీలేనని నమ్మాడు. సూరజ్ లా చదివినా నల్లకోటు వేసుకుని కోర్టులో ఎప్పుడు అడుగు పెట్టలేదు. ఇప్పుడు ఆదివాసీల వైపు నిలబడి పనిచేయాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు. అప్పటికి అతని వయసు 75 ఏళ్లు.

అతని విషయం విని కొందరు కొట్టిపడేశారు. కొందరు మాత్రం సూరజ్ ఏది అనుకుంటే అది చేయగల సమర్థుడు అని ప్రోత్సహించారు.

అతని సంకల్పానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూనే ఉంది అతని జబ్బు. దాన్ని అధిగమించ డానికి అతని కృషి అతను చేస్తూనే ఉన్నాడు. కోర్టులో వాదించడం అతని శక్తికి మించిన పనిగా ఉంది. అకస్మాత్తుగా భాష పదాలు మాయమై పోతున్నాయి. అతన్ని గందరగోళ పరుస్తున్నాయి. అది అతడిని ఒత్తిడికి గురిచేస్తున్నది. వైద్యుల సలహాల మేరకు నల్లకోటు వేసుకోవడం మానేశాడు.

మొక్కలు, జంతువులూ, పక్షులు ప్రకృతితో దగ్గరగా జీవించడం మొదలు పెట్టాడు. సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు ఆనందించినట్లు వర్షాన్ని, అమావాస్య చీకటి ఆకాశంలో నక్షత్రాలు, పున్నమి చంద్రుని చాలా ఆనందించడం అలవాటైంది.

ఇప్పుడతని జీవన విధానంలో తన చుట్టూ ఉండే మనుషులే కాదు పరి సరాలు, పక్షులు, జంతువులూ, కొండలు గుట్టలు..అన్నీ అతని నేస్తాలే బంధువులే.

లాభాపేక్ష లేని వ్యవసాయం పురుగుమందులు, రసాయన ఎరువులు లేని ప్రకృతి సహజమైన వ్యవసాయం చేశాడు.

మొక్కలు చెట్లు మనకోసం తినడానికి చాలా ఇస్తున్నాయి. వాటితో మనం స్నేహంగా ఉండాలి. మన తల్లిదండ్రుల వంటి పొలాన్ని మనం గౌరవించాలి. గాలి, నీరు మనం కాపాడుకోవాలి అంటూ నలుగురికీ చెప్పేవాడు.

తన పొలంలో అందమైన తోట సృష్టించాడు. అందులో కూరగాయలు, పండ్లు పండించాడు. బడి పిల్లల్ని సెలవుల్లో తన తోటకు తీసుకుపోయేవాడు. కూరగాయలు, పండ్లు బడి పిల్లలకు పంచేవాడు.

పర్యావరణం గురించి బడి పిల్లలకి చాలా ఉపన్యాసాలు ఇచ్చేవాడు. ఏ పనిచేసినా చాలా ఇష్టంగా చేసేవాడు. సంతోషంగా చేసేవాడు. ఎప్పుడు ఎక్కడైనా తను చేసే పని పట్ల ఎంతో సంతృప్తి అతనికి. చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా బడి పిల్లలు సూరజ్ తోటకు వచ్చి చూసేవారు. తమ సందేహాలు తీర్చుకునేవారు.

చేస్తున్న పని, పిల్లలతో గడపటం, అతనికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. పని పట్ల ఇష్టాన్ని పెంచు తోంది. గొప్ప గౌరవం, గుర్తింపు లభిస్తున్నాయి. వాటిని అతను కోరుకోలేదు కానీ అవి అతనిపై అతనికి నమ్మకం, ఇంకేదో చేయాలన్న ప్రోద్బలం ఇస్తున్నాయి. జీవితేచ్ఛ పెంచుతున్నాయి.

తనకు డిమెన్షియా ఉందన్న విషయమే మర్చిపోయేవాడు. మనం ఒక వయసుకు వచ్చేసరికి మన మెదడు మరో విధంగా పని చేయడం మొదలు పెడుతుంది. కానీ నేను నా మెదడుని నా అధీనంలోకి తెచ్చుకుంటాను. నా చిత్త వైకల్యం నుంచి నన్ను నేను కాపాడుకుంటాను అని తనకు తాను చెప్పు కుంటూ మనోబలాన్ని పెంచుకున్నాడు.

నేను తప్పకుండా గుర్తుంచుకోవాలి. గుర్తుంచుంటాను అని నాకు నేను చెప్పుకున్నట్లయితే మన జ్ఞాపకాలు మళ్లీ తిరిగి వస్తాయని అతని నమ్మకం.

అతను సర్వ స్వతంత్రుడు. ఏ విషయంలో ఎవరి ఒత్తిడి లేదు.

ఒంటరివాడు, అయ్యో పాపం అని ఎవరైనా ఆహారం పంపించినా తీసుకోడు. ఎవరి సహాయం అర్థించడు.నన్ను నేను చూసుకోగలను. జీవితం ఎలా తీసుకువెళ్తే అలా వెళ్తాను అనుకుంటాడు.

తన జీవిత అనుభవాలను, పర్యటనానుభవాలను రాయడం మొదలు పెట్టాడు. రాయడానికి చేతులు సహకరించడం లేదు. 24 గంటలు తనతో ఉండే విధంగా ఒక సహాయకుడిని నియమించుకున్నాడు. గత జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుంటూ చెబుతుంటే సహాయకుడు రాశాడు. కొన్ని జ్ఞాపకం రాకపోయినా బాధపడలేదు. రాయడం ఆపలేదు.

సూరజ్‌కు భవిష్యత్ గురించి భయాలు లేవు, దిగుళ్లు లేవు. నేను ప్రతిదీ చేయగలను. చేస్తాను అనుకుంటాడు. నేనున్నంత వరకు చురుకుగా ఉండాలి. ఇతరులకు సహాయం చేసే విధంగా జీవించాలి. ఉంటాను అని తనకు తాను పదే పదే చెప్పుకుంటాడు. ప్రేరణ కలిగించుకుంటూ ఉంటాడు.

చివరి శ్వాస వరకు తన పని తాను చేసుకో వాలని అనుకుంటాడు అతను. ఓపిక శక్తి ఉన్నప్పుడు వయసు గురించి చూడకుండా పని చేయాలంటాడు.

నేను అనుకున్నది నేను సాధించుకున్నానని గర్వపడతాడు. నేను దేనికోసం బాధపడాల్సింది, భయపడాల్సింది ఏమి లేదనే దృక్పథంతో ముందుకు సాగుతున్న సూరజ్ మరో ప్రయాణానికి సన్నద్ధమవుతున్నాడు.

అయితే ఈ సారి ఒంటరిగా కాదు. తన సహాయకుడితో.

* * *

జీవితం మీద ఆశ, ఆశావాహ దృక్పథం బలంగా ఉంటే ఈ ప్రపంచం మనదేనేమో?!


దృఢ సంకల్పం, పరిస్థితులకు ఎదురొడ్డి నిలబడే తత్త్వమే అతని రోగాన్ని వెనక్కి నెట్టేస్తున్నదేమో ?!

ఏదేమైనా అతని దృక్పథానికి హ్యాట్సాఫ్.

వచ్చేవారం కథ..

**చేనేత మగ్గం**

– ఎస్. నాగేందర్‌నాథ్ రావు



ప్రపంచంలోనే అత్యంత భాగ్యవంతమైన క్రికెట్ లీగ్ ఐపీఎల్‌లో తెలుగు రాష్ట్రాల ఆటగాళ్లు పలు ఫ్రాంచైజీల తరపున కీలకభూమిక పోషిస్తూ ఉనికిని, సత్తాను చాటుకొంటున్నారు.




# ఐపీఎల్-18లో తెలుగు తేజాలు..

భారత క్రికెట్ అభిమానుల వేసవి వినోదం ఐపీఎల్ గత 18 సీజన్లుగా కోట్లాది మందిని అలరిస్తూ వస్తోంది. వివిధ దేశాలకు చెందిన వందలాది మంది ఆటగాళ్ల ప్రతిభను చాటుకొంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు. దానికి తెలుగు రాష్ట్రాల క్రికెటర్లు సైతం ఏ మాత్రం మినహాయింపు కాదు.

2008 ప్రారంభ ఐపీఎల్‌లో హైదరాబాదీ మణికట్టు మాంత్రికుడు వీవీఎస్ లక్ష్మణ్, ఆ తరువాత విశాఖ బ్యాటర్ వై.వేణుగోపాలరావు ప్రవేశంతో ప్రారంభమైన తెలుగు క్రికెటర్ల పరంపర దిగ్గజ బ్యాటర్ అంబటి రాయుడితో పతాకస్థాయికి చేరింది. ప్రస్తుత సీజన్ (2025) నాటికి తెలుగు రాష్ట్రాల ఆటగాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

### 2008 నుంచి 2025 వరకూ....

ఐపీఎల్ ప్రారంభ సీజన్ నుంచి ప్రస్తుతం వరకూ తెలుగు క్రికెటర్లు ఒకటి లేదా అంతకు మించి ఎక్కువ ఫ్రాంచైజీల జట్లకు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉన్నారు. ప్రస్తుత ఐపీఎల్‌లో ఐదుసార్లు విజేత ముంబై ఇండియన్స్ తరపున ఆంధ్ర యువ ఆల్ రౌండర్ సత్యనారాయణరాజు, మరో దిగ్గజ జట్టు చెన్నై సూపర్ కింగ్స్ తరపున కుర్ర ఓపెనర్ షేక్ రషీద్ అరంగేట్రం మ్యాచ్‌లు ఆడారు. అంతర్జాతీయ క్రికెటర్లు తిలక్ వర్మ ముంబైకి, స్టార్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ గుజరాత్ టైటాన్స్‌కు, ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ సన్ రైజర్స్ జట్లకు ఆడుతుండ డంతో తెలుగు రాష్ట్రాల క్రికెటర్లు ఐదుగురు ఐపీఎల్ బరిలో నిలిచినట్లయ్యింది. ఒకే సీజన్లో ఇలా పాల్గొనటం గత 18 సీజన్లలో ఇదే మొదటిసారి.



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

డెక్కన్ చార్జర్స్, హైదరాబాద్ సన్ రైజర్స్ జట్ల తరపున పలువురు హైదరాబాద్, ఆంధ్ర రంజీ క్రికెటర్లు గతంలోనే ఐపీఎల్ బరిలో నిలిచారు. వీవీఎస్ లక్ష్మణ్, వై వేణుగోపాలరావు, అంబటి రాయుడు, హనుమ విహారి, రికీ బుయ్, మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి ఐపీఎల్ లో తమకంటూ ఓ ప్రత్యేకస్థానం సంపాదించు కోవడంతో పాటు..తెలుగు రాష్ట్రాల క్రికెట్‌కే గర్వకారణంగా నిలువ గలిగారు.

### గుంటూరు కుర్రాడి అరుదైన రికార్డు...

ఐపీఎల్ 18వ సీజన్‌తో అరంగేట్రం చేసిన 20 ఏళ్ల గుంటూరు కుర్రాడు షేక్ రషీద్ అరుదైన ఘనత సాధించాడు. మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలోని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరపున లక్నోలోని అటల్ బిహారీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో రషీద్ బరిలో నిలిచాడు. మరో యువ ఓపెనర్ రచిన్ రవీంద్రతో కలసి ఇన్నింగ్స్ ప్రారంభించి 27 పరుగుల వ్యక్తిగత స్కోరుతో మొదటి వికెట్‌కు 52 పరుగుల కీలక భాగస్వామ్యం నమోదు చేయడంలో తనవంతు పాత్ర నిర్వర్తించాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత పిన్నవయస్కుడైన ఓపెనర్‌గా రికార్డుల్లో చేరాడు. రషీద్‌ను రూ. 30లక్షల కనీస ధరతో చెన్నై ఫ్రాంచైజీ అవకాశం కల్పించింది.

### అంబటి రాయుడి తర్వాతే ఎవరైనా!

గత 18 సీజన్లుగా వివిధ ఫ్రాంచైజీల తరపున ఎందరో తెలుగు రాష్ట్రాల ఆటగాళ్లు బరిలో నిలిచినా అంబటి రాయుడి తర్వాతే ఎవరైనా. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లలో కీలక సభ్యుడిగా ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ ట్రోఫీలు అందుకొన్న ఘనత ఆతనికే దక్కుతుంది. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన తెలుగు క్రికెటర్‌గా అంబటి రాయుడేనని చెప్పాలి. ఐపీఎల్2023 ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై మ్యాచ్ తర్వాత రిటైర్మెంట్ ప్రకటించిన రాయుడు పలు అరుదైన ఘనతలు సాధించాడు. రాయుడి ఐపీఎల్ ప్రస్థానం 2010లో ముంబై ఇండియన్స్ తరపున మొదలైంది. 2018 నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కి ప్రాతినిధ్యం వహిస్తూ తన కెరియర్‌ను విజయవంతంగా ముగించగలిగాడు.

చెన్నై టైటిల్ గెలిచిన రెండు సీజన్లలో జట్టు సభ్యుడిగా కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 14 సీజన్ల పాటు రెండు దిగ్గజట్లకు ప్రాతినిధ్యం వహించిన రాయుడు మొత్తం 204 మ్యాచ్‌లు ఆడి, 11 ప్లే ఆఫ్స్, 8 ఫైనల్స్, 5 ట్రోఫీలు సాధించాడు. రాయుడు 127 స్ట్రయిక్ రేటుతో 4వేల 329 పరుగులు సాధించాడు. ముంబై తరపున 114 మ్యాచ్‌ల్లో 2416 పరుగులతో 14 అర్థశతకాలు నమోదు చేశాడు.

2018 నుంచి చెన్నై తరపున ఆడిన 90 మ్యాచ్‌ల్లో 30.18 సగటుతో 1932 పరుగులు సాధించాడు. ఇందులో ఓ శతకం, ఎనిమిది అర్థశతకాలున్నాయి. 2018 సీజన్లో అత్యధికంగా 16 మ్యాచ్‌ల్లో 602 పరుగులతో 43.00 సగటు సాధించాడు.

2013, 2015, 2017 సీజన్లలో ముంబై తరపున, 2018, 2021, 2023 సీజన్లలో చెన్నై తరపున ఐపీఎల్ చాంపియన్ ట్రోఫీలు అందుకోడం ద్వారా రాయుడు తనకుతానే సాటిగా నిలిచాడు.

ప్రస్తుతం ముంబై ఫ్రాంచైజీకి ఆడుతున్న తిలక్ వర్మ, అహ్మదాబాద్ ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న మహ్మద్ సిరాజ్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో నిలకడగా రాణిస్తూ తెలుగువారి సత్తాను చాటుతున్నారు. సిరాజ్‌ను గుజరాత్ వేలం ద్వారా రూ. 12.25కోట్లకు దక్కించుకోగా... తిలక్ వర్మకు ముంబై ఫ్రాంచైజీ రూ. 8 కోట్లు చెల్లిస్తోంది. హైదరాబాద్ ఫ్రాంచైజీకి ఆడుతున్న విశాఖ ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి రూ. 6 కోట్లు అందుకొంటున్నాడు. రానున్న కాలంలో ఐపీఎల్‌లో పాల్గొనే తెలుగు రాష్ట్రాల క్రికెటర్ల సంఖ్య మరింత పెరిగినా ఆశ్చర్యం లేదు. ★

**ప్రజాస్వామ్యంలో రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ జోడెద్దుల్లా సాగాల్సిన ప్రభుత్వం, కోర్టుల మధ్య ఇటీవల భేదాభిప్రాయాలు నెలకొనేలా వాతావరణం ఏర్పడడం దురదృష్టకరం. ఈ రెండు వ్యవస్థలు దేనికవే అత్యున్నతమైనవి. ఒకరికొకరు సహకరించుకుంటూ పాలన సాగించాల్సిన ఈ వ్యవస్థల మధ్య పొరపొచ్చలు వచ్చేలా ఇటీవల కొన్ని ఘటనలు జరిగాయి. దేశంలోనే అత్యున్నత స్థానాలైన రాష్ట్రపతి, సుప్రీం కోర్టు ఇందులో పాత్రలైనాయి. కేంద్రంతో నిత్యం ఘర్షణ పడే తమిళనాడులోని డీఎంకే సర్కార్, ఆ రాష్ట్ర గవర్నర్ మధ్య విభేదాలు సుప్రీం కోర్టుకు చేరడంతో అదికాస్తా ఇటు అటు పోయి రాష్ట్రపతి, ధర్మాసనం మధ్య అభిప్రాయభేదాలు కలిగించే వాతావరణం ఏర్పడింది.**



# రెండు వ్యవ

తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం, రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి మధ్య పలు అంశాలపై, బిల్లులపై దీర్ఘకాలికంగా కొనసాగుతున్న వివాదాల కేసులో జస్టిన్ జె.బి.పార్దివాలా, జస్టిన్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఏప్రిల్ 13, 2025న తీర్పు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు పంపే బిల్లులపై మూడు నెలల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని గవర్నర్లతో పాటు రాష్ట్రపతికి కూడా గడువు విధించడం దేశంలో సంచలనం రేపింది. దీనిపై అనుకూల, ప్రతికూల స్పందనలు వెలువడు తున్నాయి. తాత్కాలిక రాజకీయాల దృష్ట్యా ఆయా రాజకీయ పార్టీలకు ఈ అంశంపై ఏదో ఒక అభిప్రాయం ఉన్నా అత్యున్నతమైన రాష్ట్రపతి, సుప్రీం కోర్టు మధ్య భేదాభిప్రాయాలు, ఘర్షణ ఏర్పడకుండా ఉంటేనే మంచిది. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన అనంతరం కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ రాష్ట్రపతికి గడువు విధించడం న్యాయస్థానం మితిమీరిన జోక్యంగా వ్యాఖ్యానించగా, ఏప్రిల్ 17, 2025న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఒక సమావేశంలో ప్రసంగిస్తూ రాష్ట్రపతిని సుప్రీం కోర్టు ఆదేశించలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న దశలో ఒకరి విధుల్లో మరొకరు జోక్యం చేసు కోవడంపై ఈ రెండు వ్యవస్థల మధ్య ఉన్న పరిమితు లపై పెద్ద ఎత్తున చర్చోపచర్చలు ప్రారంభమయ్యాయి.

ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ ఈ తీర్పుపై మాట్లాడుతూ సుప్రీం కోర్టుకు పూర్తి అధికారాలిచ్చిన రాజ్యాంగంలోని 142వ అధికర ణాన్ని కోర్టు క్షిపణిలా ఉపయోగించుకుంటూ రాష్ట్రపతికి గడువు విధించిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామంటూ ప్రమాణం చేసే జడ్జీలు ఏ ప్రాతిపదికన దేశంలో అత్యంత ఉన్నతపదవైన రాష్ట్రపతికి ఆదేశాలిస్తారని ప్రశ్నించారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉంటుంది. న్యాయవ్యవస్థనే చట్టం రూపొందించడంలో కల్పించుకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాలపై చట్టసభల్లో ప్రశ్నించే అవకాశాలుంటాయి. అదే న్యాయ వ్యవస్థయే నిర్ణయం తీసుకుంటే ఎవరిని అడగాలని ఉప రాష్ట్రపతి ప్రశ్నించారు.

ధన్‌ఖడ్ మరో అడుగు ముందుకేసి ఇటీవల జరిగిన ఒక ఉదంతాన్ని ప్రస్తావిస్తూ ఆయన న్యాయ వ్యవస్థపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో కాలిన నోట్ల కట్టల అంశాన్ని ఆయన ఈ సందర్భంగా లేవనెత్తుతూ న్యాయ వ్యవస్థ జవాబుదారీతనం ప్రశ్నించారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ముగ్గురు న్యాయమూర్తులతో జరిపే అంతర్గత విచారణకు చట్టబద్ధత ఉంటుందా అని ప్రశ్నించారు. ఇటువంటి ఘటనల్లో దర్యాప్తు చేయవలసింది కార్యనిర్వాహక వ్యవస్థే గానీ న్యాయవ్యవస్థ కాదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సిజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో కొలీజియం సమావేశమై యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. జగదీప్ దన్‌ఖఢ్ వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడలేము. సుప్రీం కోర్టులో ప్రధానంగా రాజ్యాంగం చట్టంపై ప్రాక్టిస్ చేసిన న్యాయవాదిగా ఆయనకు గుర్తింపు ఉంది. మరోవైపు ఆయన గతంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు ఈయనకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పలు సందర్భాల్లో విభేదాలు వచ్చాయి. దన్‌ఖఢ్ న్యాయవాదిగానే కాకుండా గవర్నర్‌గా కూడా ప్రత్యక్షంగా అనుభవాలు ఎదుర్కొన్న ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఎంతో విలువైనవి. వాటిని రాజకీయ దృష్టితో పూర్తిగా కొట్టేయలేము.

రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీం కోర్టు గడువు విధించే అంశంపై దన్‌ఖఢ్ కంటే ముందు కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ స్పందిస్తూ ఇందులో కోర్టు అభిప్రాయాన్ని తప్పుపట్టారు. ఆయన ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించాలా..? వద్దా..? అనేది పూర్తిగా పార్లమెంట్ పరిధిలోని అంశమని అభిప్రాయపడ్డారు. గౌరవ కోర్టులే అన్నింటినీ నిర్ణయిస్తే చట్టసభల అవసరమేముందని ఆయన ప్రశ్నించారు. ఈ అంశాన్ని ఇద్దరు జడ్జీల బెంచీ కాకుండా విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాల్సిందని ఆయన అభిప్రాయపడడంలో తప్పు లేదు. బిల్లుల ఆమోదానికి రాజ్యాంగం గవర్నర్లకు ఎలాంటి గడువు విధించలేదన్నారు. చట్టాన్ని పార్లమెంట్ మెజార్టీతో ఆమోదిస్తే, ఇద్దరు జడ్జీలు కోర్టులో నిర్ణయాలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. సుప్రీం కోర్టుతో పాటు దేశంలోని పలు హైకోర్టులలో వివిధ కేసులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు పలు కారణాలున్నట్టే గవర్నర్లకు కూడా బిల్లులపై వివిధ కారణాలుంటాయని రాజేంద్ర ఆర్లేకర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కేరళ గవర్నర్‌గా ఉన్న ఆర్లేకర్‌కు అక్కడి వామపక్ష ప్రభుత్వంతో వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలున్నాయి. ఆ అనుభవంతోనే ఆయన సుప్రీం కోర్టు తీర్పుపై స్పందించారు.

సుప్రీం కోర్టు తీర్పుపై భిన్నాభిప్రాయాలున్నాయి. బీజేపీయేతర రాజకీయ పార్టీలు ఈ తీర్పును స్వాగతించాయి. కాంగ్రెస్ నేత కపిల్ సిబాల్ ఉప రాష్ట్రపతి దన్‌ఖఢ్ స్పందనను తప్పుపట్టారు. రాజకీయ పార్టీల మధ్య ఈ తీర్పుపై భిన్నాభిప్రాయాలుండడానికి ప్రధాన కారణం ఈ బిల్లులపై రాజకీయ ప్రయోజ నాలు ఉండడమే. ముఖ్యంగా బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలకు అక్కడి గవర్నర్లకు మధ్య కొన్ని వివాదాస్పద బిల్లులపై పోరు నడుస్తోంది. నామినేటెడ్ పోస్టులు, యూనివర్సిటీలకు



# స్థలూ సుప్రీమే

సంబంధించినవి ఇందులో ఉన్నాయి. ఉదాహరణకు తమిళనాడులో మద్రాస్ విశ్వవిద్యాలయం సవరణ బిల్లును డీఎంకే ప్రభుత్వం ఏప్రిల్, 2022లో ఆమోదించింది. ఈ బిల్లు వీసీ నియామకంతో పాటు గవర్నర్‌ను చాన్సలర్ పదవి నుండి తొలగించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కట్టపెట్టేందుకు ఉద్దేశించింది. ఈ బిల్లులో గవర్నర్‌ను పక్కన పెట్టడంతో ఆయన దీన్ని పెండింగ్‌లో పెట్టారు. ఇక్కడ గమనించాల్సిన విషయం గవర్నర్ పెండింగ్ పెట్టిన ఈ బిల్లుకు కాలం ముగిసిందని పేర్కొంటూ సుప్రీం కోర్టు తక్షణమే దానిని చట్టంగా మారుస్తూ తీర్పు ఇచ్చింది. తీర్పులో భాగంగానే సుప్రీం కోర్టు వివాదాస్పదమైన ఈ బిల్లులో గవర్నర్‌ను చాన్స్‌లర్‌గా తొలగించడంపై కూడా విచారణ జరిపితే పరిస్థితి మరోలా ఉండేది.

చాన్స్‌లర్‌గా గవర్నర్‌ను తొలగించిన ఈ బిల్లుతో పాటు తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి సుదీర్ఘకాలంగా 10 బిల్లులను పెండింగ్‌లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం లేకుండానే ఈ బిల్లులన్నింటినీ ఆమోదించినట్లు పరిగణించాలని అధికరణ 142 విచక్షణాధికారాలతో తీర్పు ఇచ్చింది. ఈ బిల్లులపై ఇకపై రాష్ట్రపతి ఎలాంటి చర్యలు తీసుకున్నా అవి చెల్లుబాటు కావంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం సంచలనం రేపింది. తీర్పు కాపీని సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే సమయం కోసం కాచుకొని కూర్చున్న స్టాలిన్ ప్రభుత్వం ఈ బిల్లులపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి, అవి చట్టరూపం దాల్చినట్టు ప్రకటించిందంటే ఇందులో రాజకీయ ఉద్దేశాలు స్పష్టం అవుతున్నాయి. న్యాయస్థానాలు రాజకీయాలకు అతీతంగా తీర్పులు ఇస్తాయి. అయితే వీటిని రాజకీయ పార్టీలు స్వలాభం కోసం వాడుకుంటాయని మరోసారి బహిర్గతమైంది.

గతంలో పశ్చిమ బెంగాల్‌లో కూడా యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్‌గా గవర్నర్ బదులు ముఖ్యమంత్రిని నియమించేలా రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ నిర్ణయం తీసుకుంటూ బిల్లును పాస్ చేయడంతో అక్కడ ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య ఘర్షణ ప్రారంభమైంది. గవర్నర్ ఈ బిల్లును పెండింగ్‌లో పెట్టడంపై అప్పుడు కూడా న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. పశ్చిమబెంగాల్ తరహాలో తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం కూడా యూనివర్సిటీల చైర్‌పర్సన్‌కు సంబంధించి ఇలాంటి నిర్ణయమే తీసుకుందంటే ఇందులో రాజకీయాలు సుస్పష్టం. యూనివర్సిటీలకు వైస్‌చాన్స్‌లర్‌గా గవర్నర్ ఉండడమనే సంప్రదాయం మొదటి నుండి కొనసాగుతుంది. దీనికి భిన్నంగా స్వలాభ రాజకీయ దృష్టితో సంప్రదాయాలకు వ్యతిరేకంగా గతంలో పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అప్పుడే న్యాయస్థానం ఫుల్‌స్టాప్ పెట్టుంటే అనంతరం

> **ఆర్టికల్ 154వ అధికరణ ప్రకారం రాష్ట్ర పరిపాలనకు సంబంధించి కార్యనిర్వహణ ధికారాలు ఆర్టికల్ 162 ప్రకారం గవర్నర్ పేరు మీద చట్టాలను ప్రభుత్వం విడుదల చేస్తుంది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులు గవర్నర్ ఆమోదించిన తర్వాతనే చట్టాలుగా మారుతాయి. ఒకవేళ గవర్నర్ బిల్లును ఆమోదించకపోతే అది చట్టం రూపం దాల్చదు.**

తమిళనాడు కూడా ఇలాంటి నిర్ణయం తీసుకునేది కాదు. గవర్నర్ ప్రభుత్వం మధ్య విభేదాలు కూడా కొంత తగ్గేవి. ఇంతకుముందు పంజాబ్‌లో కూడా ఆప్ ప్రభుత్వం, గవర్నర్ మధ్య ఘర్షణ జరిగింది. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ప్రభుత్వం తెచ్చిన ఒక బిల్లును రాష్ట్ర గవర్నర్ బి.ఎల్.పురోహిత్ పెండింగ్‌లో పెట్టడంపై సుప్రీం కోర్టు వ్యాఖ్యానిస్తూ ఆర్టికల్ 200 అధికరణతో గవర్నర్ బిల్లులను పరిశీలన పేరుతో పెండింగ్‌లో పెట్టినా వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకునేందుకు ప్రయత్నించాలని వ్యాఖ్యానించింది. లేకపోతే సవరణలు కోరితే బిల్లును పునఃసమీక్ష కోసం ప్రభుత్వానికి తిరిగి పంపాలని చెప్పింది.

బిల్లులపై రాజ్యాంగం గవర్నర్లకు ప్రత్యేక అధికారాలు కల్పించింది. రాజ్యాంగంలోని 153వ అధికరణ ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉంటారు. ఆర్టికల్ 154వ అధికరణ ప్రకారం రాష్ట్ర పరిపాలనకు సంబంధించి కార్యనిర్వహణాధికారాలు ఆర్టికల్ 162 ప్రకారం గవర్నర్ పేరు మీద చట్టాలను ప్రభుత్వం విడుదల చేస్తుంది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులు గవర్నర్ ఆమోదించిన తర్వాతనే చట్టాలుగా మారుతాయి. ఒకవేళ గవర్నర్ బిల్లును ఆమోదించకపోతే అది చట్ట రూపం దాల్చదు. గవర్నర్ బిల్లును సభకు తిప్పి పంపితే, చట్టసభ సవరణలతో ఆ బిల్లును మళ్లీ గవర్నర్‌కి పంపితే దాన్ని తప్పనిసరిగా ఆమోదించాలి. లేకపోతే ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి గవర్నర్ రిజర్వు చేయవచ్చు. రాష్ట్రపతి వద్దకు బిల్లును పంపిన తర్వాత దానిపై గవర్నర్‌కు ఎలాంటి పాత్ర ఉండదు. అయితే రాష్ట్రపతి ఆ బిల్లును పునఃపరిశీలనకు పంపవచ్చు. అయితే గవర్నర్ ముందస్తు అనుమతితోనే రాష్ట్ర శాసనసభలో ద్రవ్య బిల్లును ప్రవేశపెడుతారు కాబట్టి సాధారణంగా ద్రవ్య బిల్లులో వివాదాలుండవు.

రాష్ట్ర బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి వీటో అధికారాలున్నాయి. గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు బిల్లును పంపితే రాష్ట్రపతి ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. లేదా పున:పరిశీలన కోసం తిరిగి శాసనసభకు పంపమని గవర్నర్‌ను కోరవచ్చు. అయితే రాష్ట్ర శాసనసభ ఎలాంటి సవరణలు లేకుండా తిరిగి ఆ బిల్లును రాష్ట్రపతికి పంపితే దాన్ని రాష్ట్రపతి ఆమోదించాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా అలాంటి బిల్లును రాష్ట్రపతి ఎంతకాలం తమ వద్ద పెట్టుకోవచ్చనే విషయం రాజ్యాంగంలో పేర్కొనలేదు. అంటే ఈ బిల్లులకు రాష్ట్రపతి పాకెట్ వీటోను వినియోగించుకునే అవకాశం ఉంది.

అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడంతో రాజకీయ పార్టీలు దీన్ని దుర్వినియోగ పరిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఉత్తర్వులను ఒక అవకాశంగా తీసుకొని వివాదాస్పద అంశాలను కూడా రాజకీయ పార్టీలు బిల్లులుగా మార్చే ప్రమాదం కూడా లేకపోలేదు. ఈ తీర్పు దుర్వినియోగం కాకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. సుప్రీం కోర్టు ఈ తీర్పులో గవర్నర్లతో పాటు రాష్ట్రపతికి కూడా గడువు విధించడంతో భిన్నమైన వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సుప్రీం కోర్టు తీర్పు రాష్ట్రపతిని కాకుండా గవర్నర్‌కే పరిమితం చేసుంటే బాగుండేది. అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పుతో ఎవరిది పైచేయి అనేది నిర్వివాదాంశం. దేశంలో రెండు వ్యవస్థలు సుప్రీమే అనడంలో ఎలాంటి సందేహాలు లేవు. దేశానికి రెండు కళ్ల లాంటి ప్రభుత్వం, న్యాయస్థానం మధ్య పొరపొచ్చలు రాకుండా సమప్రాధాన్యతతో కలిసికట్టుగా సాగాలని భారతీయులందరూ కోరుకుంటున్నారు.

– శ్రీపాద

# బాల జాగృతి

## బాల భక్తులు

## శ్రావణ కుమారుడు



శంతనుడు, జ్ఞానావతి ముని దంపతుల కుమారుడు శ్రావణుడు. అంధులైన కన్నవారిని ప్రత్యక్ష దైవాలుగా భావించి వారి సేవలో తరించాడు. వారిని కావడిలో ఉంచి తీర్థయాత్రకు బయలుదేరాడు. మార్గమధ్యంలో వారి దప్పిక తీర్చేందుకు, నీటి కోసం సమీపంలోని సరస్సుకు వెళ్లాడు. వేటకు వచ్చిన కోసలరాజు దశరథుడు, నీటి బుడగల శబ్దం విని జంతువుగా భావించి బాణప్రయోగం చేస్తాడు. అతను మునికుమారుడని తెలిసి చింతిస్తాడు. బాలుడి విన్నపం మేరకు ఆయన ఆ నీటిని ముని దంపతులకు అందచేస్తాడు. దశరథుడి ద్వారా విషయం విన్న మునిదంపతులు 'పుత్రశోకంతో మేము తనువు చాలిస్తున్నట్లే నీకూ ఆ అనుభవం కలుగుతుంది' అని శపించారు. ఆ ప్రకారమే, రామలక్ష్మణులు వనవాసంలో, భరత శత్రుఘ్నులు మేనమామ ఇంట ఉన్నప్పుడే దశరథుడు తనువు చాలించడం ద్వారా ముని శాపం నిజమైందని రామాయణ గాథ.

## కథ — నిర్లక్ష్యం పనికిరాదు!

సమయం ఎంతో విలువైనది. ఏ సమయంలో చేయవలసిన పనిని అదే సమయంలో చేయాలి. లేకుంటే అదృష్టం చేజారవచ్చు.

అనిత ఏడో తరగతి చదువుతోంది. తెలివైన అమ్మాయి. చక్కగా చదువుతుంది, చక్కగా పాడుతుంది కూడా. కానీ ఆమెకు నిర్లక్ష్యం, బద్ధకం ఎక్కువ. ప్రతి పనీ వాయిదా వేస్తుంటుంది. "అలా చేయవద్దు" అని వాళ్లమ్మ ఎన్నోసార్లు అనితను హెచ్చరించింది. కానీ అనిత నిర్లక్ష్యంతో పట్టించుకునేది కాదు.

ఒకసారి వాళ్ల ఊళ్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అన్ని స్కూళ్ల విద్యార్థులకు పాటలు, ఆటల పోటీలు పెట్టారు. అనిత పాటల పోటీలో పాల్గొంది. అందులో ఆమెకు మొదటి బహుమతి వచ్చింది. కొన్నిరోజుల తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన సంస్థ నుండి అనితకు ఉత్తరం వచ్చింది.

గత నెలలో జరిగిన పాటల పోటీలో మొదటి బహుమతి వచ్చినందుకు మరునాడు తమ కార్యాలయానికి వచ్చి బహుమతి తీసుకోవలసిందిగా రాశారు ఆ ఉత్తరంలో.



## పద్యము

**నేరనన్నవాఁడె నేర్పరి మహిలోన**
**నేర్తునన్నవాఁడు నిందఁజెందు**
**ఊరకున్నవాఁడె యుత్తము యోగిరా!**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**భావం :** తెలివిగలవాడు తనకేమి తెలియదని నిదానంగా మాట్లాడుతాడు. తెలివిగలవాడు రుషి వలె మౌనంగా ఉంటాడు. తెలివి తక్కువవాడు అన్ని తెలిసినట్లు నటిస్తూ ఉంటాడు. చివరకు అపనింద పాలవుతాడు.

## శ్లోకము

**ధర్మో భూతదయా కిం**
**సౌఖ్యమరోగితా జగతి**
**జంతోఃకః స్నేహః సద్భావః**
**కిం పాండిత్యం పరిచ్ఛేదః**

**భావం :** ధర్మం అంటే భూతదయ కలిగి ఉండడం, సుఖం అంటే అనారోగ్యం లేకపోవడం, స్నేహం అంటే నమ్మకం కలిగి ఉండడం, పాండిత్యం అంటే వివేకం కలిగి ఉండడం అని గ్రహించాలి.


## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| పైకారా | కడెం |
| ధువరన్ ధార్ | కావేరి |
| డుడుమా | నర్మదా |
| చిత్రకూట్ | మాచ్‌ఖండ్ |
| కుంతల | ఇంద్రావతి |

జవాబులు : పైకారా-కావేరి; ధువరన్ ధార్-నర్మదా; డుడుమా-మాచ్‌ఖండ్; చిత్రకూట్-ఇంద్రావతి; కుంతల-కడెం.

## శాస్త్రవేత్తలు



### హరగోవింద్ ఖొరానా
### (1922-2011)

హరగోవింద్ ఖొరానా భారత సంతతికి చెందిన అమెరికా జీవకణ శాస్త్రవేత్త. జన్యుకోడ్‌ను వివరించినందుకు ఖొరానాకు **1968**లో నోబెల్ బహుమతి వచ్చింది. ప్రొటీన్ సంశ్లేషణలో జన్యుకోడ్ పాత్రను కూడా వివరించారు. నైరెన్‌బర్గ్ ప్రతిపాదించిన జన్యుకోడ్ నమూనాను ఖొరానా ధ్రువీకరించారు. మానవ కణాల్లో డీఎన్ఏ విశిష్టతను తన ప్రయోగాల ద్వారా వివరించారు.



అనిత ఆ ఉత్తరాన్ని పెద్దగా పట్టించుకోలేదు. తరువాత ఎప్పుడైనా వెళ్లి బహుమతి తెచ్చుకోవచ్చులే అనుకుని, మర్నాడు వెళ్లకుండా నాలుగు రోజుల తరవాత వెళ్లింది.

ఆ సంస్థ వారు బహుమతితో పాటు పట్టణంలో జరుగుతున్న పెద్ద సర్కస్ చూడ్డానికి రెండు టికెట్లు కూడా ఇచ్చారు.

అయితే ఆ టికెట్టు అంతకు ముందు రోజు జరిగిన ఆటవి. అనిత అది చూసుకుని 'అయ్యో! కనీసం నిన్న వచ్చినా బావుండేది కదా!' అని బాధపడింది.

ఈ సంఘటనతో అనితలో ఎంతో మార్పు వచ్చింది. నిర్లక్ష్యంగా ఉండకుండా, ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయడం ప్రారంభించింది. ★

## జనరల్ నాలెడ్జ్



1. ప్రపంచ ఓజోన్ దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
2. హాకీ విజార్డ్ అనే బిరుదు కలిగిన భారత క్రీడాకారుడు ఎవరు?
3. భారతదేశంలో అతిపెద్ద విశ్వవిద్యాలయం ఏది?

సమాధానాలు : 1. సెప్టెంబర్ 16; 2. మేజర్ ధ్యాన్‌చంద్; 3. కలకత్తా విశ్వవిద్యాలయం.

## మెదడుకు మేత



ఇంతింత ఆకు,
ఇంపైన ఆకు,
రాజులు మెచ్చిన
రత్నాల ఆకు?

జవాబు : తమలపాకు

## మంచిమాట



**తోటివారితో కలిసి నడుస్తూనే వారిని తన దారిలో నడిపించడమే నాయకత్వం**



# వారఫలాలు 28 ఏప్రిల్-04 మే 2025




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

కొన్ని కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు. దైవ కార్యాలలో పాల్గొంటారు. రావలసిన సొమ్ము అందుకుంటారు. బంధువుల మధ్య వివాదాలు సర్దుబాటు కాగలవు. వ్యాపారులకు అనుకున్న లాభాలు. ఉద్యోగులకు హోదాలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు అప్రయత్న కార్యసిద్ధి. రచయితలకు శుభవార్తలు. 3,4 తేదీల్లో వృథా ఖర్చులు. దూర ప్రయాణాలు. రాఘవేంద్రస్వామి స్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఎంతటి సమస్య ఎదురైనా నేర్పుగా అధిగమిస్తారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. సోదరులు, సోదరీలతో కష్టసుఖాలు పంచుకుంటారు. స్థిరాస్తి వివాదాలపై బంధువులతో చర్చిస్తారు. వ్యాపారులకు ఊహించని లాభాలు అందుతాయి. కొత్త ఒప్పందాలు చేసుకుంటారు. క్రీడాకారులు, పరి శోధకుల యత్నాలు సఫలం. 28,29 తేదీలలో అనారోగ్యం. కుటుంబంలో ఒత్తిడులు. శివారాధన మంచిది.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు అనుకూల ఫలితాలు రావచ్చు. భూముల క్రయవిక్రయాల ద్వారా కూడా సొమ్ము సమకూరుతుంది. కుటుంబసభ్యుల ఆరోగ్యం కుదుటపడి ఊరట. ఉద్యోగులు కొత్త హోదాలు. విధి నిర్వహణలో ఆటంకాలు అధిగమిస్తారు. రచయితలకు నూతనోత్సాహం. 2,3 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. ఆదిత్య హృదయం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

వాహనాలు, భూములు కొంటారు. నిరుద్యోగులు ఉద్యోగాలు సాధిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. బంధువులు మీపై ఉంచిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభకార్యాలు జరుగుతాయి. పెట్టుబడులు ఊహించని విధంగా అందుతాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలు సత్తా చాటుకుంటారు. కళాకారులు, క్రీడాకారుల సేవలు విస్తృతమవుతాయి. 1,2 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. అప్పులు చేస్తారు. శివాష్టకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురు కావచ్చు. రావలసిన సొమ్ము అందుకుంటారు. ఆరోగ్యం మెరుగుపడి ఊరట లభిస్తుంది. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలలో పురోగతి సాధిస్తారు. నూతన పెట్టుబడులు అందుకుంటారు. రచయితలు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 29,30 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ఇంటిలో అకారణ వైరం. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. విద్యార్థులు మరిన్ని అనుకూల ఫలితాలు సాధిస్తారు. సొమ్ముకు లోటుఉండదు. కుటుంబంలో మీ ప్రతిభను అంతా గుర్తిస్తారు. సంతానపరంగా ఇబ్బందులు తొలగుతాయి. వ్యాపారాలు క్రమేపీ లాభించి వృద్ధి చెందుతాయి.క్రీడాకారులు, పరిశోధకుల కృషి ఫలిస్తుంది. 28,29 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. స్వల్ప అనారోగ్యం. రామరక్షాస్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

డబ్బుకు లోటు లేకుండా గడుపుతారు. కుటుంబంలో పెద్దల సూచనలు పాటిస్తారు. అందరిలోనూ మీ సత్తా నిరూపించుకుంటారు. వ్యాపారులు కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. ఉద్యోగులు అంచనాలు నిజం చేసుకుంటారు. కళాకారులకు మరింత ఉత్సాహం. రచయితలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 30,1 తేదీలలో బంధువులతో తగాదాలు. ఆరోగ్యభంగం. గణేత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి కుటుంబంలో అందరి ఆదరణ పొందుతారు. పెద్దల ఆరోగ్యం కుదుటపడుతుంది. ఉద్యోగులకు ప్రత్యేక హోదాలు రాగలవు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు అంచనాలు నిజం కాగలవు. రచయితలు, క్రీడాకారులకు శుభవార్తలు. 3,4 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు చేపట్టి సమయానుసారం సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటి నిర్మాణాలపై కుటుంబ సభ్యులతో చర్చిస్తారు. ఉద్యోగులకు సమస్యలు తీరి మనశ్శాంతి చేకూరుతుంది. అధికారులు మీపట్ల సానుకూలత వ్యక్తం చేస్తారు. కళాకారులు, క్రీడా కారులు సమర్థతను చాటుకుంటారు. 2,3 తేదీలలో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఎంతటి బాధ్యత అప్పగించినా పట్టుదలతో నెరవేరుస్తారు. ఆస్తి వివాదాలను అత్యంత నేర్పుగా పరిష్కరించుకుంటారు. ప్రారంభంలో కొంత నత్తనడకన సాగినా క్రమేపీ పుంజుకుంటాయి. పైస్థాయి వారి నుంచి అనుకూల సందేశం. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు అనుకున్నది సాధిస్తారు. 29,30 తేదీల్లో అనారోగ్యం. స్నేహితులతో తగాదాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఇంతకాలంపడిన ఆర్థిక ఇబ్బందులు తీరతాయి. రావలసిన డబ్బు అందు తుంది. వివాహాది శుభకార్యాలు నిర్వహిస్తారు. రాజకీయవేత్తలు, కళాకారులు అనుకున్న అవకాశాలు సాధిస్తారు. రచయితలు మంచి గుర్తింపు పొందుతారు. 30,1 తేదీల్లో మానసిక ఆందోళన. స్నేహితులతో తగాదాలు. పంచముఖ ఆంజనేయ స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

బంధువులతో మాటపట్టింపులు. కుటుంబ సభ్యుల నుంచి కొన్ని సమస్యలు. శారీరక రుగ్మతలు కొంత ఇబ్బంది పెట్టవచ్చు. వ్యాపారులకు నిరాశాజనకంగా ఉంటుంది. లాభాలు అంతగా కనిపించవు. ఉద్యోగులకు బాధ్యతలు మరింత పెరుగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులకు సమస్యలు తప్పక పోవచ్చు. క్రీడాకారులు, రచయితల యత్నాలు ముందుకు సాగవు. 30,1 తేదీల్లో శుభవార్తలు. ఆకస్మిక ధనలబ్ధి. అన్నపూర్ణాష్టకం పఠించండి.

# పదరసం – 511

**ఆధారాలు**

**అడ్డం**

1) విషయంపై గ్రహింపు, ఒడంబడిక (5)
5) "అటునుంచి" దిగితేగానీ ఇది తెలియదట(2)
7) చెదరిన గుర్తు (4)
8) మగ లక్షణాలుండే స్త్రీని ఇలా అనడం రివాజు (5)
10) స్త్రీలకు ఈ చీరలు చాలా ఇష్టం (2)
11) చరిత్ర (4)
12) ఎక్కువ తిరగబడింది (4)
15) దుర్మార్గపు పనికి అంతులేదు (2)
18) ఎండాకాలం వీచే వేడిగాలి (4)
20) ఇనుప పనివాడు తిరగబడ్డాడు (3)
21) ఎంచుట సరిగా లేదు (3)
22) చుట్టరికం, వివాహాది బాంధవ్యం బాలేదు(3)
24) చేసేవాడే తిరగబడ్డాడు (2)
25) ఈటె (2)
26) ఇబ్బంది, బాధ (2)
27) ఒడిశాలోని తెలుగు ప్రాంతం (4)
28) లేత (2)

**నిలువు**

1) విపత్కర స్థితులను ఎదుర్కొనడానికి సిద్ధం (4)
2) భయం, కంగారు (3)
3) ఈయన కూడా భీమునిలాగా వంట చేయడంలో దిట్ట (3)
4) అనగనగా రాగం, ..... రోగం అని సామెత (6)
6) మర్మం, ఆంతర్యం (3)
9) ప్రాయంలో ఉన్న స్త్రీ (3)
10) ఇష్టం, తృప్తి (3)
13) ముక్కలైన ముక్క (3)
14) అడ్డు (4)
16) ఏదైనా తీవ్రమైన సమస్య తరాల తరబడి ఉంటే దానిని రగులుతున్న .... అనడం రివాజు (5)
17) మార్పు (5)
19) పొలం దున్నేది తలకిందులైంది (3)
22) పసిడి (3)
23) ఆనందం, పండుగ (3)
26) కోపం (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | ■ | 4 | ■ | 5 | 6 |
| | ■ | | ■ | 7 | | | | ■ | |
| 8 | | | 9 | | ■ | | ■ | 10 | |
| | ■ | ■ | | ■ | 11 | | | | ■ |
| ■ | 12 | 13 | | 14 | ■ | | ■ | 15 | 16 |
| 17 | ■ | | ■ | 18 | | | 19 | ■ | |
| 20 | | | ■ | | ■ | ■ | 21 | | |
| | ■ | ■ | 22 | | 23 | ■ | | ■ | |
| 24 | | ■ | | ■ | 25 | | ■ | 26 | |
| | ■ | 27 | | | | ■ | 28 | | ■ |

**పదరసం - 510 సమాధానాలు**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| పొ1 | ర | పొ2 | చ్చా | లు3 | ■ | చి4 | త్త | రు5 | వు |
| దు | ■ | ల | ■ | రి6 | హ | ల | ■ | పు | ■ |
| పు7 | ర | మా | యిం | చు | ■ | వ8 | ల్ల | కా | దు9 |
| ■ | ■ | రు | ■ | కా10 | క | లు | ■ | ■ | త్త |
| గా11 | డి | ■ | పొ12 | ట్ట | ■ | ప | ■ | ధ13 | ■ |
| కు | ■ | ని14 | ■ | ■ | త15 | ల | మా | ని | కం |
| అం16 | త | ర్వా | హి | ని17 | ■ | వ | ■ | కు | ■ |
| డు | ■ | ణం | ■ | వు | ■ | లు18 | ము19 | డు | ఇ20 |
| ర21 | చ్చ22 | ■ | బీ23 | రు | వా24 | ■ | త్త | ■ | టు |
| ■ | ప25 | న్నా | గం | ■ | న26 | డ | వ | డి | క |

సినిమా

జాతీయ ఉత్తమ నటి విజయశాంతి పదిహేనేళ్ల గ్యాప్ తర్వాత మహేశ్ బాబు 'సరిలేరు నీకెవ్వరు' సినిమాతో ఐదేళ్ల క్రితం రీ-ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు కళ్యాణ్ రామ్ మూవీ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'లో కీలక పాత్ర పోషించింది. 35 సంవత్సరాల క్రితం వచ్చిన 'కర్తవ్యం' సినిమాలో ఐపీఎస్ వైజయంతిగా నటించి జాతీయ పురస్కారం అందుకుంది.



# ఆకట్టుకోని భావోద్వేగాల అర్జున్ S/O వైజయంతి

మళ్లీ ఇప్పుడు అదే తరహా పాత్రను ఆమె పోషించే సరికీ సహజంగానే ప్రేక్షకులకు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమా మీద ఆసక్తి కలిగింది. ఇక కళ్యాణ్ రామ్ విషయానికి వస్తే... అతనికి విజయాల కంటే అపజయాలే ఎక్కువ. అయినా మడమ తిప్పకుండా ముందుకు సాగుతున్నాడు. విభిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటున్నాడు. అవకాశం చిక్కితే తన సొంత బ్యానర్ ఎన్టీఆర్ ఆర్ట్స్ మీద కూడా సినిమాలను నిర్మిస్తున్నాడు. అయితే... 'బింబిసార' చిత్రం తర్వాత వచ్చిన 'అమిగోస్', 'డెవిల్' చిత్రాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. దాంతో కళ్యాణ్ రామ్ ఆచితూచి అడుగులు వేస్తూ, 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

కథ విషయానికి వస్తే... ఐపీఎస్ ఆఫీసర్ వైజయంతి (విజయశాంతి) తన కొడుకు అర్జున్ (కళ్యాణ్ రామ్) కూడా తనలాగే ఐపీఎస్ కావాలని కలలు కంటుంది. కోస్ట్ గార్డ్ ఆఫీసర్ అయిన అర్జున్ తండ్రి విశ్వనాథ్ (ఆనంద్)ను స్మగ్లర్ మహంకాళి, అతని తమ్ముడు పైడితల్లి హత్య చేస్తారు. చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని శిక్ష పడకుండా తప్పించుకుంటారు. దాంతో అర్జున్ ఆవేశంతో పైడితల్లిని కోర్టు ఆవరణలో కొట్టడంతో అతను చనిపోతాడు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం కరెక్ట్ కాదని, పోలీసులకు లొంగిపొమ్మని వైజయంతి కొడుకును కోరుతుంది. నరరూప రాక్షసుడైన మహంకాళి నుండి మత్స్యకారులను కాపాడటం కోసం అర్జున్ సిద్ధపడతాడు. వైజాగ్‌లోని అరాచక శక్తుల ఆటకట్టించడానికి అతనే ఓ సమాంతరం ప్రభుత్వాన్ని నడుపుతుంటాడు. ఇదిలా ఉంటే... గతంలో వైజయంతి అరెస్ట్ చేయడంతో జైలు పాలైన పఠాన్ (సోహైల్ ఖాన్) అక్కడ నుంచి తప్పించుకుని వచ్చి ఆమెను హత మార్చాలను కుంటాడు. మహంకాళి అకృత్యాలకు అర్జున్ ఎలా అడ్డుకట్ట వేశాడు? తల్లిని పఠాన్ బారి నుండి ఎలా కాపాడాడు? ఈ మొత్తం వ్యవహారంలో కొత్తగా వచ్చిన పోలీస్ కమిషనర్ (శ్రీకాంత్) పాత్ర ఏమిటీ? అనేది ఈ చిత్ర కథ.

'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'కి విజయశాంతి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంటే ఈ కథలో ఏదో ప్రత్యేకత ఉండి ఉంటుందని ప్రేక్షకులు భావించారు. అయితే అలాంటిదేమీ ఇందులో కనిపించదు. రొటీన్ యాక్షన్ డ్రామాగానే దర్శకుడు ప్రదీప్ చిలుకూరి దీన్ని తెరకెక్కించాడు. నిజానికి విజయశాంతి, ఆమె కొడుకు కళ్యాణ్ రామ్ మధ్య భావోద్వేగాలను ఇంకా అద్భుతంగా పండించొచ్చు. ఆ ప్రయత్నం జరగలేదు. సెంటిమెంట్ సీన్స్ మీద కంటే కూడా యాక్షన్ ఎపిసోడ్స్ మీదనే ప్రదీప్ ఎక్కువ దృష్టి పెట్టాడు. ఐపీఎస్ అధికారిణిగా ఇటు వైజయంతితో చేయించిన ఫైట్స్ ఒక ఎత్తు అయితే... చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని అర్జున్ చేసే పోరాటాలు మరో ఎత్తు. దాంతో సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ ఒకే తరహాలో సాగిపోయింది. హీరోహీరోయిన్ల మధ్య అనుబంధాన్ని కూడా బలంగా చూపించలేక పోయారు. క్లయిమాక్స్ సీన్ ఆడియెన్స్‌ను ఓ మేరకు షాక్‌కు గురిచేసేదే అయినా... అప్పటికే యాక్షన్ డోస్ ఓవర్ కావడంతో నీరసించిన ప్రేక్షకులను అది పెద్దంత సంభ్రమను కలిగించదు.

నటీనటుల విషయానికి వస్తే... విజయశాంతి ప్రతిభగల నటి. ఎలాంటి పాత్రలనైనా అవలీలగా చేయగలదు. ఇక పోలీస్ ఆఫీసర్ పాత్రను ఇస్తే... అది మరో రేంజ్‌లో ఉంటుంది. ఈ సినిమాలోనూ ఆమెపై చిత్రీకరించిన పోరాట సన్నివేశాలు క్రిస్పీగా బాగున్నాయి. యాక్షన్ విషయంలో విజయశాంతిని సరిగ్గా ఉపయోగించుకున్న దర్శకుడు సెంటిమెంట్ విషయంలో ఆమె నుండి ఆశించిన స్థాయిలో నటనను రాబట్టుకోలేకపోయాడు. నిజానికి బలమైన సన్నివేశాలను రాసుకోలేకపోయాడు. కళ్యాణ్ రామ్ సైతం యాక్షన్ మీదనే ఎక్కువ ఫోకస్ పెట్టాడు. హీరోయిన్ సాయి మంజ్రేకర్‌ది ఇందులో పెద్దంత ప్రాధాన్యం ఉన్న పాత్ర కాదు. విలన్ పాత్ర పోషించిన బాలీవుడ్ నటుడు సోహైల్ ఖాన్‌కూ పెద్దంత ప్రాధాన్యత లేదు. ఇతర ప్రధాన పాత్రధారులలో మెప్పించింది శ్రీకాంత్, పృథ్వీ మాత్రమే. హీరో తండ్రిగా ఆనంద్ నటించాడు. అజనీశ్ లోక్‌నాథ్ సమకూర్చిన స్వరాలు ఏమంత గొప్పగా లేవు. నేపథ్య సంగీతం సన్నివేశాలను ఎలివేట్ చేసేలా ఉంది. రాంప్రసాద్ సినిమాటోగ్రఫీ బాగుంది. సంభాషణలు, యాక్షన్ కొరియోగ్రఫీ చెప్పుకోదగ్గవి. మూవీ ట్రైలర్‌లోని సెంటిమెంట్ సీన్స్ చూసి... ఇది తల్లీకొడుకుల సెంటిమెంట్ మూవీ అనే భావనతో థియేటర్‌కు వస్తే... కాస్తంత నిరాశకు గురి కాక తప్పదు. అయితే... యాక్షన్ సినిమాలు ఇష్టపడే వారికి ఓ మోస్తరుగా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' నచ్చే ఆస్కారం లేకపోలేదు. నిర్మాతలు అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఖర్చుకు వెనుకాడకుండా నిర్మించారు. కానీ మితిమీరిన హింసకు ప్రాధాన్యం ఇవ్వడం తో ఫ్యామిలీ ఆడియన్స్ నుండి ఆశించిన స్థాయిలో స్పందన కరవైంది.

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# మే 2 నుంచి కేదార్‌నాథుని దర్శనం


పరమ పవిత్రమైన శ్రీ కేదార్‌నాథ్ ధామ్ ద్వారాలు మే 2న తెరుచుకుంటాయని బద్రీనాథ్-కేదార్‌నాథ్ దేవస్థానం కమిటీ – బీకేటీసీ అధికార ప్రతినిధి ఏప్రిల్ 18న తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేసారు. తదనుగుణంగా శ్రీ బద్రీనాథ్ ధామ్ తలుపులు మే 4న, శ్రీ మద్‌మహేశ్వర్ దేవస్థానం (రెండవ కేదార్) ద్వారాలు మే 21, శ్రీ తుంగ్‌నాథ్ దేవస్థానం(మూడవ కేదార్) తలుపులు మే 2న తెరుచుకుంటాయి. చార్‌ధామ్ యాత్ర హిందూ తీర్థయాత్రల్లో అత్యంత కీలకమైనది. భక్తులు చార్‌ధామ్ యాత్రలో భాగంగా నాలుగు పవిత్రమైన హిమవత్ పర్వత పుణ్యక్షేత్రాలైన యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను సందర్శించుకుంటారు. హిందీ భాషలో 'చార్' అంటే నాలుగు, 'ధామ్' అంటే ధార్మిక గమ్యస్థానాలు అని అర్థం. పెద్దలు చెప్పినదాని ప్రకారం ఎవరైనా చార్ ధామ్ యాత్రను గుడిలో ప్రదక్షిణ చేసినట్టుగా చేయాలి. దాని ప్రకారం యాత్ర యమునోత్రి నుంచి మొదలవుతుంది. ఆ తర్వాత గంగోత్రి, కేధార్‌నాథ్‌ల మీదుగా ఎట్టకేలకు బద్రీనాథ్ వద్ద సంపూర్ణమవుతుంది. భక్తులు చార్‌ధామ్ యాత్రను రోడ్డు, హెలికాప్టర్ సేవలను పొందడం ద్వారా చేయవచ్చు. భక్తుల్లో కొందరు దో ధామ్ యాత్ర అంటే రెండు పుణ్య క్షేత్రాలు కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను సందర్శించుకుంటారు.



From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 27



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.300/-




వెల : ₹.300/-





వెల : ₹.100/-





వెల : ₹.160/-





వెల : ₹.200/-





వెల : ₹.499/-





వెల : ₹.300/-





వెల : ₹.120/-





వెల : ₹.300/-





వెల : ₹.180/-




వెల : ₹.350/-





వెల: PB ₹.550/-




వెల :₹.450/-




వెల : ₹.699/-




వెల : ₹.150/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!
సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138
వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687


Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01